
ఆంధ్రపత్రిక

...చిత్ర వారపత్రిక



25 నయాపైస...
3-7-57

ANDHRA PATRIKA
...LLUSTRATED WEEKLY



శంఖచక్రగదాపాణి

(ఐహోళె శిల్పం) ఫొటో జి. రామమూర్తి—తంజావూరు.



పుష్పలావిక

—చిత్రకారుడు: జె. శశిభూషణ్.

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 44
3-7-57

హేవిళంబి ఆషాఢ శుద్ధ సప్తమి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నర్గీస్

అభివాదాల పద్ధతులు	4	ప్రేమలేఖ పర్యవసానం	12	ఆడపిల్లల పెళ్ళిళ్లు - తల్లిదండ్రుల అగచాట్లు	28
బుడుగు టపా	5	జానకీ కళ్యాణం	13	సమానత్వ సాధన	36
స్వోత్కర్ష కాదు ..	6	కాకి మూక	17	గొల్లవాని గొప్పతనం	43
ఊరక రానివారు	9	గాలిలో హత్య	19	ఉట్టిమీది వెండిగిన్నె	44
		పంచతంత్రము	20	సినిమా	50
		గాలికోళ్లు	23	బొంబాయి సినిమాలేఖ	55
		వనితాలోకం	27		

పాఠకలోకంపై పన్నీటిజల్లు!

★ వినాయకచవితికి ★

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక



హాస్యసంచిక



నవ్వు ఆనందానికీ, ఆరోగ్యానికీ పర్యాయపదం. హాస్యం అనేకవిధాలుగా ఉంటుంది. పల్లెటూరిహాస్యం ముతక; బస్తీహాస్యం మెతక. కోర్టుల్లో జడ్జీలు, లాయర్లు, ముద్దాయిలు; ఆస్పత్రుల్లో డాక్టర్లు, రోగులు; పాఠశాలల్లో మేష్టర్లు, విద్యార్థులు, ఒకరిమీదఒకరు ఛలోక్తులు విసురుకుంటారు. ఇంట్లో భార్యాభర్తలు, బావామరదళ్లు, బావామరుదులు, పెళ్లిళ్లలో వియ్యాలవారు వేళాకోళా లాడుకుంటారు. రాజకీయాల్లో, సాహిత్యంలో, నాటక రంగస్థలాలమీద హాస్యప్రియులుగా ప్రసిద్ధికెక్కిన ప్రముఖు లెందరో ఉన్నారు. హాస్యానిది జీవితంలో విశిష్టస్థానం.

తెలుగులో హాస్యరచనలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఏడాది ఆంధ్ర వారపత్రిక వినాయకచవితి [28-8-57] సంచికను హాస్యసంచికగా ప్రచురిస్తున్నాము. సంచిక ఆసాంతం హాస్యం ఉట్టిపడేలా చేయాలని మా ఆశయం.

హాస్యరసప్రధానమైన కథలు, నాటికలు, వ్యాసాలు, గేయాలు, ఛలోక్తులు, వేళాకోళాలు, ఇవికాక దైనికజీవితానికీ, రాజకీయాలకూ సంబంధించిన కార్టూన్ చిత్రాలు ప్రచురిస్తాము. వనితాలోకం, బాలసాహితి, సినిమాశీర్షికలలోకూడా అన్నీ హాస్యరచనలే ప్రచురిస్తాము. ఆంధ్ర రచయితలు, ముఖ్యంగా హాస్య రచయితలు మా ఆశయం జయప్రదంగా నెరవేరడంలో సహకరిస్తారని విశ్వసిస్తున్నాము. వేళాకోళమాడడం తెలుగు ఆడబడుచులకు వెన్నతో పెట్టిన విద్య. అందుచేత వనితల సహకారానికీ ఇదే మా ప్రత్యేక విజ్ఞప్తి.

హాస్యసంచికకు రచనలు పంపేవారు ఆగస్టు 1 వ తేదీకే మాకు అందేలా "సచిత్ర వారపత్రిక హాస్యసంచికకు" అని వ్రాసి పంపించాలి. కథలైనా, నాటికలైనా, వ్యాసాలైనా వారపత్రికలో మూడు పేజీలకు మించకూడదు. కార్టూన్ చిత్రాలు డ్రాయింగ్ పేపరుమీద ఇండియన్ ఇంక్‌తోనే వేసిపంపాలి.

ఒక ముఖ్యమైన గమనిక

వినాయకచవితి హాస్యసంచిక కవరుపేజీ విషయమై ఒక చిన్న సవరణ చేస్తున్నాము. కవరు పేజీకి వినాయకునికి సంబంధించిన సన్నివేశంకాక, చిత్రకారులు తమకుతోచిన ఏహాస్య సన్నివేశమైనాసరే తీసుకుని వర్ణచిత్రం పంపవలసిందిగా విజ్ఞప్తి. కవరుపేజీకి అంగీకరించిన చిత్రానికి రూ. 50/- పారితోషిక మిస్తాము. [సైజు 8" × 11".]

ఒకరినొకరు కలుసుకున్నప్పుడు

అభివాదాల పద్ధతులు

వెన్నెలగంటి అంజనీదేవి

భారతదేశంలో గౌరవనీయులనుగానీ, బంధువులనుగానీ, పరిచిత వ్యక్తులనుగానీ కలుసుకున్నప్పుడు మనము మన మనోభావాలను విభిన్న ప్రకారములుగా వ్యక్తపరుస్తాము. దీనిని 'అభివాదము' అని అందురు. మనము మన సమవయస్కులను కలుసుకున్నపుడు చిరునవ్వుముఖంతో ఒకరి యోగక్షేమములను మరి ఒకరు అడిగి తెలుసుకుంటాము. పెద్దవారిని కలుసుకున్నప్పుడు ప్రణామము చేస్తాము. మనకంటే బాగా చిన్నవారైతే ఆశీర్వదిస్తాము.

ఈ అభివాదములు ఒక్కొక్క దేశములో ఒక్కొక్క రకంగా ఉంటాయి. భారత దేశపు పశ్చిమ ప్రాంతమువారు ఒకరినొకరి కలుసుకున్నపుడు "రాం, రాం" అనీ. 'జయ గోపాల్' అని అంటారు. దక్షిణ భారతములో అంటే ముఖ్యముగా ఆంధ్ర ప్రదేశ్‌లో పిన్నలు పెద్దలను కలుసున్నపుడు "నమస్కారమండి" అని అంటారు. చదువుకున్నవారు... దేశమంతట కూడా 'నమస్తే' అని అభివందనము చేసుకుంటారు. మన సంప్రదాయములో నమస్కారమునకు అర్థము "నేను నీ అందలి భగవంతునకు నమస్కరిస్తున్నాను" అని దైనిక జీవనమందు ఒకరినొకరు కలుసుకున్నప్పుడు 'నమస్తే' అని చెప్పటం యాంత్రికముగా జరిగిపోతున్నది. ముసల్ మానులు కలుసకున్నప్పుడు 'సలామ్ అలేకుమ్' అని 'ఆదాబ్ అర్జ్' అనీ అంటారు ఉత్తర హిందుస్తాన్‌లో 'అలేకుమ్ సలామ్' అని చెప్పుకుంటారు.

ఆంగ్లేయులకు అమలులో ఉన్న అభివందన ప్రణామము కరచాలనము. కలసిన వారు ఒకరికొకరు గుడ్‌మార్నింగ్, గుడ్ ఈవినింగ్, గుడ్ నైట్ అని అప్పటి కాలగతిబట్టి చెప్పి కరస్పర్శ చేసుకుంటారు. ఒకరినొకరు మళ్లీ కొంతకాలము వరకు కలుసుకోము అని అనుకున్నపుడు "గుడ్ బై అని చెప్పుతారు. ఈ విధముగా చేయుటవలన వారి మధ్య పరస్పర సౌహార్దము, సద్భావము కలుగుతాయి. దూరంనుంచీ ఒకరినొకరుచూచుట తటస్థించినపుడు వినయంగా శిరస్సునే ఒకసారి వంచి యెత్తుతారు. బాగా గౌరవము చూపించదలుచుకుంటే నెత్తిమీద ఉన్న టోపీను తీసి తిరిగి తిప్పుతారు.

మలయా, లాప్ లాండ్, టాస్‌మేనియా మొదలైన ద్వీపములలో చుంబించుట, వాసనచూచుట, ముక్కు రుద్దుట మొదలైనవి చేస్తారు. రెడ్ యిండియనులు కలసినపుడు సిగరెట్లను యిచ్చి పుచ్చుకుంటారు.

ఫ్రాన్సులోనూ, బెల్జియంలోనూ టోపీ తీయు ఆచారముకలదు. ఇక్కడి వారి యింకొక ఆచారము యేమిటంటే హృదయపూర్వకంగా ఆలింగనము చేసుకుంటారు. ఈ ఆచారములో ఎక్కువ తక్కువల తారతమ్యము ఉండదు. గొప్పవాడు బీదవానిని కలుసుకున్నప్పుడు కూడ యిదేవిధంగా సుహృద్భావము ప్రకటించాలి.

స్పెయిన్ దేశంలో కృషికుల అభివందన ప్రణామము అతి విచిత్రముగా ఉంటుంది. ప్రతివారూ తమవద్ద రొట్టెముక్క ఒకటి ఉంచుకుంటారు. ఎవరినైనా కలిస్తే ఒకరి రొట్టెముక్క యింకొకరికి చూపించుకుంటారు. కాని యివ్వరు. ఫిలిప్పైనులో ఒకరినొకరు కలుస్తే ప్రతి వొక్కరు తమ చేతుల రెండింటిని చెవులమీదవుంచి, ఒక కాలు యెత్తి ప్రేమాభివాదం చేస్తారు.

చైనా దేశంలో కలుసుకున్నప్పుడు సౌహార్ధం ప్రకటించే విధానము బహు విచిత్రంగా ఉంటుంది. సంవత్సర దిని కలుసుకుంటే చేతులుజోడించి, శిరస్సువంచుతారు. ఇంకొక సమయంలో అయితే టోపీ టోపీ కలుపుతారు. కాని దానిని నెత్తిమీదినుంచీ తీయరు. ఈ ఆచారమునకు అనుకూలంగా ప్రతివారు టోపీను ఎక్కడికి వెళ్లినా కూడా తప్పని సరిగ ధరించవలసినదే. ఇంటికి ఎవరైనా వచ్చినపుడు తలమీద టోపీ లేదనుకోండి. వాళ్లు ఇంట్లోకి వెళ్ళి టోపీను ధరించి రావలసినదే గాని మామూలుగా రాకూడదు. వారు యెదుటివారి క్షేమ సమాచారములను కనుక్కునే విధం యేమిటంటే "మీరు భోజనంచేశారా?" అని.

ఆఫ్రికా ఖండంలో, మూర్ జాతీయులు కలుసుకున్నప్పుడు సౌహార్థం ప్రకటించే తరహా భయంకరంగానూ, చాలా విచిత్రంగాను ఉంటుంది. ఎవరినైనా కలసినపుడు వానిని గుఱ్ఱముమీద యెక్కి తరుముతారట. అంతటితో విడవక గుళ్ళులేని తుపాకి పెట్టి పేల్చి శబ్దముచేస్తారుట. ఈ ఆచారము తెలసిన వాడయితే పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుతాడు. అపరిచిత వ్యక్తి అయితే హడిలిపోయి పారిపోవలసిందే. ఈజిప్టులో కలసినవారు, "యీ రోజు యెండ యెలా ఉంది అని అడుగుతారుట. ఆఫ్రికాలో మరికొన్ని చోట్ల, మిత్రులు కలసినపుడు, భుజము మీది వస్త్రమును తొలగిస్తారట. ఇంకొన్ని చోట్ల ఛాతీమీది వస్త్రమును తొలగిస్తారుట.

ఈ ఆచారములు కొన్ని నవ్వుకలిగిస్తాయి. అన్ని దేశములవారూ కూడ యేదో రకంగా యెదుటి వారికి సౌహార్దము ప్రకటిస్తారు. ప్రేమ, సానుభూతి అనునవి మానవునకు ప్రపంచములో కావలసిన వానిలో ముఖ్యమైనవి. ఇవి పొందనివారు జీవితము నిస్సారమని భావిస్తారు. ★



బుడుగూ,

నీవు డిటెక్షన్ బాగాచేస్తావుట మరి. మా బామ్మ వత్తులపెట్టెలోని డబ్బులు పోయినవి. మరి నీవు, సీ గానపెసుంబాఘ్మామ్మని కెటకామీద వచ్చేసి మరి ఆడబ్బు వెతికిపెట్టవూ. టాటా.

సి హెచ్.వి. రాజ్, తాడేపల్లిగూడెం.

మా బామ్మ వత్తులుపెట్టెలో డబ్బులు పోతే, నావుండీలోనూ, సందుగాపెట్టిలోనూ డికెష్టింగు చేస్తాను. నువ్వూ అలాగే చెయ్యి.

ఫురేయ్ బుడుగూ,

నువ్వు వొచ్చేప్పుడు సీ గానపెనూ నాంబను గూడా పిలుచుకొనిరా. పక్కింటి పిన్నిగారినడిగి ఓబుట్ట జాంపళ్లు తీసుక్క రమ్మని మావొదిని నీకు రాయమన్నది తెస్తావుకదూ?

జీజీపాల్ (బెజవాడ.)

మరేమోనూ, ఇక్కడ బుట్టడు జాంపళ్లు బాగులేవుట. బెజవాడలో బోల్డు బావున్నాయట. అందుకని అక్కడికెళ్లాక వాళ్ళనడిగి కొనుక్కుందాం అని చెప్పమంది లావుపాటి పక్కింటిపిన్నిగారు. అదీ సంగతి.

బుడుగూ,

నీకు బోల్డు బోల్డు థాంక్సు చెప్పి ఉత్తరం వ్రాద్దామనుకుంటూనే మర్చిపోయాను. ఇంతవరకు ప్రచురించిన నీకథలు అన్నీ కంఠస్థంగా చదివేశాను. ఇక ముందుగూడా చదివేస్తాను. సి. గాన పెనూనాంబ వంట్లో కులాసాగాఉందా! సి. గానపెనూనాంబ ప్యాసయింది. నీవు ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసుఅయ్యావు. కంగ్రాట్యులేషంన్స టీపార్టీ ఎప్పుడిస్తావు.

సి. కల్పకం (ఏలూరు.)

ఓటోక్లాసులో చేరాకా. ఇలాని బాబాయి చెప్పాడులే.

డియర్! బుడుగూ!.

నన్ను నువ్వు ఎరగవుకాని నిన్ను మాత్రం నేను ఎలుగుదును.

మీరు ఎరగరుకాని, నేనుమాత్రం మిమ్మల్ని బోల్డు తెలుసును మీరుమేష్టరు కదూ. పేరు కె. ఎల్. ఎన్. శాస్త్రి. ఊరు అయినాపురం. మరి కుంచెం చదువూ బోల్డు ఆడుకోడం నేర్పుతానని ఇంకానేమో పనసతొనలు బోల్డు ఇస్తావని ఆసిపెట్టితే నిఝంగానె వచేస్తాను తెలుసా పాపం?

బుడుగుగారూ;

"బుడుగు లాంటి అబ్బాయి వుంటే బాగుంటుంది" అని నేను మొన్న రాధతో అన్నాను. అప్పుడు రాధ ఏమందో తెలుసా? "వట్టి అల్లరివాడు బుడుగు. చదువూ, సంధ్యా ఏమీ వద్దట! మనకేమీ వద్దు" అని అంది. నాకు బోల్డెంత కోపం ఒచ్చేసింది. "బుడుగును చూచి మాష్టారు భయపడి బడికి సెలవులిచ్చేశారు. బుడుగేం చేస్తాడు?" అన్నాను "నేను బుడుగుకు చదువు చెప్తాను. చదవకపోతే యిలా చెవి ప్రెవేటు చెప్తాను. రమ్మనండి" అని అంది రాధ ఇలా చూస్తూ. మరి వస్తావా? సీ గాన పెనూనాంబ నీతో రాకపోతే ఫర్వాలేదు. ఇక్కడ మా గాన పెనూనాంబ వుందిలే! మారాధ నీకుఎక్కువగా ప్రవేటు చెప్పదులే!

ఎం. సుబ్బారావు, (విజయవాడ).

కుంచెం ప్రెవేటు చెప్పినాసరే గాని, ముందస్తుగా చెవి ఎటువేపు తిప్పాలో మా పాతమేష్టర్ని అడుగు కుంటా మరి?

ఫురేయ్! బుడుగూ!

మా పాపాయి చావిట్లో పడుకొని ఏడుస్తుంటే ఉంగాబాషలో నీ ఖబలు చెప్తే ఇలాచూసి ఆలావవ్వేసి హాయిగా ఆడుకొంది. ఇప్పుడంటోందిగదా "ఉంగా గాగాంగావువూంగా" అని అంటోంది. (అంటె తెలుగర్థం మళ్ళీ బుడుగు ఖబలు వచ్చి ఎప్పుడు చెప్తాడే). చూశావా మరి దానికి గూడ నీభాష తెలిసింది. విన్నావా నీకోలకు ఎంతమంది ఎదురు చూత్తున్నారో. కనుక నువ్వు అర్జంటుగావచ్చి బొమ్మలు వేస్తూ మాకు ఖబలు చెప్పాలిమరి. వస్తావుగా!

నీ కథలో నువ్వే బావున్నావు. సీ గానపెనూనాంబ కూడ బెస్టుగా ఉంది. పక్కింటి పిన్నిగార్ని చూసి హడ్డిలిపోయానుకో కోపంతో (అంటె బయమని నీకు తెల్సుగా). అందులో కథోవాడు పూర్తిలావు వెయ్యలేదని చెప్పావు. ఆమె లావు అంతా వేస్తే ఇంకెంత హడ్డిలిపోయి వుండేదాన్నో!

నాపేరు మండువ సరోజని
మాఊరు హనుమకొండ

ఎంత హడ్డిలిపోతావో కుంచెం చెప్పచూద్దాం.

బుడుగూ,

యిక్కడ చాలా భోల్డు కథోల వాళ్లున్నారు. మనం మాంఛి కథోలు మాడ్డో ప్పుదో తీయించేసుకుందాము. ఇక్కడ భోలు పాపాపాయిలు, హీంకా భోలు కాలేజీగరల్సులు వున్నారు. అంచేత మీ బాబాయిని కూడా తీసుకొచ్చెయ్యి. పాపం నిఝంగా చూస్తాడు అందర్నీ.

(49-వ పేజీ చూడండి)

సాహిత్యం కాదు

అలా దక్షిణపువేపున గోవుల్ని ముట్టడించారని తెలిసి నాన్నగారు సైన్యం సమాయత్తం చేసుకుని వెళ్లారు. నగరంలో యోధుడనే ప్రతివాడూ వారివెంటే వెళ్ళటం మూలాన ఊసుపోక అంతఃపురానికి వెళ్ళి కూర్చున్నాను. అక్కడి స్త్రీ జనమంతా యీ పోరాటాన్ని గురించి కన్నులు యింతింతలు చేసుకుని గుసగుసలు చెప్పుకొంటున్నారు.

నాకు నవ్వువచ్చినది. ఈ ఆడవారు ఎంతముగ్ధలు! యుద్ధభూమి ఎలా వుంటుందో, యుద్ధరంగం ఎంత భీకరమైనదో - వీళ్లు ఊహించనైనా లేరు. ఒకవేళ అట్టి భయంకర రణరంగం చూడటం తటస్థించినా-వీళ్లు తరసలుపెట్టి మూర్ఛలు పోతారు!

ఇంతలో-ఉత్తరపు వేపున మేస్తూవున్న గోవుల్ని కూడా కౌరవసైన్యాలు ముట్టడించాయని పిడుగులాంటివార్త వచ్చింది వార్త వింటూనే - అంతఃపుర కాంతల ముఖాలు వెలాతెలాపోయినవి. నాకు మహా పౌరుషము వచ్చినది.

ఈ కౌరవుల ఆగడము ఏమి చూచుకొని! విరాటమహారాజు కుమారుడూ, మహావీరుడూ అయిన ఉత్తర కుమారుడు నగరంలో ఉండగానే? క్షణంలో వీరినీ, వీరిసైన్యాన్ని అల్లకల్లోలం చేసి పరిమార్చివేయాలె!

అప్పటికే నా మనస్సులో ఒక దృఢనిశ్చయానికి వచ్చినాను. ఆడవారు అప్పుడే కళ్లనీళ్ల పర్యంతమైనారు. వారిని ఓదార్చి - నా అవక్ర పరాక్రమమూ - సంగరభూమికి నేను వెళ్లిదల్చిన వైనమూ వారికి బోధపరచి-సముదాయించుసరికి నా తలప్రాణము తోకకు వచ్చినది.

చటుక్కున నాకు స్ఫురణకువచ్చినది. ఎంతటి సామర్థ్యం ఉండి ఏమి లాభము! నాకు సమయానికి రథసారథి లేడు! సారథి లేని రథముతో రణరంగానికి ఎట్లా వెళ్ళగలను? సుశిక్షితులైన సారథులందరూ నాన్నగారిలోనే వెళ్లిఉన్నారు. ప్రవాహమువంటి నా ఉత్సాహ సంరంభమంతా ఒక్కసారి అణగారి పోయినట్లయినది. ఏమీ మార్గాంతరము తోచక అట్లై కూర్చుండిపోయినాను.

విషయము తెలిసి అంతఃపురజనము స్థాణువులై నిలబడినారు. వారుమాత్ర మేమి చేయగలరు? అపరాహ్ణ మవుతున్నది. ఈ అబలలమధ్య నేనూ చేతగానివానివలె ఎంతసేపు కూర్చుండవలెనో నాకు తోచలేదు.

ఇంతలో ఏదో సంరంభముతో ఉత్తర నా కడకు పరుగిడివచ్చినది. ఆమె నాకు చిన్నారిచెల్లెలు ఆమె నా ప్రాణమునకు ప్రాణము. తరగలవలె తళతళలాడు కన్నులు అల్లలనార్చుతూ ఉత్తర నా చెవిలో యేమేమో చెప్పినది.

ఆ బాలిక అమాయికతకు పక పక నవ్వినాను. తన నాట్యాచార్యునిపైన తనకు అభిమానం ఉండవచ్చుగాక! అతడు నాసారథి ఏమిటి? ఇది మాదాసి సైరంధ్రితలలో మొలకెత్తిన ఆలోచన అట! ఆమె ఆ మొలకను పదిలముగా తెచ్చి యీ మెగారి మెదడులో నాటినది. ఇంకేమి, యీ పిచ్చిబాలిక

పురాణగాథ

యింతటి సాయము నాకు చేయవలెనని పరుగెత్తుకవచ్చినది! అహో, ఆడవారి మేధా సంపత్తి!

ఉత్తర నా సమాధానము విని చిన్నబుచ్చుకుని వెళ్లినది. వెళ్లినది వెళ్ళినట్లుండవచ్చునా-మరికొంతసేపటికి ఆ సైరంధ్రి నే వెంటపెట్టుకుని చక్కావచ్చినది. తనకు తోడు కావాలును! వెఱ్ఱిబాగుల ఉత్తర!

ఆ వచ్చిన సైరంధ్రిముందర నేనే మాట్లాడలేకపోయినాను. అన్ని ఆక్షేపణలనూ చిత్రంగా ఖండించివేసి - ఆ నాట్యమూ, సంగీతమూ నేర్పుకునే ఆచార్యుని - సమర్థించి ఒక మహాయోధునిగా చిత్రించివేసింది! ఆమె వాక్చాతుర్యానికి నిశ్చేష్టుడనైన నాకు నోట మాటరాలేదు!

ఆ బృహన్నల ఒక నివురు గప్పిన నిప్పట. ఖాండవదహన సమయంలో అర్జునునికి రథసారథిగా వుండి అతని విజయానికి కారకుడైనాట! ధర్మజుని కొలువులో తాను ఉండగా కన్నులార యీ విషయము చూచినదట! అర్జునునికి మహాప్రీతిపాత్రుడైనసారథి బృహన్నల అట! భగవంతుడిచ్చిన ఆకారానికి అతడేమి చేయగలడు? రణరంగంలో అక్కరకు వచ్చేది నాక చక్యమూ, నిపుణతా కాని - రూపురేఖావిలాసము కాదుకదా! .. సైరంధ్రి బృహన్నల తరపున న్యాయవాదివలె వాదించినది.

నాకున్నూ గత్యంతరము తోచలేదు. సైరంధ్రి మాటలు నాకు విశ్వసనీయములుగా తోచనప్పటికీ-ఆ బృహన్నలనే రథసారథిగా అంగీకరించక తప్పలేదు! కాలవైపరీత్యం! గుసున్నానే ఆ నాట్యాచార్యునికి కోసం కబురుపెట్టినాను.

అతనిది పురుషోచితమైన నడక కాదు. ఆడపిల్లవలెనే మహాసిగ్గుపడుతూ, ప్రతి అడుగులో తాళగతులు ప్రదర్శిస్తూ, వచ్చి నమస్కరించినాడు. ఇతడా రథసారథి! యుద్ధరంగంలోనూ ఇలాగే శత్రుసైన్యాలనుచూచి సిగ్గుపడడా?

నాట్యమూ, సంగీతమూ చెప్పుకొనుటయందు తాను ప్రవీణుడే కానీ - యుద్ధరంగంలో రథసారథ్యము చేయగల స్థైర్యము తనలో లేదని కొంతసేపు కసిగినాడు. కాని-తానేమో మహావీరుడైనట్లు నేను మరీ మరీ పొగడగా - తలవంచి సమ్మతించినట్లు తల ఊపినాడు.

ఆఖరుకు శిరస్త్రాణమూ, శరీర కవచమూ, తొడుగుకోవటం కూడా ఆ బృహన్నలకు చాతకాలేదు! అంతఃపురస్త్రీలలో ఒకటే నవ్వుల గలగలలు!

పొర్లివస్తున్న చిడిముడిపాటును నాలోనే అణుచుకొని నేనే ఆ మూర్తీభవించిన వీరత్వానికి కవచాదులు తొడిగినాను - ఉత్తర మాకు హారతి యిచ్చినది. చిరునగవుతో మమ్ము సాగనంపిన ఉత్తరముఖము నాకు ఎదురు రాగల విజయలక్ష్మివలె గోచరించినది.

ఆమె శుద్ధబాలిక! శత్రువుల శిరోవేష్టనములలో రంగురంగుల వస్త్రములు బొమ్మ పాత్తికలకై తనకు కావలెనట. అదెంతటి

పని! నవ్వుతూ ఉత్తర భుజముపై ఒక్క చరపు చరచి రథ మధిరోహించినాను.

* * *

బారులు తీర్చిఉన్న కురుసైన్యము చూచీ చూచుటతోడనే నాలో ఏదో కంపము పొగినది. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, కర్ణుడు, దుర్యోధనుడు—వీరందరూ యోధులుగాగల మహాసైన్యమెక్కడ? అర్భకుడను, ఒంటరిని-నేనెక్కడ! తలచిన కొలది నన్ను భయము—తొట్రుపాటు—ముంచెత్తినవి.

మెల్లగా బృహన్నలను బ్రతిమాలినాను-రథము వెనుకకు మరలించమని, బలాబలాలు యింతటి వ్యత్యస్తముగా వున్నప్పుడు, మూర్ఖించి ముందుకు వెళ్లటం-బుద్ధిమంతుల పనికాదని చేతులుపట్టుకొని వేడుకొన్నాను.

బృహన్నలలో కొంత మూర్ఖత్వముకూడ ఉన్నదేమో-నామాటలు పెడచెవిని పెట్టి రథము ముందుకే సాగనిస్తున్నాడు. నాకు శ్రీరంగనీతులున్నూ వల్లిస్తున్నాడు. యుద్ధ భూమికనివచ్చి వెనుకకు మరలిపోవటం వీరోచిత లక్షణంకాదట! ఈ సమరనీతులు ఎవరు ఎరుగరు? అక్కడకు తానొక మహావీరుడైనట్లు! అంతఃపురంలో ప్రగల్భంపలికి వచ్చి విజయలక్ష్మి లేకుండానే తిరిగి వెళితే-స్త్రీ జనము మధ్య హాస్యాస్పదుడనౌతానట! స్త్రీ జనముమధ్య గౌరవముకంటే ప్రాణములు ఎక్కువని-యీ వెఱ్ఱి బృహన్నల ఎరుగడు!

అరదము కురుసైన్యానికి మరీదగ్గరగా చేరబోతున్నది నాకు ముచ్చెమటలు పోసినవి. అనుకోకుండా క్రిందకు లంఘించి శక్తికొలదీ ఒకటే పరుగు తీసినాను.

ఈ బృహన్నల మహా అసాధ్యుడు! రథము ఆపి త్రుటిలో తానూ నా వెనకనే పరుగిడివచ్చి జలగవలె నన్ను పట్టుకొన్నాడు! ఆ పరుగులో వేగమేకాని - భరతనాట్యాల



★ స్వోత్కర్ష కాదు... ★

కొడుపులు లేవు అతని ముఖములో - ఏదో దృఢతర కార్యదీక్షే కాని - అతనికి అలవాటయిన స్త్రీత్వపు హొయలు లేవు!

నన్ను బాలకుని వలె ఎత్తితెచ్చి రథముపై కూర్చుండబెట్టి బృహన్నల అన్నాడు ఆశ్చర్యంగా, మహా బలసంపన్నంగావున్న కురు సైన్యాన్ని తానొక్కడే ఓడించి గోవులను సంరక్షించి తెస్తాడట! కాని నేను తనకు సారధిని కావలెనట! ఎంతటి విచిత్రము! ఉత్తరకు నాట్యగురువు కౌరవ సైన్యాన్ని జయించటమా! నేనాతనికి రథసారధినిగా ఉండవలెనా! నాలో బృహన్నల పై కోపము, విసుగు—ఆవిరులై వచ్చినవి.

కాని చేయగలది లేదు ఈబృహన్నల పట్టిన పట్టు విడవడు. ఈ దినముతో నా జీవితము అంతమౌతున్నదని గుండె రాయి చేసుకుని—

ఒక్క నిట్టూర్పు విడిచి అశ్వాల పగ్గాలు పట్టుకున్నాను

దాపున ఉన్న శమీ వృక్షము దగ్గర రథము ఆపి నన్ను పైకి యెక్కి అర్జునుని విల్లు-గాండీవము తెమ్మని బృహన్నల ఆజ్ఞాపించినాడు. అది విల్లు కాదు - ఏదో శవము వలె వున్నది. రా దబిడ్డను - వృక్షారోహణము చేయమనీ, ప్రేతమును స్పృశించుమనీ, నన్ను ఆజ్ఞాపించుటకు యీ బృహన్నలకు హక్కేమున్నది? కోపంతో, నాతనువంతా ఉడికిపోతుండగా, ఆ పని నేను చేయజాలనని బృహన్నలతో నిక్కచ్చిగా చెప్పివేసినాను.

బృహన్నల యమకింకరుడు! అది శవము కాదనీ, పాండవులు అజ్ఞాత వాసానికి వెడుతూ తమ అస్త్రాలన్నీ కట్టుదిట్టము చేసి ఆశమీ వృక్షము మీద దాచినారనీ, నాకు అరగడియ ఉపన్యాసమిచ్చినాడు

ఈ శమీ వృక్షమూ, ఈ ఆయుధాల దాపరికమూ, యీ బృహన్నలకు ఎలా తెలుసును? ఏయే ఆయుధము ఎవరిదైనదీ, వాటి పేర్లతో సహా బృహన్నల నాకు తెల్పినాడు. విస్తుపోతూ, బృహన్నల వంకే చూస్తూ ప్రాన్పడి నుంచున్నాను

పాండవులు నాకు ప్రీతి గూర్చిన మేనమామలు వారిపైన నాకు మహా భక్తి, గౌరవాలున్నూ! వారిప్పుడు ఎక్కడ ఉన్నట్లూ? వారిని గురించిన యిన్నికబుర్లు చెప్పిన బృహన్నలనే అడిగాను.

అతగాడు అదేపనిగా నవ్వుతూ మెల్ల మెల్లగా అందరి ఉనికి బయటపెట్టినాడు. వింటూనే నా హృదయము గతులు తప్పినట్లై కన్నులు వప్పజెప్పి నిరుత్తరుడనై నుంచున్నాను

పాండవులు ఏడాదినుంచీ మా ఆస్థానములోనే మేమెరుగకుండా తలలు దాచుకొన్నారు! దాసి సైరంధ్రి మాఅత్త ద్రౌపదీదేవి! భీమసేన్నమో మా వంటలవాడు వలలుడట! ధర్మసుతుడు కంకుభట్టున్నూ, అశ్వశిక్షక గోపాలకులు నకుల సహదేవులున్నూ— అని ఊహించటానికి కూడా నా మనసు వప్పలేదు

ఇక, ముసి ముసి నవ్వులు నవ్వుతూ తానే అర్జునుడనని బృహన్నల తెలుపుకొన్నప్పుడు నాగుండె క్షణమాత్రము స్పందించనేలేదు!

అలా ఆయనవంక రెప్పవేయకుండా చూస్తూనే వున్నాను. బృహన్నల విచిత్రంగా మారిపోయినాడు! ఆయన సంకల్ప బలము ఎట్టిదో కాని, ఉష్ణీషమూ, రత్నకుండలాలూ, మణిమయ కిరీటమూ, శ్వేతాంబరాలూ క్షణంలో తమంతట తామే వచ్చి ఆయనను అలంకరించుకొన్నవి! ఇక బృహన్నల ముఖంలో నెరిగిన లాలిత్యమూ,

(49-వ పేజీ చూడండి)

ఊరకరానివారు

శేషు ఆఫీసునుంచి వచ్చి కుర్చీలో కూర్చుని ఓ మోస్తరు హెచ్చుస్థాయిలో ఒకపాట పాడాడు. ఎవరూ రాకపోవడంతో మరి కొంచెం గట్టిగా పాడాడు, అప్పటికీ ఎవ్వరూ రాకపోవడంతో 'రూపా!' అని గట్టిగా పిలిచాడు.

తలుపుమీదతువ్వాలు గాలికి ఇటూ అటూ కదిలింది. గడియారం టిక్ టిక్ మంటోంది. అంతే తప్ప మనుష్యులెవరూ ఆగదిలోకి రాలేదు

శేషు ఒక్క ఉదుటునలేచి ఇల్లంతా కలయజూసి వచ్చాడు. అప్పుడతనికో క బ్రహ్మాండమైన ఆలోచనరాగా కొత్తకంగారుపడి డ్రాయరుమీదవెతికాడు. కాని అతనికి కావలసినది అక్కడ కనిపించలేదు దానితో అతను నిరుత్సాహంగా కుర్చీలో కూర్చుండిపోయి,

'హేరూపా! నాపై కోపము వచ్చినచో పుట్టింటికి పోనేల? పోతివిబో! ఉత్తరమైన వ్రాయకపోనేల? వ్రాయకపోతివిబో, తలుపు తాళమైన వేయకుండపోనేల? అధమము కాఫీకలిపి ఫ్లాస్కులో పోయకుండా పోనేల?' అని పురాణాలలోలాగా దుఃఖించాడు

ఇటువంటి విచారగ్రస్తమైన స్థితిలో శేషు 'పంఛిబనూం, ఉడ్ సె ఫి రూం' మోస్తరులో గాలిలో తేలుతూవచ్చిన రూప రాకను గమనించలేదు

'అయ్యో, ఎంతసేపయిందండీ వచ్చి? ఎదురింటావిడ వాళ్లఅల్లుడికి పెడుతున్న సూటుగుడ్డ చూపిస్తూంటే ఆలస్యమయిపోయింది. నాతెలివికాలా, వీధికళైనా చూసేనుకాదు!' అంది రూప నొచ్చుకున్నట్టు శేషు అనుకోవాలని.

'నీ తెలివికాలి పుట్టింటికి పోయితివిబో, నాకు కాఫీ కలిపి పోనక్కరలేదా?' అన్నాడు శేషు ఇందాకటి ధోరణిలోనే.

'అయ్యొరాతా, పుట్టిల్లేమిటండీ?' అంది రూప అతన్ని భుజంపట్టుకు ఊపుతూ.

అప్పుడు శేషు ఉలిక్కిపడి ఈలోకంలో పడ్డాడు. తరువాత, 'ఓ, నువ్వా, ఎప్పుడొచ్చావ్? పుట్టింటికి ఉడాయించేశావనుకున్నాను' అన్నాడు.

'ఇదేమయినా సినిమా అనుకున్నారేమిటి?' అంది రూప బూట్లు విప్పుతూ

'"తుణతుణముల్" అన్నాడు యోగివేమన' అన్నాడు శేషు లేచి బట్టలు మార్చుకుంటూ.

రూప నవ్వేసి 'పొద్దున్న పోతన్న అన్నారు కదండీ' అని లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె ఒకచేతిలో టిఫినూ రెండవచేతిలో కాఫీ పట్టుకువచ్చేసరికి శేషు కుర్చీలో కూర్చుని ఉన్నాడు అతను కాఫీకేసి ఆప్యాయంగానూ, పకోడీలకేసి మామూలుగానూ వాటిమధ్య చుక్కల్లో చంద్రుడులా ప్రకాశిస్తున్న లడ్డూకేసి భయంగానూ చూశాడు

'ఊరకరారు మహాత్ములు' అన్నాడు.

'ఇప్పుడెవరొచ్చారండీ?' అంది రూప.

'అదే. ఆ లడ్డూ. ఆ స్వీటు. పోయినసారి వచ్చినపుడు దాని సృష్టికర్తకో చీర సమ

అద్దంకి మాధవశాస్త్రి

ర్పించుకోవలసివచ్చింది. మరి ఈ సారి ఏమిజరగనున్నదో?

'ఏమండీ, ఇవాళ ఒకటో తారీకు కదూ?' అంది రూప అతని ఎదురుగా బల్లమీద కూర్చుని ముద్దు ముద్దుగా.

శేషు అంతకుమునుపు అనేకమైన ఒకటో తారీకులను చూసి ఉన్నవాడవడంచేత ఈ ప్రశ్నకి అర్థం తూణ్ణంగా తెలుసును. అయినా భయపడలేదు. ఏనాడో గుండె దిటవు చేసుకున్నాడు.

'వీరకంకణమూ, సువర్ణసుందరా?' అన్నాడు.

'ఉఁహుఁ'

'శ్రీ పా, షిఫానా?'

'అబ్బ, కాదండీ'

'మామిడిపళ్ళ చంద్రహారమా, చింతచిగురు నెక్లెసా?'

'ఛీ పోండి, మీకంతా వేళాకోళమే' అంది రూప బుంగమూతిపెట్టి సున్నితంగా అతని మోకాలుమీద కొడుతూ.

దూరదృష్టిగల శేషు వెంటనే

'ఆకిటికీతలుపులు వేసెయ్, ఎండవస్తోంది' అన్నాడు.

'అబ్బ, గాలేస్తుంది అవి అలాగ ఉంచి నేను చెప్పేదేదో వింటురూ' అందామె.

వెంటనే శేషు కిటికీవైపుతిరిగిపోయి కిటికీగుండా రోడ్డునూ, అదిదాటాక ఉన్న ఇంటినీ ఆఇంటి వరండాలోవున్న ఒక అమ్మాయినీ చూశాడు.

'ఆహాహా, అంత అందముగానున్న అబల ఎవరు?' అన్నాడు. లేచి కిటికీదగ్గరకువెళ్తూ.

రూప హడావుడిగాలేచి అతన్ని కాలరు పట్టుకు తీసుకువచ్చి కుర్చీలో కూలేసి కిటికీ గడియ వేసింది.

'అబ్బబ్బ, గాలిలేదు' అన్నాడు శేషు.

'ఇదిగో విసినికర్ర' అని రూప ఓక విసినికర్రని అతనిమీద విసిరేసింది.

'దీనితో బాధపడేకన్న ఆ తలుపు తెరుచు ...'

'నేనే విసురుతాను ఇలాగఇవ్వండి కాని మీరు మాట్లాడక నేను చెప్పేది వింటారా వినరా?' అంది రూప కోపంగా మొహం పెట్టి.

'ముఖం కాంక్రీటులాగఉన్నా మనసు స్పాంజే చెప్పు చెప్పు'

కాని రూప చెప్పబోయే విషయానికి ముఖం కాంక్రీటులా ఉంటే లాభంలేదు. అందుచేత దాన్ని స్పాంజీలా మార్చేసి,

'అదికాదండి ' అంది.

'అంతకుమునుపు నీచే చెప్పబడిన ఏ విషయమును కాదనుచున్నావు?' అన్నాడు శేషు. కాని రూప వినిపించుకోలేదు.

'మీరు ఎప్పుడు ఏమికొన్నా చీరలనీ, జాకెట్లనీ అన్నీ నాకేగాని మీరు...'

'కొంపతీసి నన్నొకొనుక్కొమన్నావేమిటి? ఆ చీర కట్టుకువెళ్తే ఆఫీసులో ఎవరైనా మూసి ప్రేమించిగలరు!'

'మిమ్మల్ని మాట్లాడద్దన్నానా?' అంటూ రూప విసురుతున్న విసినికర్రతో నే చిన్న దెబ్బ వేస్తూ.

'ఆహాహా, ఏమి సృష్టిమహిమ! మనకిగాలినిచ్చి ఆనందపరిచే విసనకర్రే వొంటికితగిల్తే ఎంత బాధపెడుతుంది!' అని విస్తుపోయాడు శేషు.

'అంచేత ఈనెలలో మీకో సూటు కొనుక్కోండీ, రామాభాయమ్మగారి అల్లుడికి పెడుతున్నారే, ఫులెన్‌సూటు, అలాంటిది.'

'హతోస్మి! రేపు సీతాబాయమ్మగారి అల్లుడు గుండు...'

'అబ్బ, ఊరుకోండి' అంది రూప ఏడుపు మొహంపెట్టి విసినికర్ర కిందపారేస్తూ,

★ ఊరకరానివారు ★

ఇంకే మైసాం అంటే ఏడ్చేస్తుందని శేషుకు తెలుసు. అందు చేత అనునయంగా ఇలా అన్నాడు.

'రూపా, నీకు తెలియదు. వులెన్ సూటు అంటే ఆర్ట్ సిల్కు కట్టేసుకోడం. దానికి బోలెడు డబ్బవుతుంది. అదీగాక, మా అసిస్టెంటు ఇంజనీరు గారికే లేదు వులెన్ సూటు. అటువంటప్పుడు నేను కొని అవిసంగా ఆఫీసుకువెళ్తే ఆయన నామీద 'బేడ్ రికార్డు' రాసి మారుమూలకి ట్రాన్సుఫరు చేయించి వేస్తాడు. కావున ఆసంగతి వదిలెయ్. నీకు మరీ అంత ముచ్చటగా ఉంటే ఒకరోజున అద్దెకు తీసుకొచ్చి ఆ వేషంలో నీఎదుట ఒకసారి అటూ ఇటూ తిరుగుతాను' అన్నాడు.

'డబ్బు విషయం బెంగ పెట్టుకోకండి. మనిద్దరం రెండొందల రూపాయ లెంచేసుకుంటాం కనక? అయినా అంతకు మునుపుది బేంక్‌లో కొంత డబ్బు ఉంది. మీ ఇంజనీరు ట్రాన్స్‌ఫర్ చేసేస్తానంటే వులెను సూటున్న అసిస్టెంటు ఇంజనీరుదగ్గర వేయించుకోండి. హాయిగా పోదాం' అంది రూప.

'సూటయ్యే ఖైరూపాయలవుతుంది తెలుసా?'

'ఓస్, ఇంతేనా. అయితే రెండు కొనుక్కోండి, ఒకటి గోధుమరంగూ ఇంకోటి ముక్కుపొడుం రంగూను' అంది రూప ముచ్చట పడుతూ.

ఇంక లాభంలేదనుకున్నాడు శేషు.

'చూడు రూపా, నాకసలు చిన్నప్పటినుంచీ వులెను అంటేనే అసహ్యం. అసలు గొర్రెలున్న చోటికే వెళ్లేవాడిని కాదు. ఆరునెలల పిల్లాడప్పుడుకూడా ఒకసారి మా నాన్నగారు వులెనుసూటు వేసుకునివస్తే చూసి భయపడిపోయి అరగంటసేపు ఏడ్చానని మొన్న మొన్నటివరకూ మా బామ్మ అంటూండేది. నా కిష్టంలేని ఆ వులెను సూటుకోసం అంత మారాం చేసేబదులు ఫలానా చీర కావాలని మాటమాత్రంగా అంటే తెచ్చిపడెయ్యనూ?......... చెప్పు—జార్జెట్టా, క్రేపా, షిఫానా, సిల్కా, నేతా?' అన్నాడు.

'గోధుమరంగు. ముందర ఒక సూటుకు తెచ్చుకోండి.'

'అంతేనా? నాగోడు వినవా?'

'ఉహూఁ. ఇప్పుడు మిమ్మల్ని ఇంట్లో ఉండనియ్యను, సూటుగుడ్డ తెచ్చేవరకూ ఇంట్లోకి రానియ్యను.'

'ఎక్కడో త్రేతాయుగంలో మనిషివిలాగ ఉన్నావు' అన్నాడు శేషు లేస్తూ.

* * *

సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు శేషు ఒక పేకెట్ పట్టుకు వచ్చాడు. రూప వీధిలో కాసుక్కూర్చుంది.

'గోధుమరంగే. సూట పన్నెండున్నర అయింది రేపు టెయిలరుకివ్వాలి' అన్నాడు రూప ఇచ్చిన మంచినీళ్లు తాగుతూ.

'ఇదేమిటి!' అంది రూప ఆశ్చర్యపోతూ.

'ఆఁ! లేకపోతే పాతిక రూపాయలకి వస్తుందనుకున్నావా?' అన్నాడు శేషు గ్లాసు పెట్టేస్తూ.

'అబ్బ డబ్బు కాదండీ, ఇందులో జార్జెట్ చీర ఉందేమిటి?' అంది రూప ఒక గులాబిరంగు జార్జెట్ చీర నతనికి చూపిస్తూ.

'అరెరె, ఇదలా వచ్చింది? మర్చిపోయి సూటు ఇచ్చేసి ఇది తెచ్చినట్టున్నాను ఖర్మ!' అన్నాడు శేషు ఒక్క గంతువేసి లేస్తూ.

'ఎవరికిచ్చేసేరండీ?' అంది రూప కంగారుతో.

'మరేం లేదులే. ఇవాళ మా ఆఫీసులో టైపిస్టుకి బర్త్ డే. పార్టీకి పిలిచింది—నీతో చెప్పడం మర్చిపోయి నట్టున్నాను. వెళ్తూ వెళ్తూ ఉత్తచేతుల్తో వెళ్ళడ మేమిటని నా సూటు గుడ్డతో పాటు ఈ చీరకూడా కొన్నాను ప్రజంటు చేయడానికి. పొరపాటున ఆ పేకెట్ ఇచ్చేసినట్టున్నాను' అన్నాడు.

రూపకు చాలా బాధ కలిగింది. తన కింతవరకూ ఒక్కటే మంచి జార్జెట్ చీరలేదు. తన కెప్పుడూ కొననిది ఎవరో టైపిస్టుకి బర్త్ డే ప్రజంటుగా కొన్నాడు!

'ఆ చీర ఇలాగ ఇయ్యి, అది ఇచ్చేసి సూటు పట్టుకువస్తాను' అన్నాడు శేషు చెయ్యి జాపుతూ.

'నే నివ్వను' అంది రూప.

'మరయితే సూ టెలాగ వస్తుంది?'

'అదే వస్తుంది. నేను ఈ చీరని మాత్రం ఇవ్వదలుచుకోలేదు. నా కింతవరకూ ఒక్కటీ మంచి జార్జెట్ చీర లేవు. అయినా మీరు నా కెందుకు కొంటారులెండి పిల్లకి వాళ్ళకి......'

'ఏయ్ రూపా, ఏమిటా పిచ్చివాగుడూ? నీకు కొనని నేనుచెప్పానా? సాయంకాలం ఎంత బతిమాలుకున్నాను? వులెను సూటే కావాలని పంతం పట్టేవుగా? నీకు కావలిస్తే వచ్చే నెలకొనుక్కుందువుగాని, ముందు ఆ చీర ఇలాగియ్యి?'

'నేను ఇవ్వను, ఇవ్వను, ఇవ్వను. మీ రేం చేసుకున్నా సరే, ఏమనుకున్నా సరే' అంది రూప. ఆ చీరని గట్టిగా అదుముకుని కిందకు చూస్తూ, కింద పెదివి కొరుకుతూ.

ఇప్పుడు మొహం రెయిన్ ఫోర్సుడు కాంక్రీటులా ఉంది అనుకున్నాడు శేషు.

ఇంతలో ఎవరో తలుపుతట్టారు. శేషు ఒక్క గంతులో అవతలకువెళ్ళాడు. కొంతసేపు ఏదో మాట్లాడాక నవ్వుతూ ఒక



స్కాండినేవియన్ దేశాలకు పోతూ ప్రధాని నెహ్రూ సిరియా రాజధాని డమాస్కస్‌లో దిగినప్పుడు సిరియా అధ్యక్షుడు శ్రీ కువట్లీ సమక్షంలో డమాస్కస్ నగర పౌరసత్వం ప్రసాదించే పత్రాన్ని స్వీకరించారు.

పార్సెల్ చేతపట్టుకు వచ్చాడు.

'ఇదిగో క్లాతు పంపించేసింది, ఇంక ఆ చీర ఇలాగియ్యి, పోయి ఇచ్చేసివస్తాను.'

'క్లాతు వచ్చేసిందిగా, ఇంక చీరాలేదు ఏమీ లేదు ఊరుకోండి' అంది రూప పార్సిలు విప్పుతూ.

'మంచిదానివి ఇంక మానం, మర్యాదా, ఏమీ అక్కరలేదేమిటి . ఓహోహో హోహో, ఇదేమిటిది ?'

పార్సెలులోంచి లేత నీలంరంగు క్రేప్ చీర బయటపడింది.

'ఏమిటండీ ఇదంతా ?' అంది రూప ఏసుపు మొహంతో.

'మన సూటు పంపించబోయి ఇంకెవరో ఇచ్చిన చీర పంపించేసినట్టుంది జై శ్రీరామచంద్రా, ఆ చీర లిలాగియ్యి వెళ్లి ఇచ్చేసి వస్తాను' అని శేషు హడావిడిగా మంచంమీద ఉన్నవాటిని తీసుకుని పరుగెత్తాడు రూప అతన్ని తలుపువరకూ సాగనంపి వెనక్కి వచ్చింది

మంచంమీద గులాబీరంగు జార్జెట్ చీరా, నీలిరంగు క్రేప్‌చీరా అలాగే ఉన్నాయి కాని చాకలి తెచ్చిన శేషు తాలూకు మడత పాంటులు రెండు అదృశ్యమయ్యాయి.

రూపకి అంతా అయోమయంగాఉంది. ఓ గ్లాసుడు మంచినీళ్ళుతాగి వచ్చింది

మరోగంటకి సైకిలుమీద ఎవరో కుర్రాడు వచ్చాడు 'అయ్యగారు ఇమ్మన్నారండి' అని ఇందాక శేషు పట్టుకుపోయిన రెండు మడత పాంట్లూ, ఒక పార్సిలూ ఇచ్చి వెళిపోయాడు

అమ్మయ్య, ఆ ఖరికి ఎలాగయితేనేం క్లాతు ఇంటికి చేరిందనుకొని రూప పార్సిలు విప్పింది.

అందులో గోధుమరంగు వులెను క్లాతుకు బదులు పసుపు పచ్చరంగు షిఫాన్ చీర ఉంది.

రూప ఏడ్చినంతపని చేసింది అదేదో ఇంగ్లీషు సినిమాలో తీసిన బీరువాలో అల్లా శవం కనిపించినట్టు తను విప్పిన పార్సిలులో అల్లా చీరలే కనిపిస్తున్నాయి.

ఒకసారి గట్టిగా నవ్వేసింది. తరువాత ఆ మూడు చీరలకేసీ చూచింది. చాలా బావున్నాయి ఏమయినా సరే, ఆ చీరలు తనవి. ఎవ్వరికీ ఇవ్వదల్చుకోలేదు

మరో కొంతసేపటికి శేషు విజిల్ వేసుకుంటూ వచ్చాడు 'ఏం రూపా, క్లాతు ఎలాగ ఉంది?' అన్నాడు

'ఇదిగో, చూడండి' అని రూప నవ్వుతూ షిఫాన్‌చీరని అతనికి చూపించింది

శేషు చిత్తరపోయాడు బుర్ర గిర్రున తిరిగింది చీర చేతుల్లోనికి తీసుకుని ఎక్కడ చూసేడో జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నించాడు. అది జ్ఞాపకం వచ్చాక తల పట్టుకుని కుర్చీలో కూలబడిపోయాడు

'పార్సిల్సు తారుమారు! అద్భుతమయిన డిటెక్టివ్ కథ! బ్రహ్మాండమయిన సస్పెన్సు' అన్నాడు

'ఇంతకీ ఆ క్లాతు ఎక్కడండీ? మీరు ఆ పాంట్లు తీసుకు పరుగెత్తారెక్కడికి? అసలు ఈ షిఫాన్ చీర ఎలా వచ్చింది?' అంది రూప

'కథంతా పూర్తిగా చెప్తాను విను!' అన్నాడు శేషు 'నేను మర్చిపోయి నా క్లాతు టైపిస్టుకి ఇచ్చేసి చీర తీసుకు వచ్చేకానా తరువాత ఆవిడ అది చూసుకుంది సరే, నా క్లాతు పంపించేద్దామనుకుంది ఇంతలో ఆవిడ స్నేహితురాలెవరో వస్తే ఆవిడతో మాట్లాడుతూ ఆవిడ కొనుక్కుని తీసుకు వెళ్తున్న క్రేప్ చీర చూడడానికి తీసుకుంది తరువాత కొంతసేపు మాట్లాడి ఆవిడ వెళిపోతున్నప్పుడు పొరపాటున మన క్లాతు ఇచ్చేసి, ఆ చీర ఇక్కడికి పంపేసింది ఆ చీరా, జార్జెట్ చీరా ఇచ్చేసి మన క్లాతు తెచ్చుకుందామనుకున్న నేను కంగారులో నా పాంట్లు పట్టుకుపోయాను. నా ఖర్మకొలి ఆ పొరపాటు నాకు మెయిన్ రోడ్డుకి వెళ్ళేవరకూ తెలియలేదు నాకు విసుగెత్తిపోయింది అప్పుడింక వెనక్కి రావాలంటే రెండుమైళ్ళదూరం ఉంది ఏమయితే అయిందని ఎదురుగుండా ఉన్న షాపులోకి వెళ్లి ఓ గులాబిరంగు జార్జెట్ చీరా, ఓ లేత నీలంరంగు క్రేప్ చీరా కొనేసివెళ్ళి ఆవిడకి ఇచ్చేశాను అప్పటికప్పుడే ఆవిడ స్నేహితురాలు మన క్లాతు పంపించేసింది. సరే, అది తీసుకు వచ్చేస్తున్నాను

'దారిలో పతీ, సూర్యం కనిపించారు పతి వాళ్లి ఆవిడకి ఓ షిఫాన్‌చీర తీసికెస్తున్నాడు. సరే కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నాం ఇంతలో ఆఫీసుప్యూను వీరన్న కనిపించాడు అతనిఇల్లు ఇటువైపే. ఎలాగా సైకిలు మీద వెళ్తున్నాడుకదాఅని నాపాంట్లూ, క్లాతూ ఇంట్లో ఇచ్చెయ్యమని ఇచ్చాను. పతి తనచీర ఇచ్చి వాళ్లింట్లో ఇచ్చెయ్యమన్నాడు. ఆ వీరన్న మళ్లీ పార్సిల్సు తారుమారుచేసినట్టున్నాడు' శేషు కథ ముగించి కొంతసేపుఆగి మళ్లా అన్నాడు

'ఛీ, ఆ వులెను క్లాతు మనకి అచ్చిరాలేదు. సూర్యం ఒకటి కొనుక్కోవాలనుకుంటున్నాడు వాడికి ఇచ్చేస్తాను'

రూప మాట్లాడలేదు 'అయితే ఆ చీర లేంచేస్తారు?' అంది కొంతసేపుపోయాక

'రేపు రిటర్ను చేసేస్తాను ఆ షిఫాను చీర పతికి పంపించేస్తాను'

'ఉహుం, అవి నాకు కావాలి పతిగారికి ఇంకో చీర పంపంచండి'

శేషునవ్వుతూ ఆమెకేసిచూశాడు "త్రుణ త్రుణముల్" అన్నాడు తిక్కనసోమయాజీ అన్నాడు.

భోజనమయ్యాక రూప రెండు లడ్డుండలు తెచ్చిఇచ్చింది

శేషు ప్లేటులోఉన్న రెండింటికీ నమస్కారంచేసి 'హే మహాత్ములారా' మీరు ఊరకరారని నాకు తెలుసును పోయినసారి ఒక్కరేవచ్చి ఒక్కచీర మాత్రమే పట్టుకుపోయారు ఈసారి త్రిమూర్తులలాగ ముగ్గురు వచ్చి మూడుచీరలని పట్టుకుపోయారు. వచ్చేసారినుంచి ఒక్కొక్కరుమాత్రమే వస్తూ ఉంటే నాకు చాలా మేలుచేసిన వారవుతారు' అన్నాడు. ★

ప్రేమలేఖ పర్యవసానం

భారతీ.....!

మొన్నటిలో బాకైన నీ మూడుతరాలకూ ఇది జవాబు

డాబామీద చల్లని పాలసంద్రంలాటి వెన్నెలలో, మెత్తటి పక్కమీద వెల్లకిలా పడుకుని నీ లేఖ మరోసారి చదువుకున్నాను.

నీ కాశ్చర్యం కదూ.! ఎలా చదివానని?

అమావాస్య రాత్రిలో ప్రేయసి కళ్ళల్లోని కాంతుల్ని, సూర్యరశ్మికి ముడుచుకున్న కలువలోని పుప్పొడి ఆరాటాన్ని చూడగల నేను-నీ లేఖ ఆ తెల్లని వెన్నెల్లో హాయిగా చదువుకున్నాను

జవాబు వ్రాయి, అంది అంతరాత్మ

సాయంత్రం షికారు కెళ్ళొస్తుంటే, రోడ్డు ప్రక్క కొట్లో మల్లెపూలు నన్ను జూచి పరిహసించినై.

నాకు కోపమొచ్చింది ఎందుకురాదు ? అవి ఇప్పుడు విచారపడుతున్నాయ్, నా ఒంటరి పక్కమీద నలిగిపోతూ.

ఇంక భావాలు రావడంలేదు

వ్రాస్తూ, వ్రాస్తూండగా ప్రకృతి నన్ను నిద్రబుచ్చింది. నా కలం 'భారతీ' అని వ్రాసి, ఆగిపోయింది. ఆ 'భా' లో ఎంత అందముంది భారతీ ! మామిడాకు కొస నుండి జారిపోతున్న హిమబిందువు గుర్తురాదూ." ఆ నిద్రలో నా కలలో, మనుషులను కప్పేస్తున్న మబ్బులు, పట్టపగలు జేసే లైట్లు, బృందగీతాల మధ్య ప్రేయసి, దూరాన కోరగా జూస్తున్న విలన్.. వీళ్ళెవరూ లేరు

జాబిల్లి కలువకన్యకేవో ఆశలు రేకెత్తించి ఆమె చేయిపట్టుకొని, తన లోకానికి లాక్కుపోతున్నాడు. కలువకన్యకళ్లు అతని దేవకాంతిలో మిలమిల మెరుస్తూ, కోర్కెలతో అతని కళ్ళలోనికి చూస్తున్నయ్.

ప్రశాంతమైన ఓ పర్ణకుటీరం నిశ్శబ్దానికి జోలపాడే సెలయేటి శబ్దం మధ్య మధ్య హరిణాల పరుగులు, వీటి మధ్య ఎంతసేపు వెన్నెలను త్రాగేశాం మనిద్దరం. మనం ఒకరిలో ఒకరం కలిసిపోయినప్పుడు-సెలయేటి నీటితో మాట్లాడినవి నీ చీర కుచ్చెళ్లు - తరువాత ఆ తడికి తెల్లయిసుక అంటుకుంది, మనకు గుర్తుగా.

ఉన్నట్లుండి నేనో పుష్పాన్నయిపోయాను నీ కళ్లు వెదుకుతున్నాయి, నేనెక్కడా అని.

మకరందం గ్రోలుదామని ఓ తుమ్మెద వేగంగా వచ్చిపడింది, నా మీద.

నాకు మెళకువ—

ఒకప్పుడు 'దేవదాసు', 'లైలామజ్ను', 'అనార్కలి', లాటి ప్రేమపుస్తకాలు చదివి వీదో తొలిచూపు ప్రేమను ఆధారంగా చేసుకొని, యీ కవులు పుస్తకాలు నింపారనుకున్నా, కాని మన ప్రథమ దివసము తరువాత వియోగము చెప్పింది మర్మం.

రాత్రి సగం వ్రాసి వదిలేశాను లేఖ పగలు వ్రాయలేదు.

తెల్లవారి సంఘంలో పడ్డాను. నీ లేఖలో సంఘం గురించి వ్రాశావుకదూ !

సంఘం గురించి నాకు చెడ్డ అభిప్రాయమేం లేదు విమర్శించడం తేలికే సంఘాన్ని చాలా మంది ప్రేమికులు తిడతారెందుకంటే, వాళ్ల మధ్య అగాధం కల్పించిందని కల్పించాలి ఆ అగాధమే లేకపోతే యింత విలువైన ప్రేమకు విలువే ఉండదు

ఒకవేళ సంఘం యీ ప్రేమికుల్నందర్నీ కూర్చోబెట్టి కలిపేస్తే-ప్రపంచంలో వదిలేస్తే—

ఏమి చేయాలో తోచని స్థితి;

ప్రేయసి గురించి భావాలులేని మనస్సు;

అందమంటే తమ చేతిలో ఆడే ఏదో వస్తువు అంతవరకే వాళ్ళ బుద్ధి ప్రకాశిస్తుంది ఎందుకంటే తమకు కావలసిన అందం, కామపు ప్రేమ వాళ్ల చేతిలో నలుగుతోందిగా! అనుకూల పరిస్థితులు

చీకటిలేందే నక్షత్రాలకు ప్రకాశమొస్తుందా ?

వియోగం లేందే ప్రేమకు విలువెలా ఉంటుంది?

"రాధ కడవపట్టుకొని యమున ఒడ్డున కూర్చుంది ఆ లేతవెన్నెలనే ఆమె కళ్లు భరించలేకపోతున్నాయి అలలుగా వచ్చే మలయ మారుతం ఆమె శరీరాన్ని గిలిగింతలు పెట్టి-చాలక చీరకొంగును కొంత దూరం ఉండగా తీసుకుపోయి వదిలేస్తున్నది నేల మీది ఎర్రటి గడ్డిపూలు ఆమె పాదాలకు పారాణి పూస్తున్నవి.

ప్రకృతికే పాఠాలు నేర్పే సౌందర్యం. రాధనుచూచి, చంద్రుడెందుకో నవ్వుకుంటున్నాడు ఎందుకామె కళ్లు విచారంగా వున్నాయ్ ? అది విచారమేనా.? ఎదురు చూపై ఉండవచ్చు

చల్లని వెన్నెల తెలుపు నదితో స్నేహంగా కలిపి, గులకరాళ్లమీదుగా పడి ప్రవహిస్తున్నది తళతళ మెరసే అకులగలగలలు. ప్రియుడి చూపులకై వేచే ప్రియురాలులా ఏమాత్రం గాలి వీచినా, రాలిపోతామనే పూలు ఈ ప్రకృతి పులకరింతును భరించలేకున్న రాధమనస్సులో మురళితో కొంటె కృష్ణుడు దరహాం రేకెత్తిస్తున్నాడు !"

నాలురోడ్ల సెంటరులో ఇటువంటి రాధ పటం పెద్దదికట్ట బిస్కెట్ కంపెనీవాళ్లు అడ్వర్టైజ్మెంటుగా ఉపయోగించుకుంటున్నారు ,

నువ్వురావడం లేదూ ,ప్రజలంటే.

ప్రొద్దున ఓ పాత పుస్తకం కోసం షెల్ఫులో వెదుకుతున్నాను. అందులో నుంచి నా కాలేజీ కాగితాల పాత ఫైల్ క్రింద పడిపోయింది చిందర వందరైపోయిన కాగితాలు సర్దుతుంటే నామనస్సెందుకో ఝల్లుమంది మొదటిరోజులో నా హృదయాన్ని దొంగిలించిన వారికి వ్రాసిన ప్రేమలేఖది

"భారతీ ! నీ చిరునవ్వులో ఎంత శిల్పం దాగి ఉందో తెలిసికోలేక పోతున్నాను ,నీ నవ యౌవన సౌందర్యాగ్నికి నన్ను ఆజ్యాన్నివి కానివ్వ!" అందులో మాటలు

అప్పుడు ఫలితం తెలియకుండా ఊహలతో వ్రాసిన లేఖ, ఇప్పుడు—ఎంత తేడా యీ చూపులకు,! సిగరెట్ నా వ్రేలిని కాల్చి మళ్లీ నన్నీలోకానికి తీసికొచ్చే వరకూ—ఆ రోజులు తల్చుకున్నాను

యుగయుగాలనుంచి వస్తున్న ఆచారంగా చీకటి పడింది చంద్రుడు చక్రవర్తయాడు క్రిందటి రాత్రిలాగా డాబామీద కూర్చుని, తక్కిన లేఖ వ్రాయడం మొదలుపెట్టాను, కలం సాగడంలేదు. డాబామీద నుండి చూస్తుంటే, దూరంగా మన మొదటి రాత్రి సంకేత స్థలం గార్డెన్‌లోని సరస్సు అంచుదగ్గరి మామిడిచెట్టు కనబడుతున్నది

ఆ రాత్రిని మన జీవితంలో మరవ

(49-వ పేజీ చూడండి)

జానకి కళ్యాణం

ఇహజీవనం సాగేదెలాగ? బతకలేక బడి పంతులయిన పరమానందానికి ఇదే చిక్కువీడని చిక్కు. ఉదయం ఆరుగంటలకే కాలకృత్యాలన్నీ తీర్చుకొని, నిష్ఠగా పట్టెవర్ధనాలు తీరుస్తాడు. అంతవరకే ఖర్చులేనిది. తర్వాత శూన్యంలోకి దూకే వాయువేగంతో సమస్యల బాణాలు ఆయన బుర్రలో దూరి, సమాధానాలకోసం వెదికివెదికి దొరకగపోగా, మొహంమీద ఒక్కొక్క వ్యథనునాటి తిరిగిపోతాయి. ఇంటికి అరమైలు దూరంలో ఉన్న బడికి కాళ్ళీడ్చుకుంటూ దేహాన్ని చేరవేస్తున్న అతనిమనస్సులోని యీఅనంతకోటి మథనాలని చూపరులెవరూ ఊహించలేరు. వృత్తిమాత్రము తలమానికమయిన ఆచార్యపదవి ఇల్లుమాత్రము అయ్యవార్లంగారి వట్టిల్లు. కుచేల సమస్యలతో అడుగడుగునా కొసులకటాక్షంకావలసిన యిహంలో దరిద్రుడూ నిర్ధనుడూ అయిన పరమానందానికి చోక్లేది సమస్యలని తీర్చకపోగా యీ షణ్మత్రయాది సమస్యలని మాత్రం సంఘం అంటగట్టింది

ఈ బతుకు భారాన్ని తేలిక చేసికోవడానికి పరమానందానికి ఉన్న చిన్ని ఊహల్లో ఏకాంతసేవ ఒకటి. ఆ ఊరికి క్రోశెడు దూరంలో చిన్నకొండఉంది. ఆకొండమీద జారుడు బండఉంది. అక్కడ కూర్చుని లోకంలోని నాస్తికత్వాన్ని, కలుషత్వాన్ని చూసి కాబోలు మొహం కంద గడ్డచేసికొని నిక్కిరిమిస్తూన్న సూర్యుణ్ణి సహజంగా మేరువులయినా తనఔన్నత్యంవల్లా అణువుల్లా బొమ్మల్లా కనపడుతున్న వృక్షాలనీ జంతువులనీ చూస్తూ ప్రొద్దుపోయేదాకా ఉండిపోయేవాడు. ఏదో గాలి విసురు పక్షుల సవ్వడి అతని మేల్కొలుపగా. నెమ్మదిగా కొండదిగి ఒక్కొక్క అనుభూతినే నెమరు వేసుకుంటూ యిల్లుచేరేవాడు. అది యిల్లుకాదు. తాతల నాటిస్థలం మాత్రం వెక్కిరించినటునిలబడగా, అందులో వేసిన ఒక మట్టికొంప. దాని మీద నామమాత్రంగా నిలబడ్డ తాటాకు కప్పు. వీధి అరుగుమీద బుడ్డి దీపం ముందు కూర్చుని గుణింతాలు వల్లెవేస్తూంటాడు తన కొడుకు.

పరమానందం యింట్లోకి వెళ్ళి స్నానం చేసి వచ్చేసరికి, బొట్టుపెట్టి నీళ్ళగ్లాసూ పీటా సిద్ధంగా ఉంచుతుంది పెద్ద కూతురు జానకి. తర్వాత భోజనం ఏదో అయిందనిపించి, దొడ్లో వాలు కుర్చీలో పడుకొని, తల వెనుక ఆన్చి సప్తర్షి మండలంలోకి అలా చూస్తూ ఉండిపోతాడు. ఆ మండలంలో ఎన్నో పురాణ గాథలు స్ఫురించేవి. సహజంగా పండితవంశమూ యింకా ఏదో వైదికమంటూ వెలగబెడుతున్న శిష్టాచారమూ, అతని భక్తి ప్రపత్తులకు దోహదమవగా. గగనంలోని ఆ తేజో రాశులని చూస్తూ మైమరచి పోయేవాడు.

'ఇలా ఎంతకాలమండీ' అన్న అర్ధాంగి వాక్యం తనని తిరిగీ యిహంలోకి లాక్కురాగా 'ఏమిటీ' అంటాడు పరమానందం. విషయం తనకు తెలిసినా, అడగటం అల

విభావరి

వాటయిన పరమానందానికిందులో విచిత్రం తోచకపోయినా, అందులోని నిర్లక్ష్యమూ, నిర్లిప్తతో ఆ అర్ధాంగి హృదయాన్ని క్రుంగదీసేది

'తెలిసి కూడా తెలియనట్టు నటిస్తారు. జానకి పెళ్ళి సంగతి'

'అవును పెళ్ళి చెయ్యాలి కాని ఎలాగ'

'అలాగని కూర్చుంటే ఎలాగ యింకెవరు చూస్తారు'

'యిదిగో చూడు. మా పిల్లని మీ కిస్తామంటూ వెళ్ళడం వారు కట్నాలతో ప్రారంభించడం. మొదటే గ్రుడ్లు తేలేసి వెనక్కి రావడం నీకు తెలియనిది కాదుగదా. భగవంతుడు రత్నాలలాంటి పిల్లలని యిచ్చాడు గాని డబ్బిచ్చాడా ధనంతో తప్ప మనుష్యుల విలువలు తూచలేని యీ సమాజంలో అదిలేని వాళ్ళం మనము ఏం చెయ్యగలం. లేని వాళ్ళకి ఉన్నవాళ్ళ మీదమోజు ఉన్నవాళ్ళకి ఉన్నవాళ్ళమీదే మోజు. యిక మిగిలిందల్లా ఆడపిల్లలనికన్నవాళ్ళు లేనివాళ్ళు. వీళ్లు ఎలా చేస్తారు పెళ్లి "

క్లాసులో పాఠంలా చెప్పుకుపోతున్న ఆ వాదానికి ఆమె చెప్పే సమాధానం మాత్రం ఏముంటుంది. దుఃఖాశ్రువులు రాల్చడం తప్ప.

*   *   *

సాయంకాలము బడి వదలివేసిన సూచనగా గంట దీర్ఘంగా కొట్టడంతోటే. అంతవరకూ పాఠాలు చెప్పుకుంటూపోతున్న పంతుళ్ళ నోళ్ళకి బ్రేకుపడింది. పిల్లలందరూ కేరింతలు కొడుతూ లేగదూడల్లా బడి ఆవరణలోకి చేరారు. చాలమంది యిళ్ళకి వెళ్ళిపోతున్నారు. మేష్టర్లందరూ, పిచ్చాపాటి చెప్పుకుంటూ మేనేజరు గదిలోకి చేరారు. పరమానందంమాత్రం ఏవో మీనమేషాలు లెక్కవేస్తూ కుర్చీలోంచి లేవలేదు. మేష్టర్లందరికీ ఆనాడు జీతాలుపంచుతాడు మేనేజర్. అందరూ ఆయనకోసం చకోరాల్లా నిరీక్షిస్తున్నారు. తనకోసమూ వారికోసం వారే ఉంటారన్నట్టుగా, గంటన్నరాలస్యంగా, నోట్లో కారాకిళ్ళీని ఊరిస్తూ, సిల్కుమడతలు నలగకుండా మత్తేభంలా నడిచివస్తున్న మేనేజరుని, అర్థంలేని నవ్వులతో, పగదాగిన నమస్కారాలతో ఆహ్వానించారు. ఆయన రాగానే డబ్బుసంచీ బల్లమీద పారేసి రిజిష్టరు ముందువేసికొని వరుసవారీగా పేర్లు పిలుస్తున్నారు. వచ్చినవాళ్లు యిచ్చినంత పుచ్చుకుని, పెట్టమన్న చోట సంతకంచేసి వెళ్ళిపోతారు. అదే అక్కడి రివాజు.

'అయ్యా! పరమానందంగారూ!. అధికారులు కాగితాలమీద చూపిన జీతాలు, కోతలతో రివాజులతో సగానికిసగం తరిగిపోగా, మిగిలిన కలికుముక్కల్ని జేబులో వేసుకుని యింటిదారి పట్టాడు పరమానందం

జీవితం అన్నిదిశలా అంధకారంలా ఉంది. ఒక్క ఆశాకిరణమయినా తన దరి జేరకుండా తనచుట్టూ ఎవరో బలమైన కవ్యాధికళ్ళెకాళ్ళు జేబులో ఉన్న యీ కష్ట జీతంతో యిన్నాళ్లుగా లాగుతూన్న సంసారాన్ని దిద్దటం ఎలా. ఎప్పుడు చూసినా రేలో

★ జానకి కళ్యాణం ★

మూడు నెలల జీతాలు బాకీపడుతూనే ఉంటాయికదా.. నిత్యజీవితంలో మాత్రం కొనుకొల్పుండే క్షణం గడవదు. ఎవరిలో మొర పెట్టేది.

మోసాలు మెలివేసే అప్పులవాళ్ల తోనా...

కట్నాలడిగే పెళ్ళిపెద్దలతోనా...

కనపడని భగవంతునితోనా ఎన్నాళ్ళు ఈ అంతులేని వృథా వ్యథలతో విశ్రాంతి మయిన జీవితం గడపటం చేసిన పాపాలు చూపించి శిక్షించటం తగునుగానీ.. నిష్కారణంగా తనకీగతేమిటి.

మతి చలించిపోతుందేమో అన్న భ్రమలో తిన్నగా 'ఏకాంత సేవ'కి వెళ్ళాడు పరమానందం. ఇంటికి వెళ్ళడానికి భయంగా ఉంది. బతుకే .. భారంగా... భయంగా ఉంది. ఇందులో తాను చేస్తున్న దుష్కార్యాలేమిటి.

తాతలనాటినుంచీ వస్తున్న సంస్కృత భాష్యనూ పెద్దపరీక్షలకి వెళ్ళలేక ట్రయినింగ్ అయి మేష్టరీ చేయడమా..

భార్యా...

పిల్లలా...

ఎల్లాగయినా సంసారాన్ని సాగించడమా...

ఆవేశా తన నేరాలు...

ఏ హిమాలయాలలోకయినా పారిపోతే...

ఇన్నాళ్ళుగా తననే నమ్ముకొని, తన కష్టాలలో బాధపడి. సుఖాలలో నవ్వి, తనకి తానుగా నిలచిన అర్ధాంగి...

తండ్రినని తననే నమ్ముకొని . నాన్న అంటూ ఎన్నో ఆశలతో అనురాగాలతో తనచుట్టూ తిరిగే పిల్లలూ...ఒక అయ్యచేత పెట్టవలసిన జానకీ పిల్లందరూ ఏమౌతారు? వికటాట్టహాసంచేస్తున్న యీ సమాజంలో, అప్పులవాళ్ళ భయంతో.. ఒదిగి ఒదిగిపోయి ముడుచుకొని పోతున్న భార్యా పిల్లలు ఊహాపథంలో మెదిలారు .

"వీల్లేదు నేను పారిపోను. పారిపోకూడదు" అని అంటూ అప్రయత్నంగా లేచి నిలబడటంలో తొం దం తూ లి.. జారి .. బండకింద పడ్డాడు తలకు కొద్దిగా దెబ్బ

'అనాసిన్'

నాలుగు మందులు గలది వైద్యుని ఔషధయోగ్యమువంటిది


1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్
3. కఫిన్ 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్

అనాసిన్ —గొప్ప బాధానివారణి—శాస్త్రీయంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి పరముల ముఖ్యస్థానము లందు సంయుక్తధర్మను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి త్వరితగా, సురక్షితమైన శ్రమవిముక్తిని గలిగించును బాధానివారణకు అనాసిన్ కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు సేవించుటకు 'అనాసిన్' కంటె అతి సురక్షితమైనట్టిది మరేదీ లేదు జ్ఞాపకముంచు కొనుడు!

అనాసిన్ వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉబ్బరముగాని కలిగించదు అనాసిన్ అత్యంత జనులకు బాధానివారణి ఎందుకనగా ప్రతిపాదుమ్ము 'అనాసిన్' ను కొనగలరు

ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే.

నాలుగు మందుల సూత్రమైన 'అనాసిన్' వాడుడు



తగిలింది. ఆదుకోవడంలో చేయిగీచుకొని రక్తం చిమ్మింది. పరమానందం మెల్లిగాలేచి ఊరివైపు నడుస్తున్నాడు.

* * *

ఇంటికి రాగానే మొట్టమొదట వినబడిన 'జై సీతారామ్' అన్న నినాదం వీధి అరుగుమీద ఒక బైరాగి కూర్చునివున్నాడు. వింత తేజస్సుతో వెలిగిపోతున్న ఆ బైరాగికి నమస్కరించాడు పరమానందం...

'ఈ పూటకి నీ అతిథులం' అంటూ చిన్నగా నవ్వాడు బైరాగి. ఆ నవ్వులో ఏదో అర్థం.. ఏదో ఆప్యాయత. ఏదో పిలుపు గోచరించింది.

"తప్పక స్వామీ" అంటూ లోపలికివెళ్లి ఒక చిన్నచాప తెచ్చి అరుగుమీద పరిచాడు పరమానందం.

బైరాగి నేరుగా నూతివద్దకివెళ్ళి స్నానం చేశాడు. జానకి అందిచ్చిన తువ్వాలుతో తుడుచుకుంటూ 'మల్లెపూవులాంటి మొగుడు వస్తాడమ్మా' అని దీవించాడు. తీరుబడిగా సంధ్యావందనం ముగించి... భోజనం చేశాడు. ఇంటిలో అందరిభోజనా లయిన తర్వాత. గోడకి ఎక్కడో మూలని వ్రేలాడుతున్న సీతారాముల పటం తెచ్చి, జేరవేశాడు. దానిముందు ఒకదీపం ఉంచి పిల్లలని రమ్మన్నాడు. ఇక మొదలయింది ఒక అపూర్వ గానస్రవంతి.. అందులో కీర్తనలు అష్టపదులూ, తరంగాలూ...

ఏమాత్రమూ ఎబ్బెట్టులేకుండా పిల్లలందరూ తన్మయులయిఅందుకుంటున్నారు. భార్యకూడా తాళంవేస్తూ మైమరచింది. ఏమి ఆ గానసంపద.. భగవంతుడే యీ గానలహరిలో కరగిపోయి తనకి బాసటగా వచ్చేస్తున్నాడా...

ఏమీ ఆ బైరాగిమూర్తి...

ఏమి ఆమాధుర్యం...

ఏమి ఆ మైమరపు...

మనస్సు ఏ గాంధర్వ లోకంలోనో విహరిస్తున్నట్టుంది.

అదిగో.. నాముందరు తుంబురులు నారదులువలె ఉన్నారు.

తమ అందరి చేతులలో దివ్యవీణలు ఉన్నాయి.. తాము గొంతెత్తి గానం చేస్తున్నారు.

అదుగో సీతారాములు...

ఇదుగో చిన్నికృష్ణుడు...

లక్ష్మీనాథుడు, శేషశాయియై.. కమలగర్భుడై శంఖచక్ర ఖడ్గ గదాధరుడై.. అదో అభయముద్ర వహిస్తున్నాడు... ఆహా... ఏమి ఆ వైభవము... ఏమి ఆ కన్నుల వైకుంఠము... బైరాగి మూర్తి ఏదో అంటున్నడు.. ఒక్కసారి కళ్లు నులుముకొని చూశాడు. నిజంగానే బైరాగి తనవద్ద కూర్చొని.. భుజంమీదచేయి వేసి ఏదో చెప్తున్నాడు. 'నాయనా... నీ పరిస్థితి అంతా నీ భార్య చెప్పింది... యీ మనుష్యులని నమ్మి జీవించడంలో కంటే ఆభగవంతుని నమ్మి సేవించడంలో సుఖం ఉంది. ఇన్నాళ్లు వీళ్లను కొల్చిన నీకు సుఖం లభించనందుకు వాళ్లేం చెయ్యకలిగావ్? అలాగే భగవానుని పట్టుదలగా ఆరాధించు ..ఫలితం లేకపోతే మానెయ్యి... రోజూ భాగవత పారాయణం కొనించు... జానకిచేత సీతాకళ్యాణ ఘట్టం నిత్యమూ చదివించు. శుభం కల్గుతుంది...జైసీతారామ్'...

పరమానందం తెలివి తెచ్చుకొని చూసేసరికి బైరాగి నిజంగానే వెళ్ళిపోయాడు. పిల్లలు ఎక్కడివాళ్లక్కడే నిద్రపోతున్నారు...సీతారాముల పటం ముందు దీపం మాత్రం అఖండంలా వెల్గుతోంది.

* * *

మరునాటినుంచీ పరమానందం దినచర్యే మారిపోయింది...నాలు గంటలకే లేచి... సీతారామ స్మరణచేస్తూ...స్నానంచేసి... భాగవతం పీఠంమీద అమర్చి చదవడం మొదలెడితే ఇక దానికి అంతు ఉండేది కాదు. భార్య అంతకుముందే లేచి ఆ స్థలమూ గదీ శుభ్రంచేసి...పుస్తకమూ పీటా అమరుస్తుంది. పిల్లలందరూ స్నానాలుచేసి తండ్రి సమీపంలో కూరుచుంటారు. యిదివరలో పరమానందం యింత కూలంకషంగా భాగవతం చదువలేదు...ఇప్పుడు చదువుతున్న ప్రతి శ్లోకంలోనూ వ్యాసమహర్షి హృదయం అవగతమయినట్టుండేది. చదివిన

జానకీ కళ్యాణం

శ్లోకమే పదేపదే చదువుతూ తనలో తాను లీనమయిపోయేవాడు.

ఈ నిర్దిష్ట కార్యక్రమం.. కొంత కాలానికి ఆ చుట్టుప్రక్కలవారిని ఆకర్షించింది... కొందరు వృద్ధులు యితని వేళకివచ్చి... ఆనందంగా వింటూండేవారు. అక్కడక్కడ వారు అడిగేవాటిని హృదయంగమంగా... అర్థాలు చెప్పేవాడు.. ఆ పాండిత్యం... ఏకాగ్రత జనాన్ని ఆకర్షించాయి రాను రాను ఉదయ సమయంలో ఆ యిల్లు స్త్రీలూ. .పురుషులూ . పిల్లలతో కిట కిటలాడిపోయేది.

పరమానందం వస్తుంటే ఇప్పుడు కొందరు తప్పుకుంటారు.. కొందరు నమస్కరిస్తారు. కొందరు లేచి నిలబడతారు...భాగవత గానంలో తనకు లభిస్తున్న యీ హృదయానందంలో పరమానందానికి యిదేమి తెలిసేది కాదు. ఆ వచ్చేజనం.. గురువుగారికి దక్షిణలంటూ.. తమలపాకులు. ఫలాలూ.... దక్షిణలూ...బట్టలూ ..తేవడం మొదలెట్టారు. కొందరు యింటికి తీసికొని వెళ్ళి రామాయణం చదివించి సత్కరించేవారు... బడిలోఉన్నంతసేపూ పరమానందానికిముళ్ళమీద ఉన్నట్టుంది. ఇంటికి రాగానే తిరిగి కావ్యపఠనం యిలాకొంతకాలం గడిచింది.

* * *

శిష్య సంచారంలో ఆ ఊరువచ్చిన ఆచార్యులుగారికి పరమానందానికీ ఉన్న పేరు అనోటా అనోటా తెలిసింది. తమశిష్యులతో ఆమాటే అన్నారు. తమ సెలవయితే వారిని రప్పిస్తామన్నారు శిష్యులు. కాని ఈయన అందుకు ఒప్పుకోలేదు. మరునాటి ఉదయం ఆయనే స్వయంగా వెళ్ళేసరికి అపర వాల్మీకిలా రామాయణగానం చేస్తున్న పరమానందాన్ని చూసి ఎంతో ఆనందించారు. అన్నిటికంటె ఆయనని ఎక్కువగా ఆకర్షించింది మధుర కంఠంతో సీతాకళ్యాణఘట్టం పారాయణచేస్తున్న జానకి. ఆయనమనస్సులో ఎన్నో ఊహాలు మెరిశాయి. ఉభయులు పరిచయమయిన అనంతరం.. జానకిని తమ కోడలుగా చేసుకోవాలన్న అభిప్రాయం సూచించారు...ఇదివరలో ఆయనఖ్యాతి విన్న పరమానందం తనకొక పెన్నిధి దొరికినట్టుగా భావించాడు.

ఆరాత్రి పరమానందానికి నిద్రలేదు. జానకి వివాహ ప్రసంగం తనని ఎన్నో అంతస్థులక్రింద ఉన్నయిహంలోకి పడేసినట్టయింది. అవును.. యీ వివాహం ఎలా జరిపించడం. ఇన్నాళ్లు తనొక దివ్యావేశంలో ఉన్నాడు. ఇల్లుఎలా ఉన్నదో కూడా చూచుకోలేదు నిద్రరాక పచార్లు చేస్తున్న పరమానందానికి ఎవరోవస్తున్న సవ్వడి వినపడింది.

'బాబయ్యగారూ'.........

ఋణదాత శెట్టి మొహంచూసి నిర్విణ్ణుడయినాడు. ఇహంలోని ఉచ్చులు తిరిగి తన మెడచుట్టూ బిగుసుకొని పోతున్నాయా?

'మీరా...శెట్టిగారూ' .. నూతిలోంచి వచ్చినట్టుగా ఉంది పరమానందం కంఠం.

'అవును బాబయ్యగారు. మీరూ మా గురువుగారూ వియ్యమందు కుంటారని తెలిసింది. మీరు మరోమాట అనకుండా నిశ్చయం చేసుకోండి...యీ పెళ్ళి మా చేతులమీదుగా చేస్తాము. దండంబాబూ... వస్తా అని వెళ్ళిపోయాడు శెట్టి. జైలులో ఉన్న రామదాసుకి రామదర్శనం యిలాగే అయిందా యీ శెట్టి ఎవరు ...యితన్ని చూపి ముఖంచాటు చేసుకొని తిరిగేవాడికే ఈ మార్పు ఏమిటి. తొలిజాము కోడికూత వింటూ మగతగా నిద్రపోయాడు పరమానందం.

* * *

ఆ ఏడు సీతారాముల కళ్యాణం కోవెలలో దివ్యంగా జరిగింది. ఇక్కడ జానకి విశ్వనాధముల వివాహం వైభవంగా జరిగింది.

తన జీవితంలో మేరు పర్వతాల్లా పాతుకు పోయాయనుకున్న సమస్యలు తుఫానులో విధూదిపింజలులా ఎలా కొట్టుకొని పోయాయో అని దిగ్భ్రమచెందని క్షణం లేదు పరమానందానికి.

ఆనాటికి.. యీ నాటికి...ఆయింట్లో నిత్యమూ రామాయణగానం వినిపిస్తూనే ఉంటుంది. సీతాకళ్యాణ ఘట్టం జరుగుతునే ఉంటుంది. ★

కాకిముక్క

"ఏం సుబ్బులూ, ఇంకా ముస్తాబవ లేదేం? పేరంటానికి ఇంకా ఎప్పుడొస్తావ్?"

"మా అమ్మ వెళ్ళొద్దంటోంది. ఇంట్లో పనుందిట."

"ఇంట్లో పనా? అంత అర్జెంటు పనేమొచ్చింది, వచ్చాక చేసుకోగూడదూ? పేరంటాని కెళ్ళడంకోసం స్కూలు మానుకుని ఇంటికొచ్చేంకదా ఇదేమిటిప్పుడూ? పిన్నిగారెక్కడున్నారు?"

"వంటింట్లో కాఫీ పెడుతోంది. రా, వెడదాం."

ఇద్దరూ వంటింట్లోకెళ్ళారు. సుబ్బులే ముందుగా అడిగింది.

"చూడవే అమ్మా, కమలకూడా వచ్చింది పేరంటాని కెళ్ళద్దూ?"

"వెళ్ళడానికేం గాని, తీరా వెళ్ళిందాకా వుండి ఎవరేనా ఏదేనా అంటారు. నువ్వ వెర్రిమొహం వేసుకుని ఇంటికి వస్తావు. పది నలుగురిలోనూ మాటలు పడేకంటే ఇంటిదగ్గిరే వుంటే నయంకదాని వద్దన్నాను. అంతకంటే మరేంలేదు."

"సుబ్బుల్ని ఎవరూ ఏమీ అనకుండా నే చూస్తానండి, పిన్నిగారూ! పంపించండి సరదాగా వెళ్ళొస్తాము. ఆ మాటకొస్తే క్రిందటిసారి 'నేను పేరంటాని కెళ్ళినపుడు 'పెళ్ళెప్పుడు చేసుకుంటా'వని అందరూ నన్ను అడగడవేఁ. అంతకాదు, ఇంకో అంత అడగనివ్వండి నేను పేరంటాని కెళ్ళడం మానను."

"నీ అంత గుండె దిటవు మా పిల్లకుంటే నేనేం సందేహించకుండా పంపేసేదాన్ని. కాని, సుబ్బులు ఒట్టి అభిమానవస్తురాలు. ఎవరేనా పిసరంత ఏదేనా అంటేచాలు ఏడిచేస్తుంది. సరే వెళ్ళిరండి. అది ఏడుపు మొహం వేసు కూర్చుంటే నాకే పనీ తోచదు. ఏదో ఒహాటవుతుంది. ఈ కాఫీ తాగి వెళ్ళండి. మళ్ళీ త్వరగా వచ్చెయ్యండి."

"మా పిన్నిగారు మంచివారు. తొరగా బట్టలు కట్టుకురావే సుబ్బులూ, ఆలస్యం చెయ్యకూడదు. ఇప్పటికే పొద్దుపోయింది. చూస్తూండండి పిన్నిగారూ, సుబ్బుల్ని తీసుకొచ్చి ఎలా మీ కప్పచెబుతానో!"

"ఏమో చూద్దాం. నలుగురు పేరంటాళ్లూ దయ్యబట్టుకుంటే నువ్వేం చెయ్యకలవమ్మా"

సుబ్బులు ముస్తాబై వచ్చింది. ఇద్దరూ బయలుదేరి వెళ్ళేరు. వాళ్ళు వెళ్ళేసరికి చాలామంది పేరంటాళ్లు వచ్చేరు. ఇంకా వస్తున్నారు. ఇంటావిడ రత్తమ్మగారు వచ్చిన వారిని కుశలప్రశ్నలు వేసి, కూర్చోబెడుతున్నారు. వారమ్మాయిలు పసుపులూ, గంధాలూ రాస్తున్నారు.

"సుబ్బులూ, మీ అమ్మగా రాలేదేం?" ఇంటావిడ రత్తమ్మగారడిగేరు.

"మా అమ్మకి ఇంట్లో పనుందండీ. అంచేత రాలేదు."

"ఇల్లారావే సుబ్బులూ, ఇక్కడ కూర్చుందుగానీ. మీ రవణక్కడుందే ఇప్పుడూ?" ఒక ఎరుగున్న పెద్దావిడడిగింది.

కొంపెల్ల మాణిక్యాంబ

కాని కమలకి పెద్దాళ్ళతో దగ్గిర కూర్చోవడం ఇష్టంలేదు అందుకనే సుబ్బుల్ని ఇంకో పక్కకిలాగింది. దాంతో పిల్చిన పెద్దావిడకి కోపంవచ్చింది. కసిగా అంది.

"ఈ కాలప్పిల్లలు బొత్తిగా నే బరితెగించి పోయేరు."

"మేమింకా బళ్ళోనే వున్నావండీ అందుకోసం చాలామందికి మా మీద కోపం కూడాను," అని నవ్వింది కమల. సుబ్బుల్ని తీసుకుని ముందువసారాలోకి వెళ్ళింది. అక్కడా నిండుగానే వున్నారు పేరంటాళ్ళు. ఓ ఖాళీచోటు చూసుకుని కూర్చున్నారు కమలా, సుబ్బులూ. రత్తమ్మగారమ్మాయి పసుపురాస్తోంది.

సుబ్బులు ఎవరెవరు వచ్చేరోనని నాలుగు వేపులా కలయచూసింది. హృదయంగతుక్కుమంది! ఎదురుగుండా కూర్చున్న మేష్టారమ్మాయి, తనకేసి చూపించి పక్కమ్మాయితో ఏమిటో గుసగుసలాడుతోంది. అది సుబ్బులుకేం నచ్చలేదు. అమాటే కమలకి చెప్పింది. కమల సుబ్బులుకంటే పెద్దదీ, లోకజ్ఞానం బాగావున్నదీ. విషయం వెంటనే కనిపెట్టేసింది. ఈ ఆడవారి వాగ్ధోరణి కమలకి బాగా తెలుసు. వాళ్లు ఒకళ్లమీద కన్నేశారంటే చాలు ఆ మనిషిని చిత్రవధచేసే మాటలు, వినేవారికి అర్థరహితంగానూ, అసలువారి హృదయానికి కత్తిపోటుల్లాగానూ, తగిలేట్టుమాట్లాడగలరు. కమల సుబ్బులు దృష్టిని ఇంకోపక్కకి తిప్పుదామనుకుంది. కాని ఇంతలోనే పక్కావిడ సుబ్బుల్ని పలకరించింది.

"ఏమేఁయ్ సుబ్బులూ, మీ అక్కెక్కడుంది?" అని.

"మా అక్క అత్తారింటి దగ్గిరుందండీ."

"మీ పెద్దక్క కాదు. రవణక్క."

"అదీ అత్తారింటి దగ్గిరేవుందండీ.

"సుబ్బులూ, నా ఫ్రెండు ప్రభ నెరుగుదువే? ఇలారా, అలా ప్రభదగ్గిరకి పోదాం," అని కమల సుబ్బుల్ని తీసుకుని ప్రభదగ్గిరకెళ్లింది. "ఐతే నువ్వూ సెలవు పెట్టేశావన్న మాట స్కూలికి." అంది ప్రభతో.

"ఊఁ స్కూలు రోజూ వుండేదేగా. పేరంటం ఎపుడేనా వచ్చేదయ్యె" అని చెప్పి మెల్లిగా "ఒసే, నీపక్కనున్నమ్మాయి పేరు సుబ్బులుకదూ? వాళ్లక్క ఎక్కడుందే అని ప్రభ కమల నడిగింది.

'నీకార్థంలో' అని మనస్సులో అనుకుని పైకి ఇలా అంది

"ఈ అమ్మాయి సుబ్బులే. మొన్న పొయిట్రీ రెసి[illegible] పోటీలలో ఫస్టు ప్రైజ్ కొట్టిం[illegible]." ఇంతలో మేష్టారి భార్య సుబ్బుల్ని వాళ్ళక్కెక్కడుందని అడుగుతోంది. సుబ్బులు నీరసంగా సమాధానం చెప్పింది.

కమలకి సుబ్బులుమీదెంతో జాలివేసింది. అందరూ సుబ్బులు మీద పట్టించారేమిటీవాళ? తన పెళ్ళివిషయం ఎవరికీ జ్ఞాపకం వున్నట్టేలేదు. సుబ్బులూ, తనూ ఎక్కడకెళ్ళినా అంతవరకూ వాళ్ళు మాట్లాడుకునే విషయం వదిలేసి, సుబ్బుల్ని వాళ్ళక్కెక్కడుం దనడగడం! ఛీ!

ఇంతలో రత్తమ్మగారు కునవరాల్ని సావిట్లోకి తీసుకొచ్చేరు. శెగపళ్ళు దొరకలేదుట. సెనగలూ, పువ్వులూ, డబ్బులూ కలిపి పళ్ళెంలో పోసితెచ్చేరు. కుర్చీ వేసి పిల్లని కూర్చోపెట్టేరు. పెద్దవాళ్ళంతా లేచి అక్కడికి వెళ్ళేరు. రత్తమ్మగారి పిల్ల అందరికీ అక్షింతలిచ్చింది.

అప్పుడే వచ్చింది కోమట్లకోడలు. "భోషపళ్ళు పోసేశారాండీ? ఇంట్లోపని తెముల్చుకొచ్చేసరికి ఈ కాడికైంది. అవును గాని

★ కాకిమూక ★

"సుబ్బులమ్మగారూ, మీ చిన్నక్కగారెక్కడున్నారండీ?"

"అత్తారింటి దగ్గిరుంది." సుబ్బులు సమాధానంలో ఏమీ జీవంలేదు. మొహంలో ఏమీ వుత్సాహంలేదు. పేరంటానికొచ్చినప్పటినుంచీ ఒకటేసొద. ఊపిరి తిప్పుకోనివ్వడంలేదు.

"అదేమిటండీ, అత్తారింటి దగ్గిరున్నారంటారు? నిన్న పొద్దున్న కాకినాడలో మీ అక్కయ్యగారత్తగారు కనిపించి మీ అక్కయ్యగారు పుట్టింటి దగ్గిరున్నారని చెప్పేరు. ఈవాళ మిమ్మల్నడిగితే అత్తారింటి దగ్గిరున్నారంటారూ."

సుబ్బులు బిక్కమొహంవేసింది, కమల అందుకుని అంది

"బాగుంది నీ వాకబు ఆవిడీవేళే అత్తారింటి కెళ్ళిపోయిందేమో. అయినా, నీకెందుకు ఆవిడెక్కడుందో ఖచ్చితంగా తెలుసుకోవడం?"

"నేనావిడ నడిగితే మధ్యని మీకెందుకింత వుసూ? అయినా, ఈ వేళ అర్థవిం పూటా అత్తారింటి కెళ్ళేరంటే ఎవరేనా నమ్ముతారా?"

సరి! ఈ వేళ అష్టమేమిటీ? కమల తమాయించుకుని మెల్లిగా, ఇలాఅంది కోవట్ల కోడలితో.

"సుబ్బమ్మా, నీకోరహస్యం చెప్పనా? ఎవరికీ చెప్పవుకదా?"

"అంత చెప్పకూడనిమాటైతే ఎవరికైనా ఎందుకు చెబుతానండీ?" అని ఎదురు ప్రశ్నించింది.

"మరైతేవిను. రవణమ్మగారికి చిన్నప్పటి నుంచి చదువుకోవాలని మహాసరదా. అత్తారికిష్టంలేదు. ఇంటిదగ్గిరెప్పుడూ చదువుతోనే గడిపింది. ఆవిడ పట్టుదల "మెట్రిక్" పాసవ్వాలని. ఛాలారోజులు ఆలోచించింది. అఖరికి మొన్న వాళ్ళమ్మగారితోటి, నాన్నగారితోటీ చెప్పేసింది.

ఆ పరీక్షకి తనచేత కట్టించమనీ, లేకపోతే తనమీద ఆశ వదులుకోమనీను. దాంతోటి వారికి దారీతెన్నూ తోచలేదు. ఇంతలో వాళ్ళ పెద్దల్లుడొచ్చేడు. అప్పుడు వారు అతనితో మాట్లాడి విశాఖపట్నం వాళ్ళ పెద్దక్కగారింటికి పంపేశారు అక్కడ చదువుతోంది. ఈ విషయం ఇంకా రవణ అత్తారికి తెలియదు.

"అల్లాగాండీ?..."

'అక్షింతలెయ్యండ్రా' అంటున్నారంతా. కొంతమంది వెళ్లివేస్తున్నారు. సుబ్బులు కమలతో అంది:

"నే నింటి కెళ్ళిపోతున్నానే కమలా! ఇంకా ఎంతమంది తరవాయున్నారో, నన్నడగడానికి? అమ్మమాట విని ఇంటి దగ్గిరుండిపోవలసిందసలు. పోనీలే, నే వెడతా నువ్వు వాయనం పుచ్చుకురా."

"అదేమిటే అడిగి, అడిగి వాళ్లనోరే నొప్పెడుతుంది. చివరికొచ్చేశామింక. సెనగలు పుచ్చుకుపోదాం."

"సుబ్బులూ, రవణెక్కడుందిప్పుడూ?" ఎవరో సింగమ్మగారడిగేరు.

"మా...మా..."

"అదేమిటల్లా నసుగుతావు?"

"మా అక్కయ్యగారింటి దగ్గిరుందండీ," అనేసి వీధి వేపు చక్కాపోయింది.

"మాకు వాయన మిచ్చెయ్యండి నేనింటికెళ్ళిపోవాలి," అని కమల ఇంటావిడ నడిగింది.

"వెళ్ళిపోదురుగానమ్మా. అంతా వెళ్ళిపోదురుగాని, ఎవ్వరూ ఇక్కడ దిగడద్దు. ఒక్క నిముషం ఆగండి అందరికీ యిచ్చేస్తాం," అదీ ఆవిడ సమాధానం.

సుబ్బులు వీధిలోకొచ్చింది. కళ్లనీళ్ళు తుడిచేసుకుంది. మెట్లు దిగుతోంది. అప్పుడే ఒక ముసలి ముత్తైదువ కోటమ్మగారు మెట్లెక్కి వస్తున్నారు.

"పేరంటం అయిపోయిందేమిటి పిల్లా, వెళ్ళిపోతున్నావ్. అవునుగానీ, బుల్లెమ్మా, మీ అక్కెక్కడుందిప్పుడూ?"

"మా అక్క లేచిపోయిందండీ."

"ఆఁ! ఆఁ! ఏమిటి చ్ఛ, చ్ఛ! కలికాలం.." ఆవిడ లోపలికెళ్ళింది. ఆవిడతో పాటే ఆ వార్తకూడా లోపలికి చేరింది. అందరి చెవులలోకీ పాకింది.

అమ్మయ్య! అనుకుంది సుబ్బులు. ఇంక తనీరహస్యం దాచక్కరలేదు. లోపల కెడతానని సుబ్బులు వెనక్కి తిరిగింది. ఇంతలో కమల వస్తోంది.

"పోనీలేవే, వెళ్ళిపోదాం. వాళ్ళెప్పటికీ సెనగలివ్వడమే లేదూ" అంది కమల.

"ఇంక వెళ్ళక్కర్లేదే వాళ్ళు సెనగలిచ్చేక పుచ్చుకునే వెడదాం."

"ఏమిటో కులాసా? ఇంకా బోలెడు మంది జనం వస్తున్నారు."

"రానీ, ఎంత మందొచ్చినా నాకేం భయంలేదు నిజం చెప్పేశా. ఇంకా ఎంత మందడిగితే అంత మందికీ చెప్పేస్తా."

"ఏమిటో నిజం?"

"మారవణక్క లేచిపోవడం. అది పసిగట్టే వీళ్ళందరూ నన్నిల్లా ఏడిపించేస్తున్నారు. ముఖ్యం - మొహం ఎరగనివాళ్ళు కూడా వచ్చి 'మీరవణక్కెక్కడుందీ' అనడం"

"ఎప్పుడు జరిగిందది?"

"నెల్లాళ్ళు దాటిపోయింది కాని, అమ్మా మా ఈవిషయం నా పెళ్ళయ్యేదాకా ఎవరికీ చెప్పకుండా గుట్టుగా వుంచమంది. అంతే, వీళ్ళలా పసిగట్టేశారో, ఒకటే అడగడం అక్క లేదనే బాధకంటే వీళ్లబాధెక్కువయిపోయింది. ఇంతకీ వాళ్ళకి పాపం తెలవక మా అక్క యోగక్షేమాలు మాత్రమే తెలుసుకుందామని అడుగుతున్నారనుకోకు. వాళ్ళల్లా అడగ్గానే నేను పడే బాధనీ, నా అవక-తవక సమాధానాల్నీ చూసి ఇకిలిద్దామనే! ఇంతవరకూ వాళ్ళ ఆట. ఈపైన నా ఆట ఈ సారెవరైనా అడగనీ, నేను మా అక్క లేచిపోయిందంటాను. వాళ్ళు తెల్లమొహం వేస్తారు. ఇందాకా ఆముసలావిడ మొహంచూడాల్సింది.'"

"అయితే, మీ అమ్మగా[illegible]ప్పుడరూ చెప్పేశావనీ?"

"ఊహుఁ. ఎవరు దాచకలరేమిటింక, అందరికీ తెలిసిపోయాక? ఆ మాట కొస్తే ఇప్పుడు దాచడం మన తప్పు. అందరికీ తెల్సిపోయాక, దాచిన కొద్దీ ఏడిపిస్తారు. విన్నావు కదూ, మా అక్క, అత్తగార్ని కూడా విశ్రాంతిగా వుండనివ్వడం లేదు. వాళ్ళ ముందర బుర్రవంచి వప్పుకునేదాకా నానా హింసలూ పెట్టేస్తారు ఒప్పేసుకుంటే మన మీద కొంచెం సానుభూతి చూపించి, ఆ తర్వాత మర్చిపోతారు."

ఆ తర్వాత వాళ్ళు సెనగలు పుచ్చుకుని హాయిగా ఇంటికి చేరుకున్నారు. ★

గాలిలో హత్య

"హత్య! సినిక్ ఘోరహత్య!" హడావిడిగా లోపలికి ప్రవేశించాడు డిటెక్టివ్ సుగ్రీవ. కుమార్, చైత్రశ్రీ, శాస్త్రి, నేనూ ఆశ్చర్యపోయి చూస్తున్నాం.

మేం అయిదుగురం ఒకేరూమ్‌లో వచే అదృష్టం కలిగింది. యూనివర్సిటీ కంతటికీ ఎత్తైన కొండదిబ్బమీద భగవానుని పవిత్ర నామంమీదుగా కట్టిన ఆ బ్లాకు మూడవ అంతస్తులోని మారుమూలగదే మాది. మా అయిదుగురు రూంమేట్సు కూడా వారి వారి 'కళ'లలో అతి నిపుణులు.

డిటెక్టివ్ సుగ్రీవ షెర్లాక్ హోమ్స్‌ని మించిన డిటెక్టివ్. కాల్చి పారేసిన సిగరెట్టుపీకల్ని జేబురుమాలుతోనే తీసి అవల పారేస్తాడు. అతన్ని క్లాసులోనూ, కలల్లోనూకూడా డిటెక్టివ్‌లే పలకరిస్తారు. హత్యాసాహిత్యం అంతా ఏ భాషలోదైనా వడ-కాచి వడబోసి తాగేశాడాయన.

కుమార్ గొప్ప నాటకకళాకారుడు. ఉత్తమనటుడుగా మూడుసార్లు, 'ఉత్తమనటి'గా నాలుగుసార్లు బహుమానాలందుకున్నాడాయన. ఇంట్లోనూ, బయటాగూడ నాటకంఫక్కీలో మాట్లాడుతాడు. రాత్రిళ్లు "జానకీ! తుంపరులు పడుతున్నాయి, తలుపు వేసెయ్యి!" అని కలవరిస్తాడు, మేమందరము ఉలిక్కిపడేలా. తన రసికత్వాన్ని స్థిరపర్చుకోడానికి ఒక ఊహాసుందరితో అప్పుడప్పుడు స్వప్నాల్లో అలా మాట్లాడుతూంటాడాయన.

'చైత్రశ్రీ' అనేది ఒక పారడీ, ఈనాటి అశోక శ్రీలమీద. ఆయన కవిత్వం 'అగ్గినిప్పు'లాగుంటుంది. మనిషికూడా అలాగే ఉంటాడనుకోండి. ఆయనకు భయపడి ఆయన కవితాజలాన్ని ఆముదంలాగా గుటకలు వేసే వాళ్లం మేమంతా. ఆయన అభ్యుదయవాది; అంటే మన పాతసారస్వతాన్నంతటినీ బుట్టదాఖలాచేసేసి, శ్రోత్రీకవిత్వం పూర్తిగా విజృంభించేదాకా తను వ్రాసినవే చదువుకోమంటాడు.

శాస్త్రి ఎప్పుడూ ఎవరిసంగతీ పట్టించుకోలేదు, ఇకముందు పట్టించుకోడుగూడ. ఎప్పుడూ గోడవైపు తిరిగి కూర్చొని ఏ ఎప్లయిడ్ మెకానిక్సో చదువుతూంటాడు. సినిమాలు చూడడు; స్త్రీయిళ్లలో పాల్గోడు. క్లాసుకి అరగంట ముందుగా వెళ్తాడు. మేష్టర్లని వచ్చి లీజర్ గంటలో ఏమైనా చెప్పమంటాడు మమ్మల్నందర్నీ చంపేందుకు. ఇదంతా చూసి మా క్లాసులో వాళ్లంతా "పకోడీ" అనే బిరుదు ఆయనకు ప్రసాదించారు. ఆయనంటే ఇంకా కొంచెం ఎక్కువ అభిమానం గలవారు ఆయన్ను 'ఘనపకోడీ' అనీ "వీరపకోడీ" అనీకూడ పిలుచుకుంటూంటారు.

ఇక సినిక్ (మన కథానాయకుడు.) కూడ అసలు పేరుకాదు, పై అన్నిపేర్లలాగే. డ్రాయింగ్ పేపర్లో మూడుసార్లు తన్నేసిన తర్వాత జీవితంమీదా, తనమీదాకూడ విశ్వాసంపోయి, ఎప్పుడూ ఆసముద్రంవైపున్న కిటికీదగ్గర కూర్చొని దూరంగా శూన్యంలోకి శూన్యంగా చూస్తూంటాడు. "జీవితమంతా మిథ్య. కష్టసుఖాలు, కలిమిలేములు కావడికుండలు" అనేవాడు మాకేదైనా ఘనకార్యం జరిగి సంతోషిస్తున్నా, లేక పరీక్ష ఎగిరితంతే ఏడుస్తున్నా. మా

డి. హనుమంతరావు

ఉడుకుతున్న వేడిరక్తంమీద చన్నీళ్లు చిలకరిస్తుండేవాడు. ఆ క్షణాల్లో మా కతనిమీద పట్టరాని కోపంవచ్చేది.

'దేవుడూ, గీవుడూ జాంతానై! చావు అనేది చాలా స్వర్గప్రాయం' అని మాకు నీతిబోధ చేస్తూండేవాడు. ఇలా ఉంటూండగా ఒకరోజు ఈ సినిక్ అకస్మాత్తుగా మాయమయ్యాడు. ఆరోజు రాలేదు. మరునాడు, మూడోరోజుకూడ రాలేదు. ఎప్పుడూ వేసవిసెలవలకికూడ ఇంటికి వెళ్లకుండా కాలేజీ, కిటికీ తప్ప ఇంకోటి ఎరగని సినిక్ ఇన్నాళ్లు కనబడకపోయేసరికి మాకందరికీ చాలా అనుమానం కలిగింది. ఒకవేళ ఆత్మహత్యయేమో ననుకున్నాం. డిటెక్టివ్ సుగ్రీవకిప్పుడు మంచిపని తగిలింది. ఇంతవరకెప్పుడూ పుస్తకాలు, పెన్నులు పోతే డిటెక్ట్ చేశాడేగాని హత్యలతో సంబంధం పెట్టుకోలేదు.

"ఇది ఆత్మహత్యగాదు; ఖచ్చితంగా హత్యే!" అంటాడు డిటెక్టివ్. మమ్మల్నందర్నీ నేలమీద అడుగులు వేయకుండా బయటికి వచ్చేయమన్నాడు. కళ్లు పెద్దవిచేసుకొని అడుగుజాడల్ని కనిపెట్టుతూ వెళ్లాడు. అక్కడో చిన్న కాగితంముక్క కనబడింది. దాన్ని నెమ్మదిగా జేబురుమాలుతో తీసి శాస్త్రోక్తంగా జేబులో పెట్టుకున్నాడు. నెమ్మదిగా నేలమీదున్న అడుగుజాడల్ని పాడుకాకుండా కాపాడుకుంటూ సినిక్ తాలూకు అలమారదగ్గిరకి వెళ్ళి వంటివేలుతో తలుపు తెరిచాడు! ఒక్కసారిగ "రక్తం" అని వెనక్కి వచ్చిపడ్డాడు! మేమంతా లోపలికి వెళ్ళి చూసేసరికి అక్కడ ఎర్రసిరాబుడ్డి ఉంది పక్కన. అది పూర్తిగా ఒలికిపోయుంటుంది. మనవాడు హత్యాధ్యానంలో ఉండటంచేత రక్తం అనుకున్నాడు పాపం. అతని గుండె చరిజేసి "ఎందుకీ హంగామా అంతా! ఆ కాగితం ముక్క ఏంజేస్తావు" అని అడిగాను.

(22-వ పేజీ చూడండి)

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము
...అయిదవ భాగము



--- గేయరచన ---
నండూరి. రామమోహనరావు
బొమ్మలు-- బాపు



గాలిలో హత్య

(19-వ పేజీ తరువాయి)

"దాన్ని అల్ట్రా వయొలెట్, ఇన్ఫ్రా రెడ్ రేస్ క్రింద పెట్టి పరిశీలిస్తా" నన్నాడు!

"ఉపయోగం"?

"హంతకుడు పట్టుబడిన తర్వాత, వాడి వేళ్లు, కాళ్ళ ముద్రలు కూడ తీసికొని, అలాగే పరిశీలిస్తే వాణ్ణి ఇట్టేపట్టే యొచ్చు!"

"ఎందుకోయ్ ఈ లేనిపోని గొడవంతా!" అన్నాడు కుమార్.

"గొడవేమిటోయ్! డిటెక్షన్ అనేది వట్టి డికాక్షన్ లాంటిది. ఈ హంగు అంతా కలిపితే పాలూ పంచదారా పోసినట్టవుతుందన్నమాట" విడమర్చి మూలసూత్రం సూక్ష్మంగా చెప్పేశాడు డిటెక్టివ్ సుగ్రీవ!

కాని చిత్రశ్రీ, కుమార్, ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు! ఇది అసలు హత్యేగాదన్నారు వాళ్ళు. ఆత్మహత్య చేసేసుకునుంటాడని తీర్మానించారు. శాస్త్రి లెక్కలు చేసుకుంటున్నాడు. నేను అధిక సంఖ్యాకబలంతో ఏకీభవించి, మధ్యాహ్నం పదకొండుగంటలకి మా బ్లాకువాళ్లందర్నీ శ్రీ సినిక్ గారి ఆత్మశాంతికై స్మారక సభ, డాబాపైన జరుగుతుందిగాన హాజరు గావలసిందిగా కోరాను. డిటెక్టివ్ సుగ్రీవ కిదేం నచ్చలేదు. ఇది హత్యేగాబట్టి ప్రథమ కర్తవ్యం హంతకుణ్ని పట్టుకోవడం అన్నాడు! చివరికి స్మారకసభలో ఆత్మశాంతికై రెండునిమిషాలు తలవాల్చి నిలబడ్డానికి ఒప్పుకున్నాడు. శాస్త్రిని చదువులోంచి లేపి ఈ విషాదవార్త తెలియజేశాం.

"ఓహో!" అని అతి సాధారణంగా మళ్లీ లెక్కలు చేసేసుకుంటున్నాడు.

"మనమందరం ఏడవాలోయ్!" అన్నాడు కుమార్ గట్టిగా!

"అలాగా! ఇదిగో ఈ లెక్క పూర్తిచేసి!" అన్నాడు శాస్త్రి. మేమందరం ఒకరి మొఖా లొకరు చూసుకొని ఏం చెయ్యలేక ఊరుకున్నాం!

చివరికి పదకొండుగంటలైంది. మారూంమేట్సు ఆరుగురం, మరో నలుగురూ పైకి వచ్చాం.

కుమార్ అధ్యక్షత వహించాడు. చిత్రశ్రీ, మిత్రశ్రీ మీద ఒక చిన్న గేయం వ్రాసి చదువుతానన్నాడు. చచ్చామనుకున్నాం.

"ఓహో సినిక్! అహో సినిక్! నిన్ను వదిలి అప్పుడే మూడు రోజులైంది!

కాని సినిక్! నిజానికి నువ్వు మమ్మల్నింకా వదల్నే లేదు!

మర్చిపోలేం! నేస్తం! నీ జాలిబాధ! విషాద గాథ!

నిన్నీ లోకం రెక్కపట్టుకు ఆపి, నీ మెదడులో నాగ జెముడుడొంకలు మొలిపించి,

శాశ్వత సత్యాల్ని నినదించే నీ గొంతుకి ఉరిత్రాళ్లువేసి,

నీదారుల్లో నిప్పులరాసులు ఉంచి-అబ్బ సినిక్!

కాని, నేస్తం! నేను నిన్ను వదల్ను! నీ ఆశయాల్ని, ఆదర్శాల్ని నేల నాలుగు చెరగులా చెరుగుతా!

నిన్ను జీవన్మృతునిగా చేసేస్తా!"

"మా కందరికీ నవ్వొచ్చింది ఆ ఆఖరి మాటకి. పాపం అతని ఉద్దేశ్యం ఏమిటో తెలిసిందే, కాని పాపం ఒకటాని కొకటి అని ఊరుకున్నాడు.

తరవాతి అధ్యక్షులవారు తమ అంతిమ ఉపన్యాసం ఇచ్చారు.

"సోదరులారా! మిత్రుని అస్తమయ వార్త మనల్నందర్నీ అగాధాల్లోకితోసింది. దుఃఖసాగరంలో ముంచివేసింది" అని ఒక్కసారి చీది, కళ్ళు తుడుచుకున్నాడు. ఆ తర్వాత ఆకాశంకేసి చూస్తూ "ఎక్కడికి పోయావు మమ్మల్నందర్నీ ఇలా ముంచేసి! మా రోదనలు నీకు వినపడ్డం లేదా! హా చంద్రమతీ!" అని ఒకసారి నాలిక కొరుక్కొని తిరిగి ఉపక్రమించాడు. ఇలా గంటసేపు అతి విషాదంగా నటించి చివర్ను "ఈవిషాద సమయంలో అంతగా మాట్లాడ్డం భావ్యం గాదు, అని ముగించేశాడు. ఆ తర్వాత అందరం లేచి నిల్చొని తలవంచుకొని రెండు నిముషాలసేపు అతని ఆత్మశాంతికై ప్రార్థించాం.

గదికి వచ్చేసినతర్వాత, కుమార్ రిహార్సల్సుకి వెళ్ళిపోయాడు. డిటెక్టివ్ సుగ్రీవ హత్యగురించి ఆలోచిస్తున్నాడు. చిత్రశ్రీ విషాదంగా మొహంపెట్టి నిద్రపోతున్నాడు. శాస్త్రి పుస్తకపారాయణ చేస్తున్నాడు యథాప్రకారంగా"

ఇంతలోకి చిరునవ్వు నవ్వుతూ ప్రవేశించాడు సినిక్. ఆశ్చర్యం! ఏడాది కంతకీ అదే మొదటిసారి అతను నవ్వింది. ఇంటిదగ్గిర్నుంచి అర్జంటు టెలిగ్రాం వచ్చేస్తే మా ఎవరితోనూ చెప్పడానికి వీలులేక, కట్టుబట్టలతో పాపం ఇంటికి వెళ్ళిపోయాడట! అక్కడితనికి వాళ్లవాళ్లు మంచి అమ్మాయిని చూసేసి పెళ్లి స్థిరపర్చేశారు. "జీవితంలో ఆనందం ఉందోయ్!" అన్నాడు సిగ్గుపడుతూ భావి జీవితాన్ని గుర్తుతెచ్చుకుంటూ. మా కందరికీ తలో 'శుభలేఖా ఇచ్చాడు. సినిక్ మారాడు! నెమ్మదిగా నోరు వెళ్ళబెట్టి చూస్తున్న డిటెక్టివ్ సుగ్రీవ దగ్గిరకి వెళ్లి "ఎక్కడోయ్! హత్య?" అన్నాను. "గాల్లో!" అన్నాడు. ★

గాలికోళ్లు

అది జిల్లా ముఖ్యపట్టణం కాదు. కాని ఆజిల్లాలో అతిముఖ్యమైన పట్టణం. ఆ జిల్లాలోనే కాదు ఆ రాష్ట్రంలోనే ముఖ్యమైన పట్టణం. పెద్ద రైల్వే జంక్షనూ, సిమెంటు ఫ్యాక్టరీలూ, మరెన్నో పరిశ్రమలూ, కావలసినన్ని సినిమాహాల్సూ, కావలసినవారికి దేవాలయాలూను ప్రక్కనే పురవళ్లితోనూ పరవళ్లితోనూ పారే జీవనది కొండములుపు దగ్గర, ఆనకట్ట కెగువగా నదిలో పడవలూ, లాంచీలూ, వాటి కెగువగా లంకలూ, చెట్లూ. అంతటితో చాలదని వో రెగ్యులేటరు రోడ్డుబ్రిడ్జి! దానికట్టూ యిటూ మెరిసిపోయే పాలరంగుగాజు గ్లోబుల వరుసా వీటన్నిటినీ మరిపిస్తూ ఆవస్తునో గాలికోడీ, యీ వస్తునో గాలికోడీ ఇక చెప్పవలసిందేముందా రామణీయకాన్ని గురించి?

ఎండాకాలంలో వడగాడ్పు కొట్ట కొట్టి కాస్త తగింది. అంతవరకూ పడమటవైపు చూస్తూ కాలంగడిపిన గాలికోళ్లు గిర్రున దక్షిణానికి తిరిగాయి. కొండమీద ఇంట్లో కాపురముంటున్న వాళ్లబ్బాయి, కొండ 'మొకిరి' మీదికెక్కి ప్రకృతిరామణీయకాన్ని ముగ్ధుడై చూస్తున్నాడు. అస్తమిస్తున్న సూర్యుడూ, లంకలూ, రోడ్డూ, అవతలివొడ్డున వూరూ, రెగ్యులేటర్ రోడ్ బ్రిడ్జీ, రోడ్డుపైని విద్యుద్దీపాల బుడ్లూ, అవతలి రైలుబ్రిడ్జీ, వంతెనక్రింద యిసుకా, పాయలై పారేనీళ్లూ, రకరకాల రంగుల్లో మనుష్యులూ, రోడ్డుబ్రిడ్జిపైని తెరపిలేకుండా తిరిగే కార్లూ బండ్లూ మనుష్యులూ, తళతళలాడే గాలికోళ్లూ, అత్యంత సుందరంగా వుందా దృశ్యం ఇదంతా చూస్తూ, గాలితోపాటే పందెం వేసినట్టుగా తిరుగుతుండే గాలికోళ్ళను ప్రత్యేకంగా చూడ్డ మతనికి సరదా.

* * *

వ్యాసారావు యం. ఏ. అభ్యుదయవాది పురోగాముల జాబితాలో వొకడు అలాగని అభ్యుదయ కవిత్వంలాంటిది వ్రాస్తాడనుకుంటారేమో, ముచ్చుకైనా చేతగాదు. పేరు వ్యాసారావేగాని వ్యాసాలు వ్రాయటమైనా రాదు. అయితే మంచి చురుకైన యువకుడూ, సంస్కరణాభిలాషీ. విద్యార్థిగా మంచి వుపన్యాసకుడని పేరు తెచ్చుకున్నాడు కళాశాలల్లో. స్త్రీల సమస్యలపైన అతనికి స్పష్టమైన భావాలున్నయ్. ఆ సమస్యల్ని పరిష్కరించేందుకు తీక్ష్ణమైన అభిప్రాయాలూ వున్నయ్. అసలు స్త్రీలసమస్యల్ని పరిష్కరించి, స్త్రీని సుశిక్షితురాలుగా చేస్తే భారత సమస్యలన్నీ వాటంతటవి ఏ పంచవర్ష ప్రణాళికలూ అవసరం లేకుండానే సర్దుకుంటాయనే వ్యాసారావు విశ్వాసం. కాని స్త్రీ సమస్యల ప్రసక్తి యెక్కడ తీసికొనివచ్చినా, అంతా నిర్లక్ష్యంగా పెదవి విరవటం చూచి నిర్లిప్తుడైపోయేవాడు. విద్యాధికులైన స్త్రీలు సైతం, "జీవితంలో యెన్నో సరిపడని సందర్భాలు వస్తాయి. మనం వూహించే వుపన్యసించే సమస్యలకన్నా విపరీతమైన

"చైతన్య"

సమస్యలూ, సర్దలేని సంఘటనలూ యెన్నో వుత్పన్నంగావచ్చు" నన్నపుడు నిస్పృహతో వుస్సురనుకొనేవాడు చివరకతనికి మిగిలిందొక్కటే ఆశ; తనజీవితంలో తన అభిప్రాయాలనన్నిటినీ ఆచరణలో పెట్టి తన వూహాలు ఆచరణ యోగ్యాలని ఋజువు చేయాలన్నది.

అందుకు మొదటిప్రయత్నంగా తను స్వయంగా, తలిదండ్రులకు కొద్దిగా వ్యతిరేకంగానే, బి. ఏ దాకా చదువుకొన్న సరళను, కానీ కట్నం పుచ్చుకోకుండా, ఐదువేలూ; పదివేలూ యిస్తామని వస్తున్నా, తనకూ అట్టే ఆస్తిపాస్తులు లేకున్నా, వివాహమాడాడు. సరళహృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

సరళ వ్యాసారావులాగానే చురుకైన మనిషి. చాలా సరళమైన స్వభావంకలది మితభాషిణి అనుకున్నదేదో నెరవేర్చే దాకా నిద్రించలేని వ్యక్తి. అందమైన విగ్రహం; అణకువా, నిరాడంబరతా యినుమడింపజేస్తుంటాయి ఆ అందాన్ని. సరళదృష్టిలో వ్యాసారావు సామాన్యమైన భర్త కాదు. తననుద్ధరించిన మహాపురుషుడు. త్యాగమూర్తి. ప్రథమ సమాగమంలో ఆ ప్రేమైకమూర్తి చిలికించిన ప్రేమా, వెల్లడించిన ఆదర్శాలూ, చూపిన ఆదరణా, ఆమె జీవితాంతం విస్మరింపలేదు. అంత మహోన్నతభావాలుగల వ్యక్తి తనకు భర్తనుకున్నప్పుడు పొంగిపోయిందామె హృదయం. అక్షరాలా అడుగులకు మడుగులొత్తే భార్య అయింది సరళ.

వ్యాసారావు ఎం. ఏ వుద్యోగంకోసం అంత బాధపడకుండానే కాలేజీలో లెక్చరరుగా వుద్యోగం కుదిరింది. గాంధీనగరంలో కాపురం పెట్టాడు. ఇన్నాళ్లటి వ్యాసారావు కాదిప్పుడు కొత్త కుటుంబభారం నెత్తిన పడ్డవాడయ్యాడు. తనకు వచ్చే జీతంలో నెలకు 75 రూపాయలు గుంటూరులో వున్న తలిదండ్రులకు పంపకపోతే బండి దొర్లదు గుంటూర్లో. మిగిలిన నూటపాతికలో కాలేజీ లెక్చరరుకు కావలసిన డ్రెస్సును పోషించుకుంటూ, హోదాకుతగిన ఇంటికిచ్చుకుంటూ, వచ్చేపోయే స్నేహితుల కాఫీకి ఖర్చుపెడుతూ, యిదరిపొట్టా గడుపుకోవటమే కష్టమైపోతోంది. ఇంకా సరళ మెలకువగా సర్దుకుపోతున్నది గాబట్టి లేదనకుండా కాపురమూ కాలమూ దొర్లుకుపోతున్నవి ఈ క్రొత్తజీవితమూ సుధామయంగానే గడచిపోతోంది వాళ్ళిద్దరికీ. ఇక సరళపడే బాధల్లా వ్యాసారావు రోజూ పట్టుకొచ్చే ప్రతివాడికి వొనవ్వు విసరి, వొనమస్కారం పారేసి, కాఫీని స్వయంగా అందివ్వటం దగ్గరనే. వ్యాసారావు తృప్తికోసమే ప్రాణం బిగబట్టుకొని యీకాస్తా చేయటం ఆమెకి తప్పటం లేదు. తన అందాలభార్యని స్నేహితులందరికీ పరిచయం జేసి, ఆమెచేత స్వయంగా కాఫీనిప్పించి, యేదో అభ్యుదయాన్ని సాధించినట్టే తృప్తిపడేవాడు వ్యాసారావు. అయినా తనతో పాటుగా క్లబ్బుకురాదని, యెంతచెప్పినా స్వాతంత్ర్యాన్ని పుచ్చుకోదనీ వ్యాసారావుకు వోమూల సరళనుగురించి బాధగానే వుంది. ప్రక్కయింటివాళ్లతో పెత్తనానికి వెళ్లటానికి కూడా తనతో చెప్పి పర్మిషను పుచ్చుకోవాలా? అని కసురుకున్న సంఘటలున్నా ఆమె ఆపద్ధతిని

★ గాలికోళ్ళు ★

మానుకోలేదనే విచారంతో గ్రహచారం లెమ్మని గ్రొప్పు నవరించుకునే వాడు పాపం వ్యాసారావు. అయినా స్త్రీకి స్వాతంత్ర్యం ఇచ్చివేయటమే తన లక్ష్యం గాబట్టి యీ విషయాల్లో యింతకన్నా పట్టుదల చూపించలేక వూరుకున్నాడు.

2

ఆరోజు మాలంకర్ జీ నిర్యాణాన్ని పురస్కరించుకొని కాలేజీ మూసివేశారు. ముందుగా యీ విషయం తెలియక కాలేజీకి వెళ్లిన ఆచార్యవర్గమూ, విద్యార్థి సమూహమూ విచారంతో కొంతమంది, వుత్సాహం(సెలవు వచ్చిందని)తో కొంతమందీ యింటిముఖం పట్టారు. మాలంకర్ జీ వంటి సమర్థుడూ, ఆదర్శమూర్తీ మరణించినందుకు విచారపడుతూ యింటికి చేరిన వ్యాసారావు యిల్లు తాళంవేయబడివుండటం చూసేసరికి ఆశ్చర్యపోయాడు. సరళ చివరకు స్వతంత్ర భావాల నలవర్చుకుని ఆచరణలో పెట్టుతున్నదని గ్రహించి కొండెక్కినంతయింది వ్యాసారావుకు. తక్షణమే ఆమె నభినందించడంకోసం, ఆమె ఆరోగ్యంకోసం, తన సంతోషాన్ని తనివిదీరా జీర్ణంచేసికోవటంకోసం ప్రయాణమయ్యాడు కాఫీ హోటలుకు. ఇంతలో ప్రక్క వాటాలోని బామ్మగారు ప్రత్యక్షమైంది ముసుగు సవరించుకుంటూ. సరళ ఎంతదూరం వెళ్ళిందోకూడా తెలుసుకుంటే, యెంత సాహసి అయిందో అంచనా గట్టవచ్చని, ఆ అంచనాతో తన సంతోషాన్ని ద్విగుణీకృతమో, త్రిగుణీకృతమో చేసికొని మరీ కాఫీ త్రాగాలో, టీ త్రాగాలో, వోవల్ టైన్ త్రాగాలో నిర్ణయించుకోవాలనీ ఆశించిన వ్యాసారావు వెంటనే బామ్మగారి నడిగాడు, "సరళ యెక్కడికి వెళ్ళిందండీ?" అని. "ఎక్కడికో వెళ్తుంది నాయనా యెవరితోనో; నాలుఘ్ఘంటలికగాని రాదు. పైవిషయాలు నే నెరగను పెద్దముండ"నంది ఆపూర్వసువాసిని "రైట్!" అని లోపలే అనుకొని యేకబిగిన 'రామకృష్ణా' లో వోవల్ టైన్ ఆర్డరుచేసి ఆలోచనలోపడ్డా డకస్మాత్తుగా వ్యాసారావు. అతనికి బామ్మగారి మాటలేవో విపరీతంగా కన్పించినయ్. ఓవల్ టైన్ చప్పరిస్తూ "సరళ రోజూ వెళ్తుందా? నాలుగ్గంటలకిగానిరాదా? ఎవరితోనో వెళ్తుందా? . ఎవరితో వెళ్తుంది? ఎక్కడికి వెళ్తుంది? ఎందుకు వెళ్తుంది? తను సర్వస్వతంత్రంయిచ్చేమనిషే గదా, యీవెళ్ళే వ్యవహారాన్ని యెందుకింత గూఢంగా వుంచాలి?" అని వోకేవొక ఆలోచనలో పడిపోయాడు ఎన్నివిధాల సమాధానపరచుకోవాలన్నా కుదరటంలేదు. అసలు సంగతేమిటో తనుగా సరళ నడగకుండా, వీలైతే వోపెద్ద డిటెక్టివులాగా గ్రహించివేయాలనీ, రహస్యంగా కనిపెట్టాలనీ తీర్మానించుకున్నాడు అంత ఆధునిక భావాలున్న వ్యాసారావు యిలా జారిపోయాడని యెలా నమ్మలోకూడా వూహించుకోలేం; నిప్పులు చెరుగుతూ కాసినయెండ నిముషంలోపోయి, వర్షం కుండపోతగా కురవటం ప్రకృతిసహజమేనని జ్ఞప్తికి వస్తే తప్ప!

యథాప్రకారంగా అయిదింటికి యింటికి చేరుకున్నాడు వ్యాసారావు. అలవాటుప్రకారం హార్లిక్సును పుచ్చుకొని ఆహ్వానించింది సరళ చిరునవ్వుల్ని చిలకరిస్తూ. తనూ యెప్పటిలాగే "గుడ్ యీవెనింగ్ డియర్!" అంటూనే పుచ్చుకున్నాడాహానీయాన్ని. అంతా యెప్పటిలాగే జరిగిపోయిందప్పటికి. భోజనాలై పడకలమీదకు చేరాక సరళను సంగతులడిగాడు వ్యాసారావు. ఏ సందర్భంలోనైనా, తాను మధ్యాహ్నం యెక్కడికి వెళ్లిందో చెప్తుందేమోనని. ఎన్నిసంగతులో చెప్పినసరళ ఆసంగతిని గురించే ప్రస్తావించలేదు. అందుకే వుడికిపోతున్న వ్యాసారావును సరళ, సత్యనారాయణపురంలోవున్న బంధువుల్ని మర్నాడు చూచివద్దామని వుంది వెళ్లిరమ్మంటారా?" అని అడగటం నిలువునా దహించివేసింది. ఐనా తమాయించుకొని "వో ఎస్" అని అన్నాడుగాని, తనను సరళ పట్టపగలు గుడ్డివాణ్ణిగా చేసి మోసంచేస్తోందని భావించుకున్నాడు. మేరీకొరెల్లీ వ్రాసిన 'విస్మరింపబడిన వ్యక్తికథ'(A Story of One Forgotten) స్మృతిపథంలో మెరిసింది. అతని హృదయం కలుషితమై కలతపడ మొదలుపెట్టింది. సరళను సూటిగా ప్రశ్నించే ధైర్యంకూడా లేకపోగా వుక్రోషాన్ని తీర్చుకునేందుకేదోవాతోచక, నిద్రాపట్టక, విసుగ్గావుందని విసురుగా డాబామీదకు వెళ్లాడు వ్యాసారావు. గాలికోళ్ళనుచూస్తూ యెన్నిగంటలు గడిపాడో, గదిలో నిద్రపోయిన సరళకు తెలియనే తెలియదు. తెల్లవారి కాఫీకూడా త్రాగకుండానే సైకిలుతీసిన వ్యాసారావు ధోరణి సరళకు వింతగానే కనిపించింది. "ఎక్కడిదాకా ప్రయాణం" అని ఛలోక్తిగా మాటాడిన సరళవంక, ముఖం టుండులాపెట్టుకొని వ్యాసారావు చూచినచూపు ఆమె కెంతో బాధాకరంగా తోచింది. అతనిలో ఈవింత మార్పెందుకు వచ్చిందో గ్రహించలేక సరళ చిన్నబోయింది. ఎంత ఆలోచించినా ఏ కారణమూ కన్పించనేలేదామెకు. ప్రక్కవీథిలోని లెక్చరరుగారబ్బాయి, వాళ్ల నాన్నగారు క్రితంరోజు వ్యాసారావుదగ్గర తీసికొన్న కలాన్నివ్వటానికి వచ్చి, మాటల ధోరణిలో మాలంకర్ జీ నిర్యాణాన్ని గురించి, కాలేజీ మూసివేయటం, అంతా పన్నెండుగంటలకే రావటం చెప్పాడు. అతనలా వెళ్లగానే బామ్మగారి నడిగింది సరళ, "ఆయన నిన్న మధ్యాహ్నం వచ్చారటండీ?" అని. "వచ్చినట్లున్నారమ్మా, 'ఎక్కడికి వెళ్ళింది, ఎక్కడి కెళ్ళిందని గుచ్చి గుచ్చడిగితే నాకే సిగ్గయింది," అని సమాధానం చెప్పిందా బామ్మగారు తడిగుడ్డ పిండుకుంటూ. దుఃఖం ముంచుకొచ్చిన సరళ వ్యాసారావును రాగానే అడిగివేసెయ్యాలని తలపోసింది. ఇంకా వ్యాసారావురాలేదేఅనితహతహలాడిపోయింది తనవంత అనుమానంగా భావించినందు కవమానపడిపోయింది. వ్యాసారావు

రావట మాలస్యంకావటంవల్ల కొంచెం స్తిమితంచిక్కి జాగ్రత్తగా ఆలోచించ సాగింది. ఆఖరి కతన్ని తానుగా యేమీ హెచ్చరించకూడదనీ అతనే ప్రస్తావన తెస్తేనే సమాధానమిద్దామనీ భావించింది. కనీసం లీలగానైనా తనలో ఖేదాన్నిగానీ, కోపాన్నిగాని కనపడనీయకుండా, యెప్పటి చలాకీ సరళగానే మసలుకోసాగింది వ్యాసారావు తిరిగి యింటికి చేరేపాటికి.

తరువాత కొన్నాళ్ళు వ్యాసారావు అకస్మాత్తుగా యింటికి కాలేజీనుంచి వచ్చి భద్రంగా వేయబడ్డ తాళాన్ని చూచి వెళ్ళేవాడు. సరళ తను కాలేజీకి పోయిన అరగంటకు యింటికి తాళంవేసి వెళ్తుందని, తను రావటానికి అరగంట ముందుగా యింటికి చేరుతుందనీ గ్రహించగలాడు వ్యాసారావు. తను యెప్పటిలా కాలేజీకని బయలుదేరి తీరా గుమ్మంలోకి వెళ్ళి తిరిగివచ్చి కోటూ, బూటూ తీసి కాలేజీ మానివేసినరోజు, సరళ యెప్పటిలా వెళ్ళకుండా యింట్లోనే వుండిపోవటం, ముంజేతికంకణానికి అద్దమెందుకన్నంతటి నమ్మకాన్ని గల్గించింది అతని అనుమానాన్ని ధృడతరంజేసి. వ్యాసారావు అభ్యుదయవాది గాబట్టి నోరెత్తలేకపోయాడు సరళముందు. కాని స్త్రీలనుగురించి అతనికున్న సదభిప్రాయాలన్నీ హారతికర్పూరంలా హరించుకుపోసాగాయి. మెల్లమెల్లగా స్త్రీలంటే పూర్వులు వ్యక్తీకరించిన అభిప్రాయాలే సబబైనవేమోననే తలపులు కూడా తలచూపసాగాయి. వీటన్నిటి ఫలితంగా సరళతో చిఱ్ఱుబుఱ్ఱుమంటూనే కాలం గడుపుతున్నాడు వ్యాసారావు అవసరమొచ్చినంతవరకు ముక్తసరిగా మాట్లాడి కాలాన్ని గడిపివేయసాగింది సరళ వ్యాసారావుతో. అందరికీ ఆదర్శంగా కన్పించే ఆ సంసారంలో అగ్నిపర్వతాలు కాపురం చేస్తున్నాయని ఆ యిద్దరికే తెలుసు–ఆదర్శదంపతులకు!

3

కాలేజీ ఆచార్యవర్గాన్ని స్వయంగా ఆహ్వానించారు స్త్రీసమాజపు అధ్యక్షు కార్యదర్శినిలు, వార్షికోత్సవానికని ప్రధానాచార్యులు తప్పకుండా రాగలమని హామీయిచ్చారు. అధ్యాపకవర్గమంతా హాజరుగావటాని కుత్సహించారు. ఆనాటి వుత్సవానికని ప్రత్యేకంగా వేయబడ్డ పందిరి అందచందాల అలంకరణలతో రామణీయకంగా వుంది. కోలాహలంగా స్త్రీలు చీరెల ఘెళఘెళలతో సింగారాలకు శృంగారాన్నిస్తూ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వర్తించటానికి సమధికోత్సాహంతో కాయశక్తులా కృషిచేస్తు



★ గాలి కోళ్ళు ★

న్నారు. ఆహూతు లందరినీ ఆదరపూర్వకంగా వారివారికని ప్రత్యేకింపబడ్డ స్థలాల్లో కూర్చుండజేస్తున్నారు కొందరు వుత్సాహవతులు. జరుగవలసిన కార్యక్రమాన్ని చర్చిస్తున్నారు పెద్దలైన బాధ్యురాండ్రు. అధ్యక్షస్థానా న్నలంకరించారు ప్రఖ్యాత శ్రీమతి సుమతి. భరతమాత నారాధించారు ప్రార్థనలో 'భారతి'. ఆదర్శ మహిళామూర్తుల్ని భినందించి ఆశీర్వదించండమ్మా అని అర్థించారు లలితగీతాల్లో 'లలితా ప్రభృతులు' అధ్యక్షోపన్యాసానంతరం కార్యదర్శిని నివేదికను నివేదించారు. కార్యదర్శిని నివేదిక కృతజ్ఞతను వెల్లడించింది ప్రత్యేకంగా వో ఆదర్శమూర్తికి.

"మాట్లాడటం మా మిత్రురాలికసహ్యం. చేసి చూపట మామె కాదర్శం! సరియైన కాలంలో మాతో స్వయంగా పరిచయం చేసుకుని, చేయూతనిచ్చి మా సమాజపుటునికికే కారణభూతురాలైన యీ సోదరి మాకు లభ్యం కావటం మా అదృష్టం. ఆమె మా సమాజానికి వెన్నెముకవంటిదిగావటం మాకు గర్వకారణం. మా విద్యాలయాని కామె నిస్స్వార్థంగా ప్రధానోపాధ్యాయినిగా పనిజేసి మా విద్యాలయానికి కీర్తిప్రతిష్ఠలు తీసికొని రవటంతో మా సమాజమే ధన్యత నందింది. ఇంత అవిరళకృషి చేసి, శ్రమించి, మార్గదర్శకురాలైన యీ ఆదర్శ గృహిణిని చంద్రునికో నూలుపోగన్నట్లుగా మా శక్తి కొద్దీ సన్మానించటానికీసమాజపు కార్యవర్గం తీర్మానించి ధన్యమయింది. తరువాత కార్యక్రమాలు సమాప్తికాగానే యీ సన్మానం జరుపుతాం. ఈ సభికుల కామె పవిత్ర నామాన్ని యిప్పుడే తెలియజేయాలనే నేను వుత్సాహపడుతున్నా, ఆమెనే చూపి అందరికి పరిచయంచేయాలనీ, అంతవరకూ సందిగ్ధతలో నే మిమ్మల్నందరినీ వుంచి వొక్క మాటుగా ఆశ్చర్య చకితుల్ని చేయాలనీ మా అధ్యక్షురాలు నన్నాదేశించారు. అంతవరకూ వోపికతో దయచేసి వేచి వుండండని ప్రార్థిస్తున్నా"నని కార్యదర్శిని ముగించగానే కరతాళధ్వనులు మిన్ను ముట్టాయి ఉత్సాహంగా యెగురు చూడసాగారు సభికులంతా వ్యాసారావుతో సహా. ఊహాగానాలు చేయసాగారా వ్యక్తిని గురించి మరికొందరంగులో. తరువాతి కార్యక్రమం, "భామా కలాపం" ప్రదర్శింపబడ్డది. భామాకలాపం పూర్తికాగానే "ఆమె"ను చూడ్డానికే అందరి కండ్లూ కాచుకూర్చున్నాయి. ఇంతలో కార్యదర్శిని మళ్ళీ మైక్రోఫోను ముంగుకు వచ్చి గంభీరంగా "ఒక్క మనవి" అనటంతో సభాంతరాళమంతా నిశ్శబ్దమైంది. కార్యదర్శిని "శ్రీ వ్యాసారావుగారు ఎం. ఏ. కాలేజి లెక్చరర్. వీరో మారు దయచేసి యీ వేదికమీదకు రావాలని ప్రార్థన" అని ఎదురుచూడసాగింది. ఈ వ్యక్తెవరోనని అంతా వెనక్కు చూడసాగారు. కార్యదర్శిని తిరిగి శ్రీ వ్యాసారావుగారి నాహ్వానించిందా వేదిక మీదికి. వ్యాసారావు వళ్ళు ఝల్లుమన్నట్లయింది. తోటివాళ్ళంతా వెండి వెండని ప్రోత్సహించారు. యంత్రంలా వెళ్ళాడా వేదికమీదకు. నమస్కరించి ఆహ్వానించిందా కార్యదర్శిని. అలవాటు ప్రకారం కరతాళాలు మ్రోగాయాయన వేదిక నెక్కగానే. వారి నా వేదిక మీద మరో కుర్చీలో ఆసీనుల్ని చేసి కార్యదర్శిని మైక్రోఫోనుముందు నిలబడి, "సభికులకొక మనవి. ఇప్పుడే యిక్కడకు చేరిన వో జాబును చదివి వినిపించాలని మే ముత్సహిస్తున్నాం. దయతోనూ, సానుభూతితోనూ తమరంతా శ్రద్ధాళువులై సాంతంగా యీ జాబును వింటారని ఆశిస్తున్నాం," అని జాబును చదవటం మొదలుపెట్టింది వోమారు గొంతును సరిజేసికొని.

స్త్రీ సమాజం కార్యదర్శిని గారికి,

సోదరీ,

నమస్కారాలు :

మీరు నన్నభిమానంతో సన్మానించాలని నిర్ణయించి పంపిన ఆహ్వానాన్నందుకున్నాను. కృతజ్ఞురాలిని. నేచేసిన సేవకన్నా మీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలు యీ మీ నిర్ణయంవల్ల వ్యక్తమౌతున్నయ్.

నే నేమైనా మన సమాజాభివృద్ధికి కృషిచేసి కృతార్థురాలనై వుంటే దానికి మీరంతా నాకిచ్చిన ఆదరపూర్వక సహకారం మొదటి కారణం. రెండవది పూజ్యులు నా భర్త నాకిచ్చిన ప్రోత్సాహం కాక మరే ముంటుంది?

నేను స్వయంగా యీనాటి సభకు హాజరై అందరి దీవనలతోపాటు, మీరివ్వ సంకల్పించిన బహుమతుల్ని స్వీకరించలేకపోయినందుకు క్షమించాలి. కాని మీరేమాత్రమూ యిందువల్ల నిరుత్సాహపడవద్దని ప్రార్థిస్తూ, నా కందవలసిన బహుమానాన్ని; నాకే ఆదర్శమూర్తి ప్రోత్సాహం లభించటంవల్ల నే నీపాటి సన్మానాని కర్హురాలను గాగల్గానో, ఆ నాభర్త శ్రీ వ్యాసారావుగారి ద్వారా పంపించండని ప్రార్థిస్తున్నాను. నిజానికి నేనే స్వయంగా యీ బహుమానాన్నందుకుని అనుభవించే ఆనందంకన్నా, నా తరఫున నా బహుమతుల్ని స్వీకరించి నా భర్త నాకు బహూకరించటం నాకెక్కువ ఆనందదాయకమని మీరూ వప్పుకుంటారని నమ్ముతున్నాను.

సెలవు.

సోదరి సరళ.

కరతాళధ్వనులు మళ్ళీ మిన్నంటాయి. వ్యాసారావు ఆశ్చర్యంతో వుక్కిరిబిక్కిరై, అవమానంతో క్రుంగిపోయి, పశ్చాత్తాపంతో వుడికిపోయి స్తబ్ధుడైపోయాడు. పూలదండలతన్నలంకరించసాగాయి. అభినందిస్తూ అధ్యక్షురాలు సరళకందవలసిన బహుమతుల నందించింది. పుచ్చుకున్న వ్యాసారావుకు కృతజ్ఞత ప్రకటించటంకూడా తోచలేదు. ఆగండని వ్యాసారావును వారించిన కార్యదర్శిని, "పురుషులకు మార్గదర్శి, ఆదర్శ స్త్రీమూర్తిని తీర్చిదిద్దిన మహామహుడు శ్రీ వ్యాసారావుగారిని మేం అభినందించి కృతజ్ఞత వెలిబుచ్చుకుంటూ, యీ చిన్న బహుమతిని దయతో స్వీకరించండని ప్రార్థిస్తున్నాము. చక్కని ఈ చిన్న ఫోటో ఫ్రేము సోదరి సరళ స్వయంగా గంధపుచెక్కతో మా గృహపరిశ్రమల తరగతులలో తయారుచేశారని వివరించటానికి గర్విస్తున్నా"మంటూ అందించింది వ్యాసారావును మిత్రులంతా అభినందనలలో ముంచెత్తారు. హృదయావేగాన్నణచుకుంటూ యింటికి దారితీశాడు వ్యాసారావు.

4

"సరళా! క్షమించు. నిన్నపార్థంచేసికున్నాను. నీకన్యాయంచేశాను. శుద్ధమూర్ఖుణ్ణయ్యాను. క్షమించానను సరళా!" నాటకంలో పాత్రధారిలా వుద్వేగంతో మాట్లాడేస్తున్నాడు వ్యాసారావు, డాబామీద వాలుకుర్చీలో పడుకొనివున్న సరళతో. "ఛీ! అదేమిటి? లెం"డని ఆప్యాయంగా తల నిమురుతూ ముఖాన్ని ముఖంలోకి త్రిప్పుకుందిసరళ. "కాదు సరళా! నిన్నర్థంచేసికోలేక..." ఏమేమో మాట్లాడబోతున్న వ్యాసారావును, ఆశ్చర్యం ప్రకటించుతూ, వ్రేలితో చూపుతూ, "అటు చూడండి! అవేమిటి?" అని ప్రశ్నించింది సరళ. అటు చూస్తూ వ్యాసారావు, "అవి తెలియదూ? సెక్రటేరియట్ రోడ్డు బ్రిడ్జిపైన గాలికోళ్ళు! గాలియెటునుంచి వీస్తుంటే అటుచూస్తుంటాయవి," అని చెప్తున్న వ్యాసారావుమాట పూర్తికాకుండానే కల్పించుకున్న సరళ, "పురుషుల మనస్సుల మాదిరే నా?" అంటూ వోనవ్వు కిలకిలానవ్వింది. ★

వనితా లోకం

సమాజాభివృద్ధి:

"మాకేం! కావలిస్తే వాళ్లే మళ్లీవచ్చి మావీధి తుడుస్తారు!"

గ్రామీణులు నవీన పద్ధతుల ననుననుసరించి అభివృద్ధికి పాటు పడడానికై మన ప్రభుత్వం, చాలా డబ్బు వ్యయపరచి కృషిచేస్తోంది అసలు ఈ సమాజాభివృద్ధి ఎంతవరకు గ్రామీణులకు ఉపయోగపడుతోందో ఆలోచించడం ఎంతయినా అవసరం. గ్రామంలో కుటీర పరిశ్రమలు, వృత్తిపనులూ అందరూ చేసుకుంటూనే ఉన్నారు. ఈకుటీర పరిశ్రమలని వృత్తిపనులనూ సులభమైన మార్గంలో చేసే పద్ధతులు వచ్చాయి ఇదివరకు ఒక రాట్నం మీద దారంతీస్తే ఒక కదురు నిండేది. ఇప్పుడు అంబర్ ఛరఖాలు వచ్చాక ఒకే సారి నాలుగు కదుర్లతోటి దారంతీయ వచ్చు. పొద్దున్ననుంచి సాయంకాలం వరకూ పొలంపనితో తీరికలేని వారందరికీ రాత్రిబడి పెట్టారు. గ్రామాలలో అక్షర జ్ఞానం లేనివారందరికీ రాత్రి స్కూల్సు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. చదువు నేర్చుకొనే వారందరికీ పలకపుల్లలదగ్గర నుండి సప్లయిచేస్తున్నారు. మధ్య తరగతి స్త్రీలకు కూడా ఉపయోగంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో మహిళా సంక్షేమ శాఖలు పెట్టారు. వీటిని నడపడానికి విమెన్స్ వెల్ ఫేర్ ఆఫీసర్లని కూడా నియమించారు. ప్రతిగ్రామంలో ఒక సెంటర్ పెట్టారు. ఎవరికి ఏది ఇష్టమయితే (మిషన్ కుట్టడం కాని, ఊలుఅల్లిక, చేనేత, వడకడం) అది నేర్చుకోవచ్చు. ఇవన్నీ నేర్పడానికి ఒకావిడ ఉంటుంది. ఈ సెంటర్ లో పిల్లలకి ఆటలు, కోలాటం మొదలైనవి నేర్పుతారు. నేర్చుకొనేవారికి ప్రోత్సాహం కోసం, చేతిపనులకు, వ్యవసాయదారులకు ఎగ్జిబిషన్ పెట్టి అందులో బాగున్నవాటికి బహుమతులు ఇస్తారు. మొన్న మాకుదగ్గరగా ఉన్న బ్లాకులో ఎగ్జిబిషన్ జరిగింది. ఎన్నో రకాలు కుట్టినవి అల్లినవి, వివిధ రకాల చేతిపనులు ప్రదర్శించారు. జంతువులు మొదలు కొని కూరలదాకో అక్కడ తెచ్చిపెట్టారు.

ఎగ్జిబిషన్‌కి ఒక గేదె వచ్చింది. దీన్ని ముర్రెగేదె అంటారుట. పూటకి పదిశేర్లు పాలు ఇస్తుందిట. ఎగ్జిబిషన్ చాలా బాగా జరిగింది. ప్రతిగ్రామంలో వుమన్ వెల్ ఫేర్ బ్రాంచిలు లేక సెంటర్ లు ఉన్నందువలన స్త్రీలు మధ్యాహ్నం తీరుబడి సమయాలలో అన్నీ నేర్చుకోవచ్చు. నేర్చుకొనేందుకు మనం ఏమీ పట్టుకువెళ్లక్కరలేదు. సూదిదగ్గరనుంచి అన్నీ వారే సప్లయి చేస్తారు.

పోతే ఇంక గ్రామసేవక్‌ల సంగతి:— వీరు చాలా శ్రమపడుతున్నారు గ్రామాల్ని పునరుద్ధరించడానికి. వీధులు ఎలా శుభ్రపరచాలో ఆ చెత్త ఎక్కడ పొయ్యాలో ఎలా శుచిగా ఉంచాలో, గ్రామీణులకు ముందు చేసి చూపిస్తున్నారు.

ఆ మధ్య ఒక పత్రికలో ఒకావిడ వ్రాశారు. ఒక గ్రామంలో ఈ గ్రామసేవకులు వీధులు ఎలా శుభ్రపరచాలో ఆ చెత్త ఎక్కడ పొయ్యాలో అన్నీ చేసిచూపించారుట. తరువాత మళ్లీ వారు చెప్పినట్లు చేస్తున్నారో లేదో చూద్దామని అధికారి తనిఖీకి వెడితే ఎవరూ వీధివాకిలి కాని, ఇంటి దొడ్డి కాని తుడుచుకోలేదుట.

వాళ్లే తుడుస్తారు!

"ఈ తుక్కంతా ఇలాగే వదిలేశారేం" అని అధికారి అడిగాడట.

"అదేమోనండి. మాకు గోజులనాడు వాళ్ళెవరో వచ్చారు. వీధి అంతా తుడిచి, ఏవో కబుర్లు చెప్పి వెళ్లారు. మళ్ళీ ఈ చాయలకన్నా - రాలేదు. మధ్య మాకేం. కావలస్తేవాళ్ళే తుడుస్తారు" అన్నారట అక్కడివారు!

మంచిపద్ధతులు నేర్పడానికి ఓసారి వచ్చిన గ్రామసేవక్‌లను చూచి, కావలిస్తే వాళ్ళే మళ్లీమళ్లీ వచ్చి తుడుస్తారు లేపోతే మేం నిక్షేపంలా ఈ మురికి మధ్య నే ఉంటాం అన్న ఈ ధోరణి చూచి ఆనందించాలో విచారపడాలో బోధపడదు.

గ్రామస్థులుకూడా తమ బాధ్యతలు తెలుసుకుని సహకరిస్తే నేగదా అభివృద్ధి సాధించగలం.

ఇంక పొయ్యిల విషయం చూడండి: ఒక పొయ్యిమీద ఒకసారి మూడు గిన్నెలతో వండుకు నేందుకు వీలుగా ఉన్న పొయ్యికు 'మగన్ ఛుల్ హా' అని పేరుపెట్టారు. దీనికి పొగపోవడానికి ఒక గొట్టంకూడా ఉంది. సుఖం ఉన్నా, వ్యయం ఎక్కువ. బండి కర్రలూ సెలరావు. ఈ పొయ్యి పెద్ద పెద్ద కుటుంబాలవారికి చాలా ఉపయోగపడుతుంది. మడీ ఆచారం లేనివారికి, మరీ పనికొస్తుంది. మడి ఉన్నవారికయితే రోజూ అలుక్కోవడం కష్టం.

అంబర్ చరఖాలు కూడా మధ్యతరగతి కుటుంబాలవారికి చాలా ఉపయోగపడుతున్నాయి. ప్రతిగ్రామంలో దీనికి కూడా ఒక సెంటర్ పెట్టి ట్రయినింగు ఇస్తున్నారు. నేర్చుకొనేవారందరికీ ప్రతీనెల పదిరూపాయలు ఇస్తారు. చిలపకి అరుకానులు ఇస్తారు. రోజుకి ఎన్ని చిలపలు తీస్తే అంత ఆదాయం. ఇదికాక కోళ్ల అభివృద్ధికేంద్రాలు మొదలయినవి చాలా ఉన్నాయి.

ఇతర కార్యక్రమాలతోపాటు మహిళా, శిశుసంక్షేమ కార్యక్రమాలలోనూ ఇ సుక

(35-వ పేజీచూడండి)

ఆయన ఇస్కూలేమో! ఆయన పుస్తకాలేమో! అంతేగాని, ఇహ ఈ సంసారంగొడవ ఆయనకేమీ పట్టదు తల్లీ! ముగ్గురు పిల్లలు పెళ్ళికెదిగి కూర్చున్నారు గదా! మనుషులికి బొత్తిగా చీమ కుట్టినట్టైనా లేకపోతే ఎలాగమ్మా?"

అంది మా పిన్ని కూరలు తరుగుతూ. మా బాబయ్య ఆమాటవిని తాగీతాగీ కాఫీ అన్నా పూర్తిగా గొంతుకలో పోసుకోకుండా విసరుసలాడుతూ వీధిలోకి వెళ్ళిపోయాడు!

"అదీ వరస! పోనీ నాకేం! ఎవళ్ళయోగం ఎల్లాగఉంటే అలాగే జరుగుతుంది. అంతేతే! అరిచి అరిచి నా నోరు పడిపోతూంది తల్లీ!"

ఉసూరుమంది మా పిన్ని. మొన్న వేసంకాలం సెలవులికి మాపిన్నిగారింటికి వెళ్ళాను. నేనేమో సుఖంగా నాలుగు రోజులుండి వద్దామనే వెళ్ళాను. గాని ఉన్నన్నాళ్లూ మా పిన్నికీ బాబయ్యకీ మధ్య ఒకటే రభస! ఈవిడగారాయన్ని "మరి ఆడపిల్లలకి పెళ్ళిళ్ళ మాటేమిటండీ!" అని రోజూ పుండుసలిపి పట్టు సలుపుతుంది. ఆయన "నన్ను మాత్రం ఏంచెయ్యమన్నావే! ఎక్కడికి వెళ్ళినా కొంస్త మొగవెధవ అయితే సరి! మూడు వేలు నాలుగు వేలు తెమ్మని కొండెక్కి కూర్చుంటున్నారు. తిరగ తిరగలేక నా కాళ్ళరిగిపోతున్నాయి." అంటాడు. ఆ పైన మాటా మాట పెరుగుతుంది. అయినా మాపిన్ని ఆయన్ని రోజూ అలాగే వేధించుకు తింటుంది. పాపం ఆవిడమాత్రం ఏంజేస్తుంది. కళ్ళకెదురుగా ముగ్గురాడపిల్లలు పెళ్ళికెదిగి కూర్చున్నారాయెను! ఇంకో రెండేళ్ళకి ఆ నాలుగోపిల్ల కూడా పెళ్ళికెదిగి కూర్చుంటుంది.

మా పిన్నికి నలుగు రాడపిల్లలు. ఇద్దరు మొగపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్ళి యీడు వచ్చేటప్పటికి కొంచెం పాడిదగ్గు పట్టుకుంది. ఇరుగుపొరుగు అమ్మలక్కలది ఆస్తమా అని ఆడిపోసుకున్నారు. మరి ఆ అమ్మాయికా సమయంలో మంచి సమ్మంధం ఏదీ కలిసిరాలేదు! తరవాత ఆపిల్లకిబియ్యేదాకా చదువు చెప్పించారు. ఇప్పుడొకచోట ఉద్యోగం చేసుకుంటూ కాలక్షేపం చేస్తూంది. దానికిప్పుడు ఇంచుమించుగా పాతికేళ్లు పైబడ్డాయి. ఇంతవరకు పెళ్లి కాలేదు. మా పిన్నికిక అవుతుందని ఆశకూడా లేదు. ఇహ రెండోపిల్ల మాట! అది ఇస్కూల్ ఫైనల్ ఫేలయింది. ఇంట్లోనే వుంది. దానికి దరిదరిగా యిరవై యేళ్ళు పైబడ్డాయి. మూడో పిల్ల ఇస్కూలు ఫైనలు పాసయింది. పోనీ పాసయిన పిల్లని చదువు మానిపించడం ఎందుకని కాలేజీలో జేర్పించారు. ఇప్పుడది ఇంటరు చదువుతూంది. దానికి పద్దెనిమిదేళ్లు పూర్తిగా నిండాయి. నాలుగోదానికప్పుడే పద్నాలుగో ఏడు! ఫిఫ్తుఫారం చదువుకుంటూంది.

మా బాబయ్య హైస్కూలులో లెఖ్ఖలు చెప్తారు. మరి వేరే వెనకాసరా ఏమీ లేదు. కష్టపడి ప్రైవేట్లు చెప్పి మొగపిల్లలిద్దరికీ బియ్యేదాకా చదువు చెప్పించాడు. ఇంక పెద్దచదువులు చదివించడానికి మా బాబయ్యకి స్తోమతులేదు. పుత్రవాళ్ళిద్దరూ ఇంకా ఏ ఉద్యోగంలోను కుదురుకోలేదు. మొగపిల్లలిద్దరికీ ఏవో సంబంధాలు వస్తున్నాయిగాని, ముందస్తిగా ఆడపిల్లల పెళ్ళిళ్ళ మాట తేలందే మా బాబయ్యకి వాళ్ల పెళ్ళి మాట తలపెట్టడం ఇష్టంలేదు. మొన్న చైత్ర వైశాఖాల్లో ఏదైనా ఒక సమ్మంధం కుదురుతుందేమోనని బాబయ్య కాళ్లకి బలపాలు కట్టుకు తిరిగాడు. ఎంత తిరిగినా ఒక్క పిల్లకీ సమ్మంధం కుదరలేదు. చిట్టచివరికి పెళ్ళిళ్లరోజులన్నీ గడిచిపోయాయి మరి!

ఒక్క మా బాబయ్యగారి కుటుంబంలోనే కాదు. ఈ రోజుల్లో ఏకుటుంబంలో చూసినా ఒకళ్లో ఇద్దరో పెళ్ళికెదిగిన ఆడపిల్లలు కనిపిస్తున్నారు. అసలు మన సామాన్య సంసాల్లో ఆ రోజు కా రోజు గడిచి బయటపడడమే ఒక్క పెద్ద యమగండంగా ఉంది. ఈ ఆడపిల్లల పెళ్ళిళ్లకని వేలకివే లెక్కడ గుమ్మరించగలం!

మా తాతగారి కాలంలో కన్యాశుల్కాలెక్కువట! ఆయన పెళ్ళికి కన్యాశుల్కం కింద అయిదువందలు కరుకులు గుమ్మరించారట! అదేంపాపమో గాని కన్యాశుల్కాల బాధ తప్పిపోయి ఈ రోజుల్లో వరశుల్కాల బాధ ఒకటి పట్టుకుంది. ఆస్తిపాసులు లేకపోయినా కాస్త బియ్యేదాకా వెలిగించిన పుత్రాడికి మూడు వేలు, నాలుగు వేలు గుమ్మరించమంటున్నారు.

ఆడపిల్ల

తల్లిదండ్రు

ఉపన్యాసాల హంగామా

మన పెద్దలంతా వేదికలమీద నిలబడి కన్యాశుల్కాలు వరశుల్కాలు పుచ్చుకో కూడదని ఈ ఉపన్యాసా లెగరగొట్టేస్తారు! గాని తీరా తమదాకా వచ్చేసరికి మధ్యవర్తులద్వారా 'ఇంతకి కానీ తక్కువయితే వీలులేదని' గట్టిగా రొక్కిస్తారు! 'ఇదేమిటీ అన్యాయ'మని ఎవరేనా కొంచెం నోరు మెదిపితే "మేం మాత్రం ఆడపిల్లలికి పెళ్ళిళ్ల

★ ఎ. జి.

మన ఇళ్లలో ఆడపిల్ల పుట్టిందనగానే ఆడపిల్ల అనగానే ఒక పెద్దబరువు కాస్త కుటుంబాని కాసరా అవుతాడు. పెళ్లేకాదు. ఆపైన ఆపిల్ల అత్తవారింటి పెళ్ళి అంటేనే ఒకపెద్దయిబ్బంది! పైబడి నోట్లోకి పోయేవాళ్లే కనిపించడంలేదు. దొరికితే వేలకువేలు గుమ్మరించమంటున

ఈ కట్నాల బెడద ఈమధ్య వ లేనన్ని కులాలు! ఆ కులాల్లో మళ్ళీ మూలంగా ఎన్నెన్నో ఎగుడుదిగుళ్ళు! కుటుంబాలలో ఆడపిల్లలకి తగినసంబంధ తునిబట్టి ఆడపిల్లల్ని కన్న తల్లిదం బాగా పూర్వకాలంలో ఇలాంటి ఏ కీరోజుల్లో ఇన్నిఇబ్బందు లెందుకువచ్చె లోతుగా ఆలోచిస్తే అసలు కారణాల

...ల పెళ్ళిళ్ళు

...ల అగచాట్లు

సరోజిని ★

...అందరు చప్పరించేస్తారు! అవును మరి!
...మోదపడుతుంది. మొగపిల్లాడయితే
... ఆడపిల్లకి వేలకివేలు గుమ్మరిస్తేగాని
...కి వెళ్లిపోతుంది. ఈరోజుల్లో ఆడపిల్ల
...కి అనలెంత వెదకినా కాస్త నాలుగువేళ్లు
...క వేళ అలాంటి వాళ్లెక్కడన్నా
...న్నారు.
...రీ ఎక్కువైపోయింది. మనలో లెక్క
... శాఖలు. ఆ శాఖల్లో ఆస్తిపాస్తుల
...టి అన్నింటిమూలాన్ని మన హిందూ
...ాలు దొరకడం లేదు. తమతమ శాఖ
...లు అందరు ఇబ్బందులు పడుతున్నారు.
...లేవని అంటారు. అయితే మన
...యి? వీటికి కారణమేమిటి? కొంచెం
...న్న ఒక టూకటే బైటపడతాయి.

చేసుకోవద్దూ! మొగపిల్లలదగ్గిర కట్నాలు కాజేసుకోపోతే ఎలా!" అంటారు.

శాఖా భేదాలగోల

దీనికితోడు మనలో శాఖా భేదాలగోలవల్ల అసలు శాస్త్రయోగ్యుడైన వరుడుదొరకడమే గగనమైపోతూంది ఈశాఖాభేదాలట్లాంటివి అన్ని వర్ణాలవారిలోను ఉన్నాయి బ్రాహ్మణకుటుంబాల్లో ఇవి మరీ ఎక్కువ. బ్రాహ్మణుల్లో స్మార్తులనీ, వైష్ణవులనీ, మాధ్వులనీ మూడు మతాలవారున్నారు! మొత్తం మీద వీరంతా బ్రాహ్మణులే కాని వీరిలో వీరికి ఇచ్చిపుచ్చుకోవడాలు లేవు. పోనీ అనుకుంటే స్మార్తుల్లో కూడా నియోగులనీ, వైదీకులనీ, వెలనాట్లనీ, వేగినాట్లనీ, తెలగాణ్యులనీ, కాసలనాట్లనీ, లింగధార్లనీ ఎన్నెన్నో శాఖా భేదాలున్నాయి. వీరిల్లో వీరికి భోజన ప్రతిభోజనలున్నాయిగాని వివాహ సంబంధాలు లేవు అందుచేత ఆయా శాఖల్లో వరులసంఖ్య నానాటికీ చాలా చిన్నదైపోయింది. కొన్ని కొన్ని శాఖల్లో కుటుంబాలు మరీ స్వల్పంగా ఉన్నాయట! ఆ శాఖల్లో వివాహాలు పెద్ద గడ్డుసమస్యలుగా తయారయ్యాయి.

కొద్దిపాటి సంస్కారం

మన పెద్దలు, మహిళామతల్లులు కొంత మంది వేదికలెక్కి — విసుగు, విరామం లేకుండా ఉపన్యాసా లెగరగొట్టేస్తారు! మన హైందవసంఘం నానాటికీ అరలు అరలుగా విడిపోతూందని వాపోతారు. వర్ణాంతర వివాహాలు, వితంతు వివాహాలు బాహాటంగా జరిపించాలని గొంతుకలు చించుకుంటారు!

కాని తీరా ఆచరణదాకా వచ్చేసరికి అందరుమూతీ,ముక్కు విరుస్తారు ముందుగా బ్రాహ్మణులలోనైనా శాఖాంతర వివాహాలు మొదలుపెడితే మిగతా సంఘసంస్కారాలమాట ఆ తరువాత ఆలోచించుకుందాం ఈరోజుల్లో అధమం శాఖాంతర వివాహాలైనా ఎందుకు చెయ్యకూడదు! ఇవి ప్రారంభిస్తే బ్రాహ్మణ కుటుంబాలల్లోనన్నా పది పన్నెండు శాఖలవారు బాహాటంగా వియ్యమందవచ్చును. కాని ఈ మాత్రం చిన్న సంస్కారానికికూడా జంకేవాళ్ళు మనలో చాలామందిఉన్నారు. నిజాని కిలాంటి వివాహాలు చెయ్యకూడదని మన ధర్మశాస్త్రాల్లో ఎక్కడా లేనేలేదట! మా తాతగారొకసారి నాతో ఈ మాటచెప్పారు. మరి ఈ ఆచారం ఎందుకు వచ్చిందని అడిగాను. పూర్వం అసలు గోదావరి అవతల సంబంధాలే చేసేవారుకాట! రైళ్ళు అవీ పడడానికి పూర్వపురోజుల్లో ఈ శాఖాభేదా లేర్పడ్డాయేమో! లేకపోతే తాతగారు చెప్పినట్టు ధర్మశాస్త్రాలలో లేనిఆచారం మనకెలాగ వచ్చింది?

ఈమధ్యన అక్కడక్కడ ఒకటిరెండు శాఖాంతరవివాహాలు జరుగుతున్నాయిగాని ఇవన్నీ పెద్ద సంఘసంస్కారాలని మనవాళ్లు గుండెలు బాదుకుంటున్నారు! కొంతమంది "నిజంగా శాఖాంతరవివాహాలు చెయ్యవలసినదేనండీ! కాని మా ఇంట్లో ఆడవాళ్లు ఒప్పుకోటం లేదండీ! ఏం చెయ్యం!" అంటారు అక్కడికి తమరు మహా ఆడవాళ్ల మాటమీద నడుచుకుంటున్నట్లు!

వెనకటికొకాయన దేవుడు లేడని బల్లగుద్ది ఉపన్యాసాలిచ్చేవాట్ట! ఒకనాడు తిరపతి వెళ్ళి సకుటుంబంగా గుండుచేయించుకు వచ్చాట! ఎవరో ఒకాయన "ఇదేమిటండీ! ఈవిడ్డూరం!" అని అడిగాట్ట. దానిమీద ఆయనగారు "అబ్బే! నాకేం దేవుళ్లన్నా, మొక్కులన్నా బొత్తిగానమ్మకంలేదండీ! కాని మాపిల్లకి చంటిపిల్లగుణం కనిపించినప్పుడు మాఆవిడ 'కుటుంబం అంతా గుడికివెళ్ళి జుట్టిస్తా'మని మొక్కుకుందిట. దానిపోరు పడలేక వెళ్లాము. అంతే! మన అభిప్రాయాలు ఒకళ్లమీదరుద్దడం న్యాయంకాదు చూడండి!" అని నీళ్ళునమిలాట్ట!

ఏదైనా కాస్త మంచిపని ఆచరణదాకా వచ్చేసరికి పురుషపుంగవులు తమతప్పులు మనమీదతోసేసి చల్లచల్లగా జారుకుంటారు!

శాఖల్లోనే ఈసడింపులు

నిజానికి ఈ రోజుల్లో మనశాఖల్లో ఆచారవ్యవహారాలలో అంత పెద్ద హెచ్చుతగ్గులేవు! ఒకరి ఇళ్ళల్లో ఒకళ్ళు భోజనాలకీ, విందులికీ వస్తారు. అయితే వీరిలోవీరికి కొన్ని అహంకారాలున్నాయి. వైదికులు, నియోగులికి బొత్తిగా మడఎడమ లేదనీ అనాచారం ఎక్కువనీ ఈసడిస్తారు నియోగులు వైదికులు తమకన్న కొంచెం కులంతక్కువ అని చిన్నచూపుచూస్తారు కొందరు ఇతరశాఖల వారిపల్లల్ని పెళ్ళి చేసుకుంటారుగాని తమ ఆడపిల్లల్ని ఇతరశాఖలవారికిచ్చి పెళ్ళిళ్లు చెయ్యరు నియోగుల్లో నియోగుల్లోనే కొంద రితరకుటుంబాలవారు తమకన్నా తక్కువని ఈసడించుకుంటారు.

ఇక వైదికులమాట వేరే చెప్పనే అక్కర లేదు! వీరిలో వెలనాట్లు వేగినాటివారిని

★ తల్లిదండ్రుల అగచాట్లు ★

కొంచెం తక్కువగాచూస్తారు. తెలగాణ్యులు తమరు వైదికులందరిలోకీ గొప్పవారమని రొమ్ములువిరిచి మాట్లాడతారు ఆనకట్ట కట్టకపూర్వం వీరిలోవీరికి ఆచార వ్యవహారాలలో కొంచెం తేడాలేమన్నా ఉన్నాయేమోగాని ఈ రోజుల్లో అవేవీ కనబడవు! ఈ రోజుల్లో బాగా తెలుసు మారిపోయాక అందరికుటుంబాలలోను ఆచార వ్యవహారాలొక్కమోస్తరుగానే ఉన్నాయి అసలు వైష్ణవులకీ, వేపారులకీ, మిగిలినవారికీ మధ్య ఉన్న తేడాలే అంతరించిపోతున్నాయి కనక మొట్టమొదటగా స్మార్తుల్లోనన్నా శాఖాంతర వివాహాలారంభిస్తే క్రమక్రమంగా ఈ సంఘసంస్కారం దానంతట అదే వ్యాపిస్తుంది మొట్టమొదట ఈ మాత్రం చిన్న సంస్కరణ మొదలు పెడితే క్రమక్రమంగా మిగిలిన సంఘసంస్కరణలకు దారి దానంతట అదే ఏర్పడుతుంది

మిగిలిన వర్ణాలు

ఈ శాఖాభేదాలవంటివి ఒక్క బ్రాహ్మణులలోనే కాదు. మిగిలిన వర్ణాలలోకూడా ఉన్నాయి.

రాజులలో తూర్పురాజులనీ, పడమటి రాజులనీ వేరుచేసి మాట్లాడుకుంటారు. వీరిలో కొందరు పూర్వం జమీందారీలు కూడా చెలాయించారు. ఆ జమీలన్నీ హరించుకుపోయినా వారి వారి దురహంకారాలలాగే ఉన్నాయి. వీరిలో వీరు వివాహాలు చేసుకోరు

వైశ్యులలోకూడా ఇలాంటి తేడాలు చాలా ఉన్నాయి

ఇక మిగిలిన వర్ణాలవారిలో కమ్మవారనీ, రెడ్లనీ, వెలమలనీ, తెలగలనీ, కాపులనీ చాలా రకాలవారున్నారు వీరిలో వీరికి ఇచ్చిపుచ్చుకోడాలు లేవు.

ఇంకా ఇతర వర్ణాలలో కూడా ఇలాంటి తేడాలు చాలా ఉన్నాయి

ఆడవారి జనాభా

అసలే ఆడవారి జనాభా మగవారి జనాభాకన్న కొంచెం ఎక్కువ.

ఆపైన వర్ణాలుగా, శాఖలుగా ముక్కముక్కలైపోయిన మన హిందూ సంఘంలో నేటి కాలంలో ఆస్తిపాస్తులనిపట్టి మరికొన్ని పెద్దపెద్ద అఘాతాలేర్పడ్డాయి. పూర్వంఆస్తిపాస్తులలో ఇంతటి తేడాలుండేవికావు. ఈ ఆస్తిపాస్తులలో తేడాలు పెచ్చుపెరిగిపోతున్నకొద్దీ ఆ యా శాఖలలో వరులసంఖ్య బాగా తగ్గిపోతూంది ఇందుచేత ఈరోజుల్లో మన హిందూసంఘంలో ఆడపిల్లల పెళ్ళిళ్లు కావడమే గగనమైపోతూంది.

వరకట్నాలు

కన్యాశుల్కాలు, వరశుల్కాలు పుచ్చుకోవడం తప్పని అందరు ఒప్పుకుంటారు. కాని క్రియలో మాత్రం అది ఎక్కడా కనబడడం లేదు.

ఆ మధ్యన కాశీశ్వరరావుగారు ఆంధ్ర శాసనసభలో వరకట్నాల నిషేధబిల్లు ఒకటి ప్రవేశపెట్టారు. ఇల్లాంటి శాసనాలురావడం మంచిదే! కాని వీటివల్ల అట్టే ఉపయోగం ఉండదు! మొత్తంమీద వరకట్నాలు పుచ్చుకోడం ఒక ఘోరదురాచారమని అందరు మనసారా అంగీకరించాలి. వరకట్నాలు పుచ్చుకొనేవారిని నలుగురిలోను తల ఎత్తుకోనియ్యకుండా చెయ్యాలి! ఇలాంటి ఆందోళన లేవదీస్తేగాని మనసంఘంలో ఈ దురాచారం పూర్తిగా నశించిపోదు అసలు ముందుగా వరకట్నాలింతగా పెచ్చుపెరిగిపోవడానికి కారణాలేవిటో కనిపెట్టాలి. వీటికి ఆస్తిపాస్తులలో హెచ్చుతగ్గులు కొంతవరకే కారణం. ఆపైన శాఖాభేదాలవల్ల ఇవి మరింత పెచ్చుపెరిగిపోతున్నాయి.

రక్తమాంసాల వేలం!

దయా దాక్షిణ్యాలు లేకుండా వరకట్నాలు గుంజుకునేవారంతా తమ సంతానం రక్తమాంసాలు వడిబజార్లలో వేలంవేస్తున్నారన్నమాట! కొంచెం లోతుగా ఆలోచిస్తే పశుప్రవృత్తికీ ఈ వేలంపాటలకీ నాకేమీ తేడా కనిపించడం లేదు! మగవారంతా వీటన్నిటికీ ఆడవాళ్ల పట్టుదలలే కారణం అని అంటారు.

అయితే పెద్ద పెద్ద చదువులు చదువుకుని పెళ్ళిళ్ళకు సిద్ధపడే మనయువకులేంచేస్తున్నట్టు! వీరంతా యువజనసంఘాలద్వారా వరకట్నాలకు వ్యతిరేకంగా ఎందు ప్రచారం చెయ్యరు?

మహిళా సంఘాలు

ప్రతిపట్నంలోను మహిళాసంఘాలేర్పరుస్తారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఈ సంఘాలలో ఇలాంటి దురాచారాలెందుకు దుయ్యబట్టరు! ముఖ్యంగా స్త్రీలుకూడా వరకట్నాల నిషేధానికి గట్టిగా ప్రయత్నించాలి. స్త్రీలలో చాలా మంది ఆడపిల్లల్ని కన్న తల్లులే! అయితే ఏం లాభం? తమకొడుకుల పెళ్ళిళ్ళకి రెండు చేతులా వరకట్నాలు గుంజుకొంటారు! కుమార్తెల పెళ్ళిళ్ళు వచ్చేసరికి కట్నాలివ్వలేమని అంగలారుస్తారు! అసలు వీటికి ముఖ్యకారణం మనలో శాఖాభేదాలే! ముందుగా ఇవి తొలిగిస్తే పరిస్థితులు కొంతవరకైనా దారిలోకి వస్తాయి ఈమాత్రం సంస్కరణలైనా ఆచరణలో పెట్టలేనివారు పెద్దపెద్ద సంస్కరణల్ని గురించి మరింత పెద్దగా గొంతెత్తి ఉపన్యాసాలిస్తే మాత్రం ఏం లాభం!

ఈమధ్యన మా పిన్నిగారింటికి వెళ్లివచ్చినప్పటినుంచీ నాగుండెల్లో గుబులు బయలుదేరింది మాఅమ్మాయిని ఈ మధ్యనే బళ్ళో వేశాం

మేమూ అట్టే ఆస్తిపాస్తులున్న వాళ్లంకాదు. మాపిల్ల బళ్ళోకి వెడుతూంటే నాకు మా పిన్నిగారింట్లో జరిగిన రభస అంతా జ్ఞాపకం వచ్చింది.

ఒక్కనాకే అన్నమాటేమిటి? ఆడపిల్లల్ని కన్న తల్లులందరికీ కొద్దో గొప్పో ఇలాంటి బెంగ లుంటాయి.

అయితే ఊరికే బెంగలు పెట్టుకుంటే ఏంలాభం కొద్దోగొప్పో చేతనైనంత వరకు చిన్నచిన్న సంఘసంస్కరణలారంభించాలి. అంతేగాని ఊరికేఉపన్యాసాలిస్తూపత్రికలలో ఏవో రాతలు రాస్తేమాత్రం ఏం లాభం? ఆలోచించండి! ★

ఒరిస్సా వంటకాలు

'నేను ఒరిస్సా వంటకాల పిచ్చిపట్టిందని మా ఇంట్లో వాళ్లంతా వెక్కిరించేస్తున్నారు. నిజంగా నేనొరిస్సా రాష్ట్రం అంతా చూచి రావటం మూలకంగానే అను కుంటున్నాను. అక్కడ అంతా తీపి, చప్ప పిండి వంటలు తప్పితే కారపు వంటలు అట్టే లేవు వాటికోసం ఎంతయినా శ్రమ పడ్డాను. కాని నా శ్రమ అంతా వృధా అన లక్కడ 'శావరీ' వుంటేగా నా శ్రమ ఫలించ డానికి ఒక చిన్న గమ్మత్తు చెప్తాను.

వూరగాయలకని 3 వీశల మిరపకాయలు తెప్పించి ఎండబెట్టారు మా అమ్మగారు ఇంతిట్లోకే మా నాన్నగారి స్నేహయిన ఒక డాక్టరుగారు వచ్చారు. ఆ ఎర్రటి కాయల్ని చూచి డాక్టరుగారు ఏమిటని అడిగారు అవి మిరపకాయలు, కారంగా వుంటాయి, వూరగాయలోకి తెప్పించారు అని చెప్పారు అదివిని ఆ డాక్టరుగారు రొక్క గంతువేసి అమ్మబాబో అంత కారం తింటారా? చచ్చిపోరూ? అందుకే మీకందరికీ అన్ని రోగాలు. అందుకే అలావుంటారని మొదలెట్టారు

ఏదో మొదలెట్టి దేంట్లోకో వచ్చినట్లుంది నాపని ఈరోజుల్లో (వేసవికాలంలో) మధ్యాహ్నం వేళ ఏదో ఒక టిఫిన్ వుండాలి ఎవరైనా స్నేహితులొస్తే కొత్తరకాలవి పెడితే అభినందిస్తారు గూడాను

అందుకే మంచిమంచివి 3 వంటలు చెప తాను మొదటమాటే ఎక్కువ ఎక్కువ చేసుకుని పాడయితే ఆనక నాకు అక్షింతలు వెయ్యొద్దు మొదట కొద్దికొద్దిగా చేసుకొని తరువాతి పెద్ద మొత్తాలకి

సందేష్

ఇది స్వీటే దీనికి కాస్త శ్రమపడాలి శ్రమపడ్డా ఫలితం దక్కుతుంది శేరుపాలతో చేసుకునే విధం చెపుతున్నాను

కావలసిన సామాన్లు ఒక సేరు చిక్కటి పాలు, అవిగాక వేరే ఒక చిన్న కప్పుపాలు, మంచి వెన్న గాచిన నేయి ఐదుస్పూనులు, ఒక తులం గోధుమరవ్వ అర్ధ శేరు నవటాకు పంచదార

ముందర పాలను విరుచుకోవాలి మామూలుగా విరవటంగాగు చిన్నకప్పెడు పాలూ తీసికొని బాగాకాచి దాంట్లో రెండో మూడో ఎండు మిరపకాయలు వేసి మూత పెట్టి కదల్చకుండా వుండాలి రెండుమూడు నిమిషాలకల్లా ఆపాలు విరిగిపోతాయి

ఆ శేరుపాలూ తీసికొని ఒక స్టెయిన్ లెస్ స్టీల్ గిన్నెలో పోసికొని కుంపటిమీద ఉంచి మీగడకట్టేట్టు కాచాలి కుంపటిమీద వుండగానే దాంట్లో ఆ విరిగినపాలు పోసెయ్యాలి రెండు నిముషాల్లో ఆపాలుగూడా విరిగి రసగుల్లాకి అయ్యేట్టు అవుతాయి అదంతా ఒక పల్చటి బట్టలో వేసి గట్టిగా మూట కట్టి ఎత్తున వున్న మేకుకి తగిలిస్తే దాంట్లో వున్న నీరంతా పోయి 2, 3 గంటలకల్లా పొడ పొడలాడుతూ వుంటుంది. అంటే ఇది మనం చేసుకునే కంటే 4 గంటలు ముందరగా చేసుకోవాలి అదంతా కలపి పొవుజున్నూ అవుతుంది

అప్పుడు తులం గోధుమరవ్వ తీసికొని అది శుభ్రపరచుకోవాలి కాచిన నెయ్యిలో రెండుస్పూనులు తీసుకొని గోధుమరవ్వలో వేసి బాగా కలపాలి అంటే ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే గోధుమ రవ్వ పొడపొడలాడుతూనే వుండాలి

అర్ధ శేరు నవటాకు పంచదారలో పుల్లా పురుగూ ఏమీ లేకుండా ఏరుకుని మెత్తగా విసురుకోవాలి

అద్దంకి శ్రీదేవి

కుంపటిమీద బాణలి పెట్టి దాంట్లో పాలువిరవగా వచ్చిన పావుజున్నూ వేసి అడుగు అంటకుండా మాడిపోకుండా కదుపుతూ సన్నసెగమీద వేయించుతూ వుండాలి ఇది పొడపొడలాడుతూ అవుతుంది. అప్పుడు ఆ గోధుమరవ్వగూడా వేసి బాగా వేగనివ్వాలి. బాగా వేగినతరువాత విసురుకువుంచుకున్న పంచదారంతా (ఎంత తీపి తింటే అంతవుజ్జాయింపుగా) వేసి వేయిస్తూవుండాలి, కొంతసేపటికి పంచదారంతా కరిగి ముద్దముద్దగా అవుతుంది. ఒక పళ్ళానికి కొద్దిగా నెయ్యిరాసి ఆముద్ద పళ్ళెంలో వేసికొని నాలుగుమూలలకీ సర్దుకోవాలి రెండు మూడు నిముషాలలో అదంతా గట్టిపడుతుంది. అప్పుడు చాకుతో డైమండ్సుగా, నలుచదరంగా మన ఇష్టం వచ్చిన షేపులోకి తెచ్చుకోవాలి

కంటికి తెల్లగా పాలగోకనిపిస్తూ వుంటుంది. స్నేహితుల్ని ఎవరికి పెట్టినా మెచ్చుకోకమానరు ఇది గట్టిగా వుండటం మూలకంగా వారం రోజులుదాకా పాడవదు పాలతో చేసినది కాబట్టి బలానికి బలం గూడాను.

చేసుకునేప్పుడు పాలు చిక్కనివిగాను, పొంగిపోకుండా బాణలి పెద్దదిగా వుండేట్టు చూసుకోవాలి

సింగడాలు

ఈ సింగడాలు మనం చేసుకునే వూరీలలా వుంటాయి దీన్ని మనం శావరీ అనే అనుకుందాం ఎందుకంటే స్నేహితులకి ఆతిథిపెట్టి వూరుకుంటే లోలోపలనయినా దీవించుట తధ్యం ఇది అప్పటికప్పుడే చేసుకోవాలి లేకపోతే లోపల కూరపని అయిపోతుంది

ఒక శేరు మైదాపిండి, రెండుసవాశేర్ల నేయి, అరవీశెడు బంగాళాదుంపలు, ధనియాలు, మిరియాలు, జీలకర్ర, దాసించెక్క, ఏలకులు, లవంగాలు, గసగసాలు, జాపత్రి, తేజపత్రి, మిరపకాయలు అన్నీ కాసిని కాసిని అయితే చాలు

శేరు మైదాపిండి తీసికొని పురుగు పుట్ర ఏమీ లేకుండా జల్లించుకు అట్టేపెట్టుకోవాలి ముందర మంచి నేయి రెండు స్పూనులు వేసి మైదాపిండిని కలుపుకోవాలి. అంటే ఈ నెయ్యికలిపిన పిండి ముద్దముద్దగా కాక పొడపొడలాడుతూనే వుండాలి. మైదాపిండిలో నీళ్ళుపోసి పూరీలపిండిలా కలుపుకోవాలి దీన్ని బాగా ఒక అరగంటదాకా అన్నా మర్దించి మెత్తగా అయ్యేట్టు చేసుకోవాలి నిమ్మకాయలకన్నా బాగా చిన్నగా చేసుకొని వుత్తపిండితో వత్తుకోవాలి. బాగా పల్చగానే వత్తుకోవాలి

పూరీలకూర పూరీలమీదే పెట్టారు కానీ దీంట్లో లోపలే పెట్టారు అరవీశెడు బంగాళాదుంపలు తీసుకొని బాగా నీళ్ళలో వేసి కడిగి తుడిచివెయ్యాలి ఈ తుడిచిన బంగాళాదుంపల్ని మరీ పెద్దవీ మరీ చిన్నవి గాకుండా కోసుకోవాలి

తేజపత్రి అన్నది ఆకులా వుంటుంది. ఇది బహుశా మనవైపున దొరకదేమో! కాని కష్టపడి అయినా సరే అది సంపాదించండి. ధనియాలు, మిరియాలు అన్నీ కలిపి నేతిలో వేసి వేయించుకుని గుండ కొట్టుకోవాలి. దీన్నే మసాలా అంటారు

కుంపటిమీద బాణలి పెట్టి బంగాళాదుంపలు వేయించుకోవాలి ముక్క కరకరలాడుతూ అయినప్పుడు కాసిని నీళ్లుచల్లి మసాలాదినుసులు వేసి బాగా నాలుగు ప్రక్కలా కలుపుకొని కిందికి దించుకోవాలి అంటే ముక్క ఇప్పుడు మెత్తగా వుంటుంది. ముక్క వేయించేప్పుడు నూనెగాని నెయ్యిగాని వెయ్యనే వెయ్యకూడదు. వత్తిన అప్ప

(34-వ పేజీ చూడండి)

తలితండ్రుల పోలికలు

పిల్లలకు ఎలా వస్తాయి?

ఎ. ఆర్. సుహాసినీఫిలిప్

ఎం ఏ, ఎం ఇడి

(గతవారం తరువాయి)

కొందరు కవలలు ఒకే మాదిరిగా ఉండ రెందుకు?

నిజమే కొందరు, కవలపిల్లలు అన్నమాటే గాని, వారిలో పోలికలు ఉండవు తెలివి తేటలలో తీరుతెన్నులలో కూడ వారు వేరుగా ఉంటారు ఒకరు ఆడ, మరియొకరు మగబిడ్డగా ఉంటారు కూడ

ఇక్కడ జరిగేదేమంటే—ఏదో చెప్ప లేని కారణమువలన విధివశాత్తు తల్లి గర్భాశయములోనికి ఒక్క అండము వచ్చుటకు బదులు రెండు అండములు వస్తాయి. ఎందుకు వస్తాయో మనము చెప్పలేము అవి రాకుండగాని, వచ్చేటట్లుగాని చేసేశక్తి మానవులకు లేదు — ఇలా ఒకేసారి వచ్చే రెండు అండాలూ, రెండు పురుష బీజాలతో సంయోగము చెంది రెండు పిండములుగా రూపొందుతాయి నవమాసాలైన వెనుక "కవలలు"గా జన్మమొందుతారు ఇలాంటి కవలలు విధివశాత్తు ఒకే సమయములో జన్మించిన తోబుట్టువులు ఇతర సహాజన్ములకు వీరికి ఏమి భేదములేదు కాల వైపరీత్యమువలన ఒకేసారి గర్భములోపడి, జన్మించిన ఏకోదర జనితులు. అంతే—

తలిదండ్రుల వ్యాధులు పిల్లలకు సంక్రమిస్తాయా?

మన సత్వశాస్త్రవేత్తలు అనేకులు ఈవిషయము పరిశోధించి కనుగొన్నారు వీరి పరిశోధనలవలన తేలిన సారాంశమేమంటే క్షయ, కుష్టు మున్నగు రోగాలు తలిదండ్రుల నుండి సంక్రమింపవు. బిడ్డ పుటినవెంటనే వ్యాధిగ్రస్తులైన తలిదండ్రులనుండి వేరుచేసి బలవర్ధకమైన ఆహారమిచ్చి, ఆరోగ్య పరిసరములలో పెంచితే వారిలో ఈ వ్యాధులు కన్పించనే కన్పించవు

అయితే ఉన్మాదము, మూర్ఛలు, వర్ణాంధత్వము (ఒకటి లేక కొన్నిరంగులు కన్పించకపోవడము) మున్నగు వ్యాధులు వంశములలో కన్పించడము పరిపాటి ఇలాంటి బలహీనతలున్న కుటుంబాలలో మేనరికాలు చేసికొనకుండా ఉండడము శ్రేయోదాయకము

మేనరికాలు

పాశ్చాత్యులు, మన దేశస్థులలో మళయాళీలు చాలమట్టుకు మేనరికాలకు దూరంగా ఉంటారు మనలో మేనరికాలను విడిచి వేరేసంబంధాలు చేసికొంటే చాల నిందలపాలౌతాము. మేనరికాలవలన క్రొత్త బలహీనతలు ఏర్పడవుకాని కుటుంబాలలో ఉండే ఉన్మాదము, మూర్ఛలు మున్నగు వ్యాధులు స్థిరపడిపోతాయి అనేక తరాలు ఇలాంటివంశాలు మేనరికాలే చేసికొంటూంటే ఈ బలహీనతలు మరింత ఎక్కువగా ప్రబలమౌతాయి ఇలాంటి బలహీనతలున్న కుటుంబాలు దూరపు సంబంధాలు చేసికొనడమువల్ల ఈ బలహీనతలు క్షీణించిపోతాయి ఏబలహీనతలూ లేని కుటుంబాలలో మేనరికాలవలన అనర్థాలేమీ లేవు.

ఒక కుటుంబములో అంతా పొట్టివాళ్లే ఉంటారు అనుకో, వారిబిడ్డలూ పొట్టిగానే ఉంటారా?

"మెండల్" అనే శాస్త్రవేత్త ఈ విషయమై అనేక సంవత్సరాలు పరిశోధనలుచేసి కొన్ని సంగతులు తెలిసికొన్నాడు. దాని సారాంశమేమంటే

ఒక పొడవైన అబ్బాయి, పొట్టి అమ్మాయిని వివాహము చేసికొన్నాడనుకోండి మొదటితరములో అంతా మధ్యరకపు పొడవులోనే ఉంటారు రెండవతరములో వారికి 4 బిడ్డలున్నారనుకోండి. వారిలో ఒకరు తండ్రిలా పొడవుగా, ఒకరు తల్లిలా పొట్టిగా తక్కిన ఇద్దరు సమానమైన ఎత్తులో ఉంటారు. పొట్టిబిడ్డలు, పొట్టివారినే వివాహమాడితే వారి వంశమంతా పొట్టిగానే ఉంటారు సమానమైన ఎత్తుగలవారిలో ఈ లక్షణాలు కన్పించవు

ఈపరిశోధనవలన మనము నేర్చుకోవలసిన విషయమేమంటే శరీర ఛాయ, ఎత్తు, మున్నగు విషయాల్లో వధూవరులు ఆలోచించి వివాహమాడితే తమ బిడ్డల అంద చందాలు 50% అభివృద్ధిచేసికోవచ్చును.

పొడవుగా ఉండేవారు పొడవైన వారినే వివాహమాడితే ఇక లోకములో పొట్టివారు లేకుండా చేయగలమా? వారి పొడవు విపరీతముగా మారదా?

సృష్టి చాల అద్భుతమైనది వైపరీత్యాలను ఒప్పుకోలేదు. సృష్టి అందాన్ని, క్రమాన్ని ఆదరించి, ప్రోత్సహిస్తుంది ఏవిధమైన విపరీత పరిస్థితినీ ఒక హద్దుదాట పోనియ్యదు

పొడవువారు పొడవువారినే వివాహ

మాడారు, అనుకోండి. మెండల్ సూత్ర ప్రకారము జరిగితే 20 తరాలు అయిన తరువాత వారి ఎత్తు ఆకాశాన్ని అంటుకోదూ? అలాగే పొట్టివారు పొట్టివారినే వివాహమాడితే మరీ మరుగుజ్జులు తయారై భూమి నంటుకొనిపోరూ? తెలివిగలవారు తెలివిగలవారినే వివాహముచేసికొంటే వారి సంతానము తన అసమాన్య పాండిత్యముతో లోకాన్నే మార్చివేయదూ? తెలివిహీనులు వివాహమాడితే లోకంలో బుద్ధిమాంద్యము బలిసిపోదూ?

ఇలాంటి విపరీత పరిస్థితుల నెదుర్కొనడానికి సృష్టికి ఒక రక్షణోపాయమున్నది సృష్టిలో ఈ సందర్భములో ఒక విచిత్రము జరుగుతుంది ఇద్దరు పొడవైనవారు వివాహమాడారు అనుకోండి. వారి సంతానము పొడవుగా, సరాసరిఎత్తు(average height)కంటె ఎక్కువగానే ఉంటుంది అయితే వారు తమ తలిదండ్రులకంటె పొట్టిగా ఉంటారు. ఇలా సృష్టి వారి "ఎత్తు"కు ఒకహద్దు నియమించివేస్తుంది తక్కిన విషయాల్లో కూడ ఇంతే. విపరీత పరిస్థితులకు దారితీయక, సృష్టి మానవుని సాధారణపరిస్థితికి తీసికొని వస్తుంది. అందుకే విపరీతమైన పొడవుగా వుండేవారు, మరుగుజ్జులు ఎక్కడో కాని ఉండరు వారు సృష్టి వైపరీత్యాలు అన్నమాట (Freaks)

అంగవైకల్యం

గ్రుడ్డి, కుంటి మున్నగువారి బిడ్డలు వికలాంగులుగా ఉంటారా ?

తలిదండ్రులలో కన్పించే అంగవైకల్యము బిడ్డలలో కన్పించదు ఒక శాస్త్రవేత్త తోకలు కోసివేసిన ఎలుకలతో పరిశోధనలు చేశాడు తోకలు తెగకొట్టబడిన తల్లి ఎలుక, తండ్రి ఎలుకలకు, చక్కని తోకలుగల ఎలుకలే పుట్టాయి కనుక కుంటివానికి కుంటి పిల్లలుండరు గ్రుడ్డివారికి గ్రుడ్డిపిల్లలుండరు

"మెల్లకన్ను" కొన్ని కుటుంబాలలో కన్పిస్తుంది ఇది ఎందువల్లనంటే కంటి ఆకారమును బిడ్డలు తలిదండ్రులనుండి పొందుతారు కంటి ఆకారమువలన వచ్చే మెల్ల తదితర దృష్టి లోపాలు ఈ ఆకారము వలననే వస్తాయి. అట్లే నేలకు పూర్తిగా ఆనే పాదాలు (Flat foot) తలిదండ్రులనుండి వస్తాయి అంతేకాని అంగహీనత తలిదండ్రులనుండి బిడ్డలకు రాదు. తలిదండ్రుల ముఖము స్ఫోటకపు మచ్చలతో వికృతంగా వున్నా బిడ్డ ముఖము అతి సున్నితంగా ఉంటుంది -

గజదొంగబిడ్డ గజదొంగ అవుతాడా ?

ఉండనే ఉండదు ఒకవేళ తండ్రిదగ్గర చిన్నతనమునుండి పెరిగితే తండ్రిని చూచి అనుకరించి దొంగకావచ్చు. అయితే పుట్టిన వెంటనే మంచి క్రమశిక్షణఉన్న వాతావరణములో పెరిగితే, బిడ్డలో ఈ గుణము కన్పించనే కన్పించదు మన ప్రవర్తనమనకు తలిదండ్రులనుండి సంక్రమించదు మన శీలానికి మనమే బాధ్యులము. తలిదండ్రుల ప్రవర్తనను ఒకవేళ మనకు తెలిసి, తెలియక మనము అనుకరించవచ్చును

మా నాన్నగారు కోపదారి నేను మా నాన్నగారి వంటిదానని మా అమ్మగారు అంటూంటారు నిజమేనా?

కోపము, భయము, పిరికితనము, కలహప్రియత్వము అందరి మానవులలో స్వభావసిద్ధంగా ఉంటాయి ఇది మనచుట్టు ఉండే పరిసరములలోని పరిస్థితుల ప్రేరణవల్ల ఉద్భృతమై కొన్నిసార్లు ఎక్కువగా కన్పించవచ్చు అంతేగాని ఇవి మనకు తలిదండ్రుల నుండి వచ్చే లక్షణాలుకావు కొన్నిసార్లు మనము మనకు తెలియకుండా మనకు కోపము వచ్చినప్పుడు, కోపంలో ఉన్న మన తండ్రిలా మాట్లాడవచ్చు ఇది అనుకరణమాత్రమే—శాంత స్వభావులైన తలిదండ్రులకు తుంటరులు బిడ్డలుగా ఉండడము చూడడము లేదూ?

మా బంధువుల ఇంట్లో అందరూ ఎర్రనివారే అసలు నలుపు వారికుటుంబాల్లో లేదు మరి మొన్న వారికి ఒక నల్లనిశిశువు జన్మించింది కారణం?

వారి తాత, ముత్తాతలలో కూడ ఎవ్వరూ నల్లనివారులేరా? లేకపోతే ఇది విపరీతపరిస్థితిగా తలంచవచ్చును సృష్టిలో కొన్నిసార్లు ఇలా జరగడము సాధ్యమే

అమ్మాయా? అబ్బాయా?

పుట్టబోయే బిడ్డ ఆడపిల్లా మగబిడ్డా అని ఎలా నిర్ణయమౌతుంది? బిడ్డ పుట్టకముందే ఏ బిడ్డ పుట్టుతుందో చెప్పడానికి సాధ్యమా?

పుట్టబోయే బిడ్డ "ఆడ" లేక "మగ" అని నిర్ణయించేది పురుషబీజమే. పురుషునిలో ఉత్పత్తిఅయ్యే బీజాలన్నీ రెండురకాలు. (1) X బీజాలు (2) Y బీజాలు అనుకొందాము ఇవి సమానముగా ఉత్పత్తి అవుతాయి తల్లి అండము ఎప్పుడూ ఒకేరకముగా ఉంటుంది అంటే ఎప్పుడు X అన్నమాట

X తల్లి అండము + X పురుషబీజము = ఆడపిల్ల

X తల్లి అండము + Y పురుషబీజము = మగబిడ్డ

తల్లి అండముతో X పురుషబీజము, కలసితే ఆడపిల్ల, రెండవ రకము, అంటే Y బీజము కలసితే మగబిడ్డ కలుగుతారు

ఈ రెండు రకాల్లో ఏది తల్లిఅండముతో కలుస్తుందో ఎవరూ చెప్పలేరు ఏ బిడ్డ పుట్టబోయేది మొదటే సృష్టి నిర్ణయిస్తుంది. దీనిలో తలిదండ్రుల ఇష్టము లేదు.

పుట్టబోయే బిడ్డ ఏ బిడ్డ? అని కొన్ని పరిశోధనలవలన తెలుపవచ్చునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు ఏ బిడ్డ కలుగునో చెప్పగలిగే పరిశోధనలు విదేశాల్లో విరివిగా జరుగుతున్నాయి ★



చీరె అంచులకు డిజైన్‌లు—ఇ నిర్మల.

సౌందర్యపోషణ

పొడుగాటి నల్లని కురులు, నున్నని చర్మం కలిగించి దేహసౌందర్యాన్ని పెంపొందించే పోషకపదార్థాలు చాలా కూరల్లో ఉన్నాయి

కందను తరచు తింటూంటే దేహస్థౌల్యం తగ్గుతుంది. క్రమంగా సన్నబడతాము. కారట్ దుంప (ఎర్రముల్లంగి) దంతాల ఆరోగ్యమును, చర్మానికి మంచి రంగును, ముఖవర్చస్సును పెంపొందిస్తుంది.

పాశ్చాత్యదేశాల్లో సినిమాతారలు స్థూలదేహములు తగ్గుటకు కారట్ దుంపలను విస్తారంగా వాడుతారు ఆరబ్బు స్త్రీలు ఉల్లిపాయల్ని విస్తారంగా తినడంచేత వారి చర్మం సున్నితంగాను, సుందరంగాను ఉండేది పసుపు సంగతి మనకు తెలిసిందేగా చర్మానికి కాంతినిచ్చి నూగువెంట్రుకలు మొలవకుండా జేస్తుంది వెల్లుల్లిపాయల రసం పూస్తూవుంటే వెంట్రుకలు నెరియవు వెల్లుల్లిపాయల పొప్పర కాల్చిన మసిలో ఆలివ్ నూనె కలిపి రంగరించి తలకురాస్తే శిరోజాలు ఎదుగుతాయి మెలికలు తిరుగుతాయి

ముఖ సౌందర్యం

సౌందర్యపోషణలో నిమ్మకాయ అత్యంత ఉపయోగకారి. పూర్వీకులకు, ఈనాటి టాయ్‌లెట్ సామానులు తెలియవు కాని వారు సహజవస్తువులపై ఆధారపడేవారు. కృత్రిమంగా తయారు చేయడమంటేనే అనేక చెడుపదార్థాలతో తయారు చేయబడిన వస్తువులు మిళితమౌతుంటాయి. అందువలన మనం సహజములైన ఔషధాలు శాకాలూ ఉపయోగించుకొనుట కలవాటు పడితే నష్టము కలుగకపోగా అనేక సత్ఫలితములను పొందుతాము ఆధునిక టాయ్‌లెట్ సామానులు సామాన్యులకు అందుబాటులో లేవు చాల ఖరీదు అందరికీ అందుబాటులోగల మన దేశీయపద్ధతులను కొన్నిటిని పరిశీలించుదాం

తేయాకు నీరు చర్మానికి మృదుత్వమును కలుగజేయును. బాగా శ్రమపడి అలసిపోయి వచ్చినపుడు చల్లని తేనీరు ముఖముపై చల్లుకుంటే ఎంతో ఉపశాంతినిస్తుంది చర్మాన్ని పరిశుభ్రంచేసి నునుపుతనం యిచ్చువానిలో పాలు ఒకటి. దూది, పాలలో పూర్తిగాముంచి ముఖముపై రుద్దవలయును. ఆలివ్ నూనె చర్మముపై మర్దించితే మంటలు, చర్మము పగులుట తగ్గి శరీరమును నును పెక్కుతుంది.

ఓట్ ధాన్యపు పిండికూడా మంచిదే. ఇది చర్మ పరిశుభ్రతకు బాగుగా ఉపయోగించును ఓట్ పిండికి నిమ్మరసంచేర్చి ముఖము, మెడపైభాగము, రెండునిమిషములు రుద్ది ముందు వేడినీటితో తరువాత చన్నీటితో కడుగవలెను

దోసకాయతో

దోసకాయ చర్మ రంధ్రములను వికసింపజేయును. దోసకాయ శుభ్రంగా కడిగి పల్చని ముక్కలుగా తరుగాలి. వెల్లకిల పరుండి ముఖముపై దోసకాయ ముక్కలను 15 నిమిషములవరకు ఉంచాలి. తరువాత దానిని కడిగివేయరాదు. పరిశుభ్రమైన దూదిముద్దతో ముఖమును రుద్దాలి మూడు, నాల్గు నిమిషములు అలా చేసిన తరువాత చర్మమునకు మంచి కాంతి, రక్తము వచ్చిచేరును తరువాత పెరుగుతో ముఖమును కడిగివేయాలి

చంద్ర భారతి

గ్రుడ్డులోని పచ్చసొన శరీరముపైని ముడుతలను పోగొట్టి ధృఢపరచును పచ్చసొనను, ముఖముపై రుద్ది 15 నిమిషములు ఉంచాలి. తరువాత వేడినీటిలో గుడ్డముంచి ముఖమును శుభ్రపరచవలెను

దీనిలో వేరొక విధానము పచ్చ సొనలో రెండు స్పూనులు ఆలివ్ నూనె, కొద్దిగా నిమ్మరసం కలిపినా మంచి ఫలితం లభిస్తుంది

బాగుగాపండిన అరటికాయ గుజ్జుకూడా సౌందర్య పోషకమే అరటి గుజ్జును ఉపయోగించితే శరీరముపైని ముడుతలు మచ్చలు హరించిపోతాయి. శరీరం నాజూకై ప్రకాశిస్తుంది

ఒక చిన్నకప్పులో నీళ్ళుపోసి దానిలో మనకళ్లు తెరచి శుభ్రపరుస్తూఉండాలి ఇలా రోజుకు రెండుమూడు పార్లు కళ్లకుస్నానం చేయిస్తే మంచిది.

తేనీటిలో నానిన గుడ్డను కళ్లుమూసి రెప్పలపై ఒక పావుగంటసేపు వుంచితే రెప్పలు ప్రకాశించును రోజూ పడుకుండబోవునపుడు ఆలివ్ నూనె కనుబొమలకు రాస్తే అవి మృదువుగాను, దట్టముగాను, పొడవుగాను పెరిగి ప్రకాశించుచుండును

ఉప్పు, సోడానీ శుభ్రపరచి, పళ్లపై గల మచ్చలను రూపుమాపుతుంది ఒకగ్లాసు నిమ్మరసం, ఉప్పు కలపి వాడితే పండ్లు, నోరు పూర్తిగా శుభ్రం అవుతాయి, అభ్యంగన స్నానాంతరము వెంటనే నిమ్మకాయవాడితే అది మిగిలిన మురికిని పోగొట్టుటయేగాక, వెంట్రుకలను ప్రకాశింప జేయును

వంటగదిలో పనిజేసే వారి చేతులు మురికిపట్టి ఉంటాయి నిమ్మకాయరసం ఆ మురికిని తేలికగా పోగొట్టగల్గుతుంది పైత్యమున్నవారు రోజూ ప్రొద్దున నిమ్మకాయ రసము వేడినీటిలో కలిపి త్రాగితే మంచిది గ్లిసరన్ నిమ్మకాయ రసం సమపాళ్లలో కల్పితే చక్కని లోషన్ తయారవుతుంది గ్లిసరన్, నిమ్మరసం, అత్తరు కలిపివాడితే వెంట్రుకలు మెలికలు తిరుగుతాయి

వారానికొకసారి పెరుగుతో తలంటుకుంటే వెంట్రుకలు మెత్తపడి ఎటువైపుకు పడితే అటువైపుకు తేలికగా తిరుగుతాయి గోళ్లు ఊడిపోవుట, పెళుసెక్కి విరిగిపోవుట సంభవించిన ఒక నెలరోజులపాటు రోజూ వెచ్చని ఆలివ్ నూనెలో 10 నిమిషములు ఉంచితే మంచి ఫలితము వస్తుంది. అవకాశం వున్నంతలో ప్రకృతి ద్వారా లభించే సహజమైన పదార్థాలను యథాతథంగా ఉపయోగించుకుంటే మన సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసుకోవచ్చు ★

ఒరిస్సా వంటకాలు

[31 వ పేజీ తరువాయి]

డం తీసుకొని కూర అందులోపెట్ట అం మడత ఇంకోమడత మడవాలి కొద్దిగా నెయ్యిరాసి మూడవమడత, ఇంకొంచెం ఎక్కువరాసి నాలుగవ మడత మడుచుకోవాలి అంటే ఇది నూనెలో వేసినా మడత విడిపోకూడదు

పొయ్యిమీద బాణీపెట్టి ఇది అందులో వేసి కాస్త వేగినతరువాత తీసేసుకుంటూ ఉండాలి

పూరీలకీ సింగడాలకీ చాలాదగిర సంబంధం వుంది మనకి కారం ఉప్పు కావాలనుకుంటే కూరలోనే వేసుకోవాలి ఇది చేసేటప్పుడు అప్పడాన్ని మడవటంలో నేవుంది దీని మజాఅంతా, అటూ ఇటూ పొంగితే చూడటానికి ఎలావుంటుందోమరి ఆలోచించండి దీని రుచి అంతా కూరలో నే వుంటుంది. ★

★ ఉత్తరాలు ★

"మనస్సుకు నచ్చినట్టు"

కుమారి వి. సత్యవతిగారు వనితాలోకం శీర్షికలో వ్రాసిన "మనస్సుకు నచ్చినట్టు" అనే వ్యాసం చాలా బాగుంది నేను వారితో పూర్తిగా ఏకీభవిస్తాను సత్యవతి గారు వనితలయొక్క నడతలను, పిల్లల పెంపక విషయంలోను జరిగే కార్యములు మనస్సులో పెట్టుకొని చాలా చక్కగా వ్రాశారు "మొక్కై వంగనిది మానై వంగునా" అనే సామెత మన తెలుగు సాంప్రదాయములో వుండనేవుంది బాల్యము నుండి పిల్లలను తల్లిదండ్రులు వారిపిల్లలను అదుపులోకి పెట్టుకొని పెంచిన, వారికి జ్ఞానం వచ్చినతరువాత స్వతంత్ర ఆలోచనా శక్తి కలుగుతుంది.

బేరం చెయ్యడం ఒక నేర్పు" అనే వ్యాసం రాసిన పవనినిర్మల ప్రభావతిగార్కి నా కృతజ్ఞత స్త్రీలయొక్క స్వభావాలను చక్కగా వివరించి వ్రాశారు

స్త్రీ స్వభావసిద్ధంగా ఎటువంటి గృహ కార్యాలయినసరే లేక తదితర కార్యాలు అయినసరే ఆలోచన చెయ్యకుండా ఏ కార్యము చక్కబరచరాదు యీమధ్య మా పిన్ని ప్రక్కింటివారుకల్సి బజారుకెళ్ళారు, మాపిన్ని ఒక కొట్లోకివెళ్లి మైసూరు సిల్కు చీర కొంది. వేరేకొట్లోకి మా ప్రక్కింటి వారు వెళ్ళి మైసూరు సిల్కుచీరకొన్నారు మాపిన్ని బేరమాడి 25 రూ కొంటే మా ప్రక్కింటివారు అదే చీరను 35 రూ కొన్నారు. ఒకవస్తువుదగ్గరే 10 రూ. తేడా వస్తేయిక చూసుకోండి యెన్ని వస్తువుల దగ్గర ఎంతడబ్బు నష్టపడతామో కాబట్టి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి వస్తువు నాణ్యతబట్టి బేరమాడాలి లేకపోతే మనమే మోసపోతాము

గంటి రోహిణీదేవి, (విజయనగరం.)

* * *

వింత అలవాట్లు

మే 22 వ తేదీ పత్రిక వనితాలోక శీర్షికలోని 'వింతఅలవాట్లు, అనే వ్యాసం రాసిన శ్రీమతి బి. ప్రేమలీలగారు అభినందనీయులు. వింత అలవాట్లంటే నాకు ఒక సంఘటన గుర్తుకొచ్చింది. నాకు తెలిసిన ఒకమ్మాయికి ఏది చూచినా పగలబడి నవ్వుట ఒక అలవాటుగా ఉండేది. కాని ఆమె మనస్సు వెన్నపూస. ఆసంగతి అందరికి తెలియదుగా ఆమె, మరొక ఆమె చాలా స్నేహంగా ఉండేవారు కొద్ది రోజులకు ఈ రెండవ వ్యక్తికి వివాహము అయింది. ఆమె,ఆమెభర్తా ఈస్నేహితురాలింటికివచ్చే సరికి వారినిచూచి ఈమె ఫకాలున నవ్విందిట. అంతే ఆరోజు మొదలుయిప్పటి వరకూ వారు మాట్లాడుకోరు.

యం. వి. ఆర్ రోజా విజయనగరం

వాదాలు, బేరాలు

(29-5-57) పత్రికలో "నేను చెప్పేది అంటూ జి వరలక్ష్మిగార్లు (విజయనగరం) వ్రాసినదానితో ఏకీభవిస్తూన్నాను. విమర్శలు చేసే సోదరీమణులు యెవరికి తెలిసిన క్రొత్తవిషయాలు వారు తెలియజేస్తూ తెలియనివారికి సహాయం చెయ్యడం వుత్తమం.

బేరాల విషయంలో ఎన్. సూర్యాబాయి గారు (తిరుపతి) వ్రాసినది అక్షరాల నిజం వీధిలో తిరిగి అమ్మేవారు పదిరూపాయలకు యిచ్చిన చీర కొట్లో 15, 18 చెప్పేరు మాకు వకసారి 20 రూపాయలు చెప్పిన చీర ఎనిమిదిన్నరకు యిచ్చాడు. 30 చెప్పిన చీర 12 కిచ్చాడు యింత తేడాతో చెప్తేగాని ఆడవాళ్ళబేరం కుదరదని వాళ్లకు తెల్సు. వాళ్ళు యెండలో తిరిగి అమ్మడం యెందుకు యేమైనా లాభమొస్తుంద నేకదా కొనేవారు కూడ ఆలోచించాలి

ఎ. కృష్ణవేణి (పాలకొల్లు)

"ఎన్నో 'క్లాసులో' ?"

"మనం చదువుకునేది కేవలం డబ్బు కోసమేకాదు, జ్ఞానంకోసం అని గ్రహించిననాడే మనదేశంలో చదువుకునే ఆడవాళ్ళసంఖ్య పెరుగుతుంది" అని శ్రీమతి సి. నిర్మలగారు వ్రాశారు.

అసలు జ్ఞానమంటే ఏమిటి ?

ఈ నాటి చదువులలో జ్ఞానంలభిస్తున్నదా?

లభించేట్లయితే ఏక్లాసువరకు చదివితే జ్ఞానం లభిస్తుంది ?

జ్ఞానం లభించేంతవరకు చదవగల అవకాశాలు సామాన్య స్త్రీలకు కూడా కలవా?

అలాటి అవకాశాలు సామాన్యస్త్రీలకు లేనట్లయితే చదువుకునే స్త్రీలసంఖ్య మన దేశంలో ఎలా పెరుగుతుంది ?

జి. సక్కుబాయి (ఏలూరు)

శోచనీయం

చాలామంది మహిళలు తమ తమ కష్టసుఖాలు ఈ పత్రికద్వారా ఒకరి కొకరు తెల్పుకుంటున్నారు ఇందువల్ల వారికి కొంచెం మనశ్శాంతి కలుగుతుంది. తమ, తమ తప్పిదాలు పత్రికలో చదివి కనీసం కొంత మంది మగవారైనా తమ లోపాలను పొరపాట్లను గుర్తించుకోవచ్చు ఇన్ని ఉపయోగాలున్న ఈ వనితాలోకం శీర్షికే పుట్టి చెత్త అవడం చాలా శోచనీయం.

కె విమలకుమారి (పెడన)

మాకేం! కావలిస్తే...

(27-వ పేజీ తరువాయి)

బడిన జాతుల పురోభివృద్ధి కార్యక్రమాలలోనూ, మతంతో నిమిత్తం లేకుండా అన్ని కులాలవారికి ప్రవేశం ఉండగల క్లబ్‌లు, హాస్టల్సు మున్నగు వాటిని స్థాపించడంలోనూ సహకార సంఘాలు, ఖద్దరు, గ్రామీణ పరిశ్రమలు, బేసిక్ విద్యాలయాలు, స్థాపించడంలోనూ సాంఘిక విద్యా ప్రచారంలోనూ ఇటుపై చాలా కృషిచేస్తారట ఇన్ని విధాల మన ప్రభుత్వం మధ్య తరగతి కుటుంబాలకి ఇతరజాతుల వారికి అందుబాటులో ఉండి బ్రతుకు తెరువు చూపిస్తున్నప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవడం అందరి విధి ఇలాంటి వాటి మీద ఆసక్తి ఉన్ననాడే ఈ సంఘాలూ, సంస్థలూ అభివృద్ధిలోకి వస్తాయి

గమనిక

'పూలమొక్కలూ కూరగాయలూ' జూన్ (12 వ తేదీ పత్రిక)అను వ్యాసంలో పూలవిత్తనాల కంపెనీ చిరునామా. సటన్ అండ్ కంపెనీ, 13 రసెల్ స్ట్రీట్, కలకత్తా అని చదువుకోవలెను ★

సమానత్వ సాధన

"ఒరేయ్! జామపండ్లు దొరగా ముగ్గాయిరా!" అని నోరూరుతూ జామచెట్టువేపు ఆశగాచూశాడు మధు మోహన్ తలెత్తిచూసి "అవున్రోయ్" అన్నాడు సంబరపడుతూ. సంధ్య మధుప్రక్కనే నడుస్తున్నది.

"పద, పదా! చెట్టెక్కి కావల్సినన్ని కోసుకు తిందాం భయమేమిటి?" అంటూ మోహన్ ఉత్సాహంగా మధుచెయ్యి పట్టుకుని లాగాడు

మధు జంకుతూ "మీఅమ్మ ఇంట్లోనే వుందికదరా!" అంటూ బిత్తరి చూపులు చూశాడు

"అవున్రా అన్నయ్యా! అమ్మ చూస్తే కోప్పడుతుంది" అంది సంధ్య వంటింటివేపు చూపుపోనిస్తూ

"పోవే సంధ్యా-నువ్వు వర్తి పిరికిదానివి నీకుదగ్గ పిరికివాడు మధు!" అని మోహన్ ఇద్దర్నీ చూసి ఈసడిస్తూ నవ్వి "దేనికైనా గుండెనిబ్బరం వుండాల్రా" అంటూ గబగబా చెట్టెక్కేశాడు

"అరె-అదేమిటి సంధ్యా నువ్వెక్కుతున్నావ్! ఆడపిల్లవు-నువ్వెక్కొచ్చా? తప్పు! తప్పు! దిగు! దిగు!" అన్నాడు కంగారుగా మధు చెట్టెక్కబోతున్న సంధ్యకేసి ఆశ్చర్యపోయి చూస్తూ

సంధ్య మధుకేసి తీక్షణంగా కోపంతో చూసింది

"ఏం? ఆడపిల్లయినంత మాత్రాన ఎందుకెక్కకూడదు? ఆడపిల్లట-ఆడపిల్ల! నువ్వెక్కితే లేనితప్పు నేనెక్కితే ఎందుకొచ్చింది? స్త్రీలూ, పురుషులూ సమానమేనట తెలుసా?" అంటూ తండ్రిమాటలు గబగబా వల్లించేసింది సంధ్య చెట్టుకొమ్మమీద జాగ్రత్తగా కూర్చుంటూ

మధు గుడ్లు మిటకరించి చూశాడు

"అవున్రా మధూ! నీకేం తెలుసు? స్త్రీ పురుషులిద్దరూ సమానమేనట - నాన్నగారు చెప్పారు దేనికీ ఆడా, మొగా తేడా లెంచకూడదట మనం ఏ పని చేస్తే సంధ్యా ఆ పనే చెయొచ్చు-చేసి తీరాలి - చేసి తీరుతుంది" అంటూ పార్లపాళ్లు వస్తున్న అర్థం కాని ఆవేశంతో మాట్లాడాడు మోహన్ ముద్దుముద్దు జామపండు కొరుక్కుతింటూ

సంధ్య జామపండు తినటం ఆపి కొద్దిగా ముందుకు వంగింది. •

"అవునన్నయ్యా చేసేతీరుతాను!" అంది సంధ్య గట్టిగా నొక్కి పలుకుతూ

మధు బుర్రగోక్కున్నాడు

"ఏమిటోరా నాకంతా గొడవగా వుంది. స్త్రీలు, పురుషులు సమానంఅంటే ఏమిటి?" అని అడిగాడు మధు అయోమయంగా చూస్తూ

"అంటే మరేంలేదురా - దేనికీ ఆడా, మొగా తేడా లెంచకూడదు ఆడవాళ్ళు చేసేపని మనం చెయ్యాలి, మనం చేసే పని ఆడవాళ్ళు చెయ్యాలి అంతేరా అది" అని బోధపరిచాడు మోహన్ మధు భుజం తట్టుతూ

మధు తల పంకించాడు.

"ఇన్నాళ్ళు ఆడవాళ్లను మొగవాళ్ళు అణిచేసి వుంచారట వాళ్లని ఎన్నో కష్టాలు పెట్టారట ఎంతో నీచంగా దాసీలా చూశారట. ఎంతసేపూ కాళ్లూ చేతులూ కట్టిపడేసి

మందరపు పద్మలలిత

వంటింట్లోనే కూర్చోబెట్టేవారట నిజానికి ఇద్దరూ సమానులేనట"

సంధ్య చెవులు రిక్కించి వింటున్నది మధుకు అంతా గందరగోళంగా వుంది మోహన్ ఏదో చెప్పబోతున్నాడు

"మరి - మీ ఇంట్లో వంటంతా ఎవరు చేస్తార్రా?" హఠాత్తుగా వంటింటివేపు చూస్తూ మెల్లగా అడిగాడు మధు

మోహన్ నిర్ఘాంతపోయి చూశాడు

"హు! ఇంతసేపు చెప్పినదంతా బట్టి బూడిదలోపోసిన పన్నీరు! ఇవతల నేనేమో నీకు కొత్తకొత్త విషయాలు బోధపరుస్తూంటే అవతల నీ ఆలోచనంతా 'వంట' మీదా? ఖర్మ!" అని నిట్టూరుస్తూ మధును మెల్లగా గదమాయించాడు మోహన్

"అది కాదురా-మీనాన్న చేస్తాడేమో తెలుసుకుందామని?" అని బిక్కముఖంతో చూశాడు మధు మోహన్ వైపు

మోహన్ త్రుళ్ళిపడి చూశాడు

"నీకు మతిగాని పోయిందేమిటిరా? మొగవాళ్లెక్కడన్నా వంటచేస్తార్రా? అమ్మ వంటచేస్తుంది - నాన్న ఉద్యోగం చేస్తాడు అంతేగాని నాన్న-నాన్న వంట చేస్తాడూ?" అని కోపంతో చూశాడు మధువైపు

"ఇందాక నేకదరా ఆడవాళ్లు చేసేపని మొగవాళ్లు, మొగవాళ్లు చేసేపని ఆడవాళ్లు చెయ్యాలని చెప్పావు" అన్నాడు మధు తల గోక్కుంటూ మధుకు సరిగ్గా అక్కడే అర్థం కావటం లేదు

మోహన్ గతుక్కుమని చూశాడు.

"అవును సుమా! నాకీసంగతి తట్టనే లేదు! ఏమే, సంధ్యా?" అని సంధ్యకేసి ప్రశ్నార్థకంగా చూశాడు మోహన్.

సంధ్య నిర్లక్ష్యంగా చూస్తూ "అదేమో లేరా-నాన్నను కనుక్కుందాంలే ఆనక" అంది ధీమాగా

మధు హఠాత్తుగా, కంగారుగా చెట్టుదిగి పరుగెత్తి పారిపోయాడు

"ఒసేయ్ సంధ్యా! సంధ్యా! ఏం చేస్తున్నావే ఆసినీ! ముందు చెట్టు దిగుతావా, లేదా?" అంటూ అప్పుడే ఇవతలకొచ్చిన తల్లి దూరాన్నుంచే కోపంతో గట్టిగా గదమాయించింది చెట్టెక్కి కూర్చున్న సంధ్యను నిర్ఘాంతపోయి చూస్తూ

సంధ్య మెల్లిగా క్రిందకు దిగింది.

సంధ్యతల్లి నోరు నొక్కుకుంటూ "అవ్వ! ఇదేమిటే ఈ రౌడీ వేషాలు? ఆడపిల్లవు కూడానూ! క్రిందపడి కాలు విరిగి లేనో-కుంటిదానివై మూల కూర్చుంటే ఎవడైనా పెళ్ళిచేసుకుంటాడటే? ఎంత అప్రదిష్ట! ఎంతఅప్రదిష్ట" అంది పట్టరాని ఆగ్రహం వెళ్లగ్రక్కుతూ

చెట్టుమీదవున్న మోహన్‌కు కోపం వచ్చింది

"దానికాలు విరక్కూడదు నాకాలిరిగినా ఫర్వాలేదు!" నేను కుంటోడినై పెళ్లకుండా కూర్చున్నా ఫర్వాలేదు!" అంటూ బుంగమూతి పెట్టాడు మోహన్

తల్లి పరకాయించి చూసి "అరిసీ! నువ్వూ అక్కడే వున్నావటరా? ముందు దిగుతావా, లేదా?" అని అదలిస్తూ గబగబా చెట్టుదగ్గరి కెళ్ళింది.

కిమ్మనకుండా క్రిందకుదిగిన మోహన్ చెవి నులిపి "ఇంకెప్పుడన్నా ఎక్కావంటే చూడు" అని గుడ్లెర్రచేసి హుంకరించి తల్లి సంధ్యకేసి తిరిగింది

"వాడెక్కాడని నువ్వూ ఎక్కుతావటే, బుద్ధీ జ్ఞానం వుండనక్కర్లేదూ? ఆడపిల్లవు అణిగి మణిగి వుండక వాడు గట్టెక్కితే గట్టు? ప్రహరెక్కితే పుట్ట ఎక్కుతావూ? వాడితో నంతా నీకు?" అంటూ పట్టరాని ఆగ్రహంతో సంధ్యను దబదబా బాదింది తల్లి.

సంధ్య బావురుమని ఏడుస్తూ "చూడు నాన్నా! అమ్మ ఎలా కొట్టిందో!" అంటూ అప్పుడే ఆఫీసునుంచి వచ్చి కాళ్ళూ చేతులూ, కడుక్కోవటానికి పెరట్లోకి వస్తున్న తండ్రి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళి మీదపడింది

తండ్రి సంధ్యను గోముగా బుజ్జగిస్తూ పెళ్ళాంకేసి తీక్షణంగా చూశాడు కోపంతో.

సంధ్యతల్లి మూతీ, ముక్కూ వంకరగా తిప్పింది.

"అదేలాటిపని చేసిందో అడగరేం? చెట్టెక్కి కూర్చున్నదండీ చెట్టు పెళ్ళీడు కొస్తున్న పిల్ల ఇలా రౌడీవేషాలు వేస్తుంటే.

మాట మధ్యలోనే సంధ్య తండ్రి కోపంతో భీకరంగా గర్జించాడు.

"చాల్చాల్లే! బొత్తిగా సంస్కారంలేని మనిషివి పడ్డావు నా పాలిట పదేళ్లు ఇంకా నిండనైనా నిండలేదు. అప్పుడే పెళ్ళిట! పెళ్ళి! ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కదు." ఆ తర్వాత మాటపెగలక కోపంగా చూస్తూ ఊరుకున్నాడు.

సంధ్య వెక్కి వెక్కి ఏడుస్తూ "చూడు, నాన్నా! అమ్మనన్నుకొట్టింది అన్నయ్యను కొటలేదు. అన్నయ్య ఎక్కువేంటి నా తక్కువేంటి?" అంది అమాయకంగా, మూతి ముడుచుకుని

తండ్రికి బుంగమూతి పెట్టు కూర్చున్న సంధ్యను చూసేసరికి నవ్వాగలేదు

ప్రేమతో సంధ్యబుగ్గ చిదిమి ముద్దుపెట్టుకుంటూ అన్నాడు "అవునమ్మా అవును నీఅంత తెలివైందికాదు మీఅమ్మ ఆ ఎక్కువ తక్కువలేవీ మీఅమ్మకు తెలియవు అయితే మాత్రం? చెట్లు ఎవరెక్కినా తప్పే! ప్రమాదమే! మోహనూ ఎక్కకూడదూ, నువ్వూ ఎక్కకూడదు చటుక్కున కాలుజారి క్రిందపడితే " మాటలమధ్యలోనే వీధిలోకి పరిగెత్తుకుపోయిన పిల్లల్ని ప్రేమానురాగాలతో ఒకసారిచూసి పెళ్లాంవేపు తిరిగాడు

"ఇంకెప్పుడూ వాళ్ళనలా కొట్టకు మెల్లిగా మాటలతో చెప్పితే వాళ్ళకే తెలుస్తుంది ముఖ్యంగా నువ్వు సంధ్యను పల్లెత్తు మాట అన్నా నేను సహించలేను సంధ్యని నా ఆశయాలకు ప్రతిబింబంలా తీర్చిదిద్దుకుంటాను ఉన్నతాభిరుచులతో, ఉత్తమాశయాలతో సంధ్యకు ఉత్తమసంస్కారం, విశాలదృక్పథం అలవడచేసి సంధ్యను మహిళాలోకానికి తలమానికంగా తయారుచేస్తాను సంధ్యకు మహిళామండలిలో సర్వోత్కృష్టమయిన స్థానాన్ని సంపాదించి పెట్తాను."

కళ్లు మూసుకుని ఆవేశంతో కవిత్వాలు పలుకుతున్న భర్తనుచూచి నిట్టూరుస్తూ, "బాగుంది!" అని మాత్రం అనగలిగింది సంధ్యతల్లి

సంధ్య తండ్రి అభ్యుదయభావాలు, సంస్కారంకల వ్యక్తి ముఖ్యంగా బానిసత్వంలో క్రుగ్గి మలమల మాడిపోయిన నారీలోకం మీద ఆయనకు అత్యంత సానుభూతి, తగని గౌరవం స్వాతంత్ర్యం, సమానత్వం, స్వేచ్ఛఇత్యాది విషయాల్లో సంధ్యకు, మోహన్‌కు ఈచిన్నతనంలో నుంచే తగిన పునాదులు వేయసాగాడు తండ్రి మొత్తానికి వాళ్ళిద్దర్నీ తన ఆశయాల కనుగుణంగా పెంచుకొస్తున్నాడు

సంధ్య పదేళ్ళది మోహన్ పన్నెండేళ్ళవాడు. సమానత్వ స్వాతంత్ర్యాలగురించి ఆలోచించగల శక్తిగాని, ఆసక్తిగాని వాళ్లకు లేనేలేదు. కనీసం తండ్రిబోధలు అవగాహన చేసుకుని జీర్ణంచేసుకోగల శక్తి సామర్థ్యం కూడా వాళ్ళలో లేదు ఒక్కమాటలో చెప్పాలంటే తండ్రిబోధనలతాలూకు కొన్ని అస్పష్టమైన వాక్యాలు తప్పించి మరేం తెలియదు.

2

రానురాను సంధ్యమనస్సు వికసించటం మొదలుపెట్టింది. తండ్రికృషి వృథాగా పోలేదు రోజులు గడుస్తున్నకొద్దీ సంధ్య తండ్రిచెప్పే విషయాలు కొద్దికొద్దిగా అవగాహన చేసుకోగలుగుతున్నది. పదమూడేళ్ళువచ్చేసరికి సంధ్యకు స్త్రీస్వాతంత్ర్యం గురించి కొన్ని కొన్ని అభిప్రాయాలు ఏర్పడసాగాయి

ఒకరోజు సంధ్య కిటికీలోంచి వూరికినే వీధిలోకి చూస్తూ కూర్చుంది రోడ్డుమీద ఎవరో సైకిల్ తొక్కుకుంటూ పోతున్నారు. సంధ్య ఆసక్తితో చూసింది.

'అలా రోడ్డుమీద పడిపోకుండా సైకిల్ చరచరా ఎలా నడిచిపోతుందో? ఎలా తొక్కుతారో గదా?—గమ్మత్తుగా, గారడీలా కన్పిస్తుంది తనకంటికి తను కూడా సైకిల్ తొక్కితేనో? ఆడవాళ్ళు సైకలెందుకు తొక్కరూ? మొగవాళ్ళకున్న స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఆడవాళ్ళ కెందుకు లేవు? దీని అంతేదో తేలుస్తేగాని తనకు నిద్రపట్టదు

గబగబా మోహన్‌దగ్గరకు పరుగెత్తుకుంటూ పోయి "అన్నయ్యా, అన్నయ్యా! నాకు సైకిల్ నేర్పవా?" అంది

మోహన్ సంధ్యహడావుడి చూసి నవ్వి

★ సమానత్వ సాధన ★

మధుతో మాట్లాడుతున్న వాడల్లా సైకిల్ గది లోంచి తేవటానికి సిద్ధంగా లేచాడు.

"సంధ్యా! సంధ్యా!"

తారగొంతుక విని "ఇప్పుడే వస్తాను మధూ!" అంటూ మధుతో చెప్పి బయటకు వెళ్ళింది సంధ్య.

"రా తారా!" అంటూ సంధ్య తార చేయి పట్టుకుని గబగబా మోహన్ గదిలోకి తీసుకెళ్ళిపోయింది

తార మోహన్, మధును చూసి సిగ్గుపడిపోయి జంకుతూ సంధ్యచేయి విడిపించుకుని ఇవతల కొచ్చేసింది.

సంధ్య పకపకా నవ్వింది అదేమిటి తారా! అలా సిగ్గుపడిపోతావ్! మొగవాళ్ళతో మాట్లాడటానికి ఎందుకు జంకాలి? మాట్లాడితే ఏంతప్పు? అంతా కలిసి, మెలిసి ఫ్రీగా వుండాలిగాని ఎంతసేపూ ఎక్కడి కక్కడ ఆడా, మొగా అని అడ్డుగోడలు కట్టుకుంటూ కూర్చుంటే ఏం బాగుంటుంది? ఎంత అసహ్యంగా వుంటుంది!"

అంతా పెరట్లోకి వచ్చారు

సంధ్య సైకిల్ ఎక్కుతుంటే మోహన్ గట్టిగా పడిపోకుండా పట్టుకున్నాడు

తార తెలబోయి చూసి "హేయ్ సంధ్యా! సైకిల్ తొక్కుతావా మొగాడిలా? అందరూ నవ్వుతారులే" అంటూ వెక్కిరిస్తూ నవ్వింది

"ఏం? ఎందుకు తొక్కకూడదూ? ఏపని చేసినా మొగవాడే చెయ్యాలా? నవ్వితే నవ్వనియ్ నేనెవరినీ లక్ష్యపెట్టను నేను సైకిల్ మీదే రోజూ స్కూలుకొస్తాను. చూస్తాను ఎవరేమంటారో?" అని నిర్లక్ష్యంగా తలెగరేసింది సంధ్య.

సంధ్య సైకిల్ నేర్చుకోవటంచూసి తండ్రి మురిసిపోయాడు. ఆడవాళ్ళ సైకిలొకటి కొనిచ్చాడు.

సంధ్య రోజూ స్కూలుకు సైకిల్ మీదే వెళ్ళుతున్నది. సైకిల్ మీద సంధ్యను చూడగానే రోడ్డుమీది అందరికళ్ళూ అప్రయత్నంగా సంధ్యమీదే పడేవి.

మొదటిరోజు సంధ్య సైకిల్ తో కొత్తగా వీధిలో కన్పించేసరికి కొందరు రౌడీపిల్లలు ఉత్సాహంగా విజిల్ వేస్తూ, వెక్కిరిస్తూ, కేకలేస్తూ సంధ్యకు నానా పేర్లుపెట్ట పిలుస్తూ సైకిల్ కు అడ్డంపడి నిలుచున్నారు సంధ్య గట్టిగా అదలించింది చీదరించుకున్నది, హుంకరించింది. ఎన్ని చేసినా వాళ్ళు లేవరు సంధ్యకు కళ్లంటనీళ్లు తిరగసాగాయి ఇంతలో మధు అటు వెళ్తున్న వాడల్లా గుంపు మధ్య సంధ్యను చూసి చరచరా వచ్చి అందరినీ చెల్లాచెదురుచేసి సంధ్యను స్కూలువరకూ దిగబెట్టి వచ్చాడు కొత్తలో అందరి వింత చూపులు, నానా కౌతుకూతలు అదోలా అనిపించినా కొద్దిరోజు లయ్యేసరికి సంధ్య అంతా అలవాటుచేసుకుంది పాతపడుతున్న కొద్దీ వాళ్ల అల్లరికూడా చాలావరకు తగ్గిపోయింది

చీరలు కట్టుకుంటున్నా సంధ్య సైకిల్ మానలేదు.

తల్లి ఒకసారి గట్టిగా మందలించబోయింది "అదేమిటే-ఇన్నాళ్లు అంటే పోనీ ఏదో చిన్నతనం అనుకుంటే .. ఇప్పటికీ వదలవా?" అని బుగ్గలు నొక్కుకుంది.

సంధ్య కస్సుమంది తండ్రి సంధ్యకు ఆసరా ఇచ్చాడు

సంధ్య కాలేజికికూడా సైకిల్ మీదే వెళ్తున్నది చిన్నతనంలోలాగ 'అల్లరి' పద్దు మణగటంలేదు సరికదా రోజురోజుకూ మితి మీరిపోతున్నది.

సంధ్యను చూసేసరికల్లా "ఓ హో హో! సైకిల్ వాలీ వసుంధరోయ్" అంటూ నానా గోడవ చేసేవారు మొగవాళ్లు అందులో చాలామంది సంధ్య సహవిద్యార్థులుకూడా! సంధ్యకు 'సైకిల్ నారి', 'సైకిల్ భామ' లాంటి పేర్లు ఎన్నెన్నో పెట్టేశారు. కాలేజీలో ఆడపిల్లలంతా సంధ్యను చిత్రంగా చూసి ముసిముసినవ్వులు నవ్వుకునేవారు వెక్కిరింతగా సంధ్యకు ఎవరి లక్ష్యమూ లేదు స్త్రీ సహజమైన సిగ్గూ, భయం మొదలైన లక్షణాలు సంధ్యకు చిన్నతనంలోనే హరించుకుపోయాయి.

సంధ్యది ఒకే లక్ష్యం! స్త్రీకి పురుషుడితో సమానంగా స్వాతంత్ర్య గౌరవాలు సంపాదించిపెట్టేంతవరకూ సంధ్యకు నిద్ర పట్టదు ఎవరేమన్నా తనుఖాతరు చెయ్యదలచుకోలేదు. ఆశయసిద్ధికోసం ఎన్ని అవరోధాలున్నా ప్రతిఘటించాల్సిందే!

3

యూనివర్శిటీ మరీ దూరమైపోవటంచేత సంధ్య యూనివర్సిటీ బస్సులలోనే వెళ్తున్నది

ఒకరోజు సంధ్య బస్సుకోసం నిరీక్షిస్తూ నించుంది. కొంతసేపటికి బస్సువచ్చి ఆగింది.

సంధ్య బస్సులో కాలుపెట్టి స్థలంకోసం దిక్కులు చూస్తున్నది ఎక్కడా ఖాళీ లేదు అమ్మాయిలు కూర్చునేసీటులో సూది మొన మోపటానికికూడా సందులేదు. సంధ్య కదలిపోతున్న బస్సులో పడిపోకుండా దగ్గరలోని సీటు అంచును గట్టిగా పట్టుకుని నిలబడింది రోజూ ఇదేవరస అని విసుక్కుంది సంధ్య

ఎదురుగా వున్న చిన్న సీటులోని అబ్బాయి సంధ్యపై పాకసారి నిర్లక్ష్యంగా చూసి మరి కాస్త దిట్టంగా కూర్చున్నాడు.

"లేవయ్యా లే, ఆడపిల్ల నిలుచుంటే అలా చూస్తూ వూరుకుంటావేం? ఎక్కడో సర్దుకుని ఆ పిల్లకు జాగా ఇచ్చెయ్యి" అని ఒకరిద్దరు చిన్నగా మందలించేసరికి ఆ అబ్బాయి తలెగరేస్తూ "ఎందుకు లేవాలండీ? ఆడవాళ్ళకంటె రెట్టింపుఛార్జి ఇచ్చుకుంటున్నాం అంతడబ్బు పోసుకునికూడా శుభ్రంగా, విశాలంగా కూర్చోవటానికి మాకధికారం లేదా?" అన్నాడు నిబ్బరంగా పెల్లుబుకుతున్న రోషంతో

"చాల్చాలేవయ్యా. అంత బుద్ధి లేకుండా మాట్లాడతావేం? అవతల ఆడపిల్ల అలా ఇబ్బందిపడుతూ నించుంటే? లే, లే" అంటూ పదిమందీ గట్టిగా చీవాట్లు వేసేసరికి ఆ అబ్బాయి కాస్త చిన్నబుచ్చుకుంటూ, కోపంగా ఇంకో సీట్లోకి పోయి సణుక్కుంటూ కూర్చున్నాడు.

సంధ్య మనస్సు చివుక్కుమంది. ఆ జాగాలో కూర్చోవాలనే అనిపించలేదు. కోపంతో, అభిమానంతో ఎరుపెక్కిపోతున్న సంధ్య ముఖంచూసి అమ్మాయిలసీట్లో కూర్చున్న తార సంధ్యచేయి పట్టుకుని బలవంతాన ఆ అబ్బాయి ఖాళీచేసిన జాగాలో కూర్చోపెట్టేసింది

"మాట్లాడబోతే అంతా సమానులే, తీరా క్రియ కొచ్చేసరికి మాత్రం నెత్తికెక్కించుకున్నట్టే చూడాలి అసలు మనం ఎందుకు లేవాలంట? ఆడపిల్లలకంటె బస్సుఛార్జీ రెండింతలు వసూలు చేస్తున్నారే యూనివర్శిటీ

వాళ్ళు మనదగ్గఱ? రెట్టింపుడబ్బు పోసుకుని అమ్మాయిలు వచ్చేసరికి వులుకులికి పడుతూ లేచిపోయి అజాగా కొన్తా వాళ్లకి దానం చేసేసి మనం చేతులు నలుపుకుంటూ నించోవాలా? దండం, దాసోహం అని మహారాణిని చూసినట్టు చూడాలా వాళ్లను? మొత్తానికి ఈ ఆడవాళ్ళు మనమీద భలే అధికారం చెలాయిస్తున్నారులే! ఈ రోజుల్లో ఆడపిల్లయి పుట్టటంకన్నా మరో అదృష్టం లేదురా" అంటూ ప్రక్క పిల్లాడితో బిగ్గరగా మాట్లాడుతూ తన ఉక్రోషం వెళ్ళబోసుకుంటున్నాడు ఇందాకటి అబ్బాయి

సంధ్యకి ఒళ్లు మండిపోయింది. "అధికారం చెలాయిస్తున్నది ఆడవాళ్లా? ఆ రోజులు కనుచూపుమేరలో ఎక్కడా కనుపించటమే లేదే? ఆడవాళ్లను ఎంలో ఉదారంగా చూస్తున్నట్టు ఎందుకలా మాట్లాడటం? యూనివర్శిటీలోనే ఉండాల్సిన హాస్టల్ కారణాంతరాల (?) వల్ల వూళ్ళోకి వచ్చిపడటంమూలాన హాస్టల్ అమ్మాయిలంతా బస్సుఎక్కి రావాల్సివస్తున్నది అందుకోసం ఉచితానుచితాలు తెలిసిన యూనివర్శిటీ వాళ్ళదగ్గఱనుంచి పూర్తిఛార్జీ వసూలుచేయటానికి మనస్కరించలేదు. 'అక్క మూలాన వక్క బ్రతికిం' దన్నట్లు వాళ్లమూలాన మిగతా ఆడపిల్లలందరికీ కూడా బస్సుఛార్జీ సగం ఇచ్చుకోవటంతోనే సరిపోయింది. పూర్తిఛార్జీ ఇచ్చుకోమంటే ఇవ్వనన్నదెవరు? ఆమాటకొస్తే తను ఆ సగండబ్బు ఇచ్చుకోవడం కూడా దండుగే. క్రిక్కిరిసి ఉండే బస్సులో రోజూ ఇలా సీటుకోసం తడుములాడుకోవటమేగా తపవంతు! ఆడపిల్లలందరికీ ఏదో పట్టంకట్టేసినట్టు ఎందుకలా అక్కసు పడతారు? వాళ్ళకేం తక్కువైపోయిందని, వీళ్ళకేం ఎక్కువయిపోయిందని?

సంధ్యకు కోపంతో కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి ఎలాగో తమాయించుకుని కూర్చుంది.

4

"అర ఏమిటితారా! కుట్టుకుంటూ కూర్చున్నావా?" అంటూ విశ్రాంతిపోతూ వచ్చింది సంధ్య

"ఉష్" అని నిట్టూరుస్తూ "నువ్వేం పట్టనటే కూర్చుంటావ్ తారా!" అని కోపంగా అంది సంధ్య

"ఏం కొంప మునిగింది సంధ్యా?" అంది తార కుట్టుమీదనుంచి దృష్టి మరల్చకుండా

సంధ్య వులిక్కిపడి ఆశ్చర్యంగా తారకేసి చూసింది ఇంతవరకు తార ఒక్కతే సంధ్యకు అన్నింటిలోనూ చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చింది తక్కిన ఆడపిల్లలంతా సంధ్యను చీదరించుకుని చూస్తే, తార మాత్రం చిన్నప్పటినుంచి వస్తూన్న స్నేహభావాన్ని మరింత పెంపొందించుకున్నది సంధ్య స్నేహం మూలాన్న తారకు సంధ్యలక్షణాలు చాలావరకు అలవడ్డాయి సంధ్యలాగే తారకూడా స్త్రీ స్వాతంత్ర్యం సమానత్వం అంటే ప్రాణాలు విడుస్తుంది. సంధ్యతో ప్రతి మీటింగుకూ ఆసక్తితో హాజరవుతుంది ఆడా, మొగా తేడాలేకుండా నలుగురితో మాట్లాడటం తారకు అలవడటానికి ముఖ్యంగా సంధ్యే కారణం

అలాంటిది తార ఎందుకో ఈమధ్య క్షణక్షణానికి మారిపోతున్నది!

సంధ్య నిస్పృహగా తారకేసి చూసి "బాగుంది! టౌన్‌హాలులో మీటింగుసంగతి మర్చిపోయావా ఏమిటి? ఛీ! ఛీ! ఏమిటి తారా ఇంత అలక్ష్యం! అవతల మనకు స్వాతంత్ర్య సమానత్వగౌరవాలు కరువై మనం అధోగతిలోవుంటే నువ్వు వంటలూ, కుట్లూ చూసుకుంటూ కూర్చుంటావ్? ఉస్" అని నిట్టూరుస్తూ సంధ్య "మనం అంతా ఉత్సాహంగా నడుంకట్టుకోకపోతే ఎలా చెప్పు, తారా?" అంది సంధ్య బ్రతిమాలే కంఠస్వరంతో

తార ఒకక్షణం కుట్టుకుట్టడం ఆపి సంధ్య ముఖంలోకి చూస్తూ మెల్లగా అంది "నిజం చెప్తున్నాను సంధ్యా! నాకు ఈమీటింగులు, ఈ గొంతుచించుకోవటాలు సుతరామూ నచ్చటంలేదు వాటివల్ల మనం సాధించగలిగేదేముంటుంది?"

సంధ్య చర్రుమని లేచింది "మీటింగుల వల్లా, వుపన్యాసాలవల్లా సాధించలేకపోతే మరి దేనివల్ల సాధించగలం తారా? నలుగురికీ మనతాహతు, మనప్రతిభ చాటుకోకపోతే ఎలా? మనమూ మొగవాళ్ళకంటె దేంట్లోనూ తక్కువకాదని నిరూపించుకోవాలి నలుగురికీ తెలియబరచాలి. మన స్వాతంత్ర్య గౌరవాలు మనం పోరాడి తెచ్చుకోవాలి"

ఆవేశంతో మాట్లాడుతున్న సంధ్యను అయోమయంగా బేలచూపులుచూస్తూ తార అంది "ఏమిటో సంధ్యా? అంతా గొడవ, గొడవగా వుంటుంది. అసలు 'స్త్రీ స్వాతంత్ర్యం' అంటే ఏమిటి సంధ్యా? అవి పూర్వపురోజులు కాని సంధ్యా ఇప్పుడు మనకేం? మనకు కావల్సినంత స్వాతంత్ర్యం వుండనేవుంది మనం మన యిష్టమొచ్చినట్టు మొగాళ్ళతో సమానంగా చదువుకోవచ్చు, వుద్యోగాలు చేయొచ్చు"

తార చెప్పటం ముగించనేలేదు, సంధ్య రౌద్రంగా గర్జించింది "ఆపు తారా! సిగ్గులేదూ నీకు? ఇన్నేళ్ళు వచ్చాయి— 'స్త్రీస్వాతంత్ర్యం' అంటే సరిగ్గా అర్థం కూడా తెలీదు. చదువుకుంటున్నాం, వుద్యోగాలుచేస్తున్నాం, ఎందుకూ మొగవాళ్ళను చూసినంతగౌరవంగా మనల్ని చూస్తున్నారా? అమ్మాయి వుద్యోగంచేస్తుంటే అందరూ 'ఎందుకొచ్చిన ఇబ్బంది?' అంటూ వెక్కిరింతగా ముసిముసినవ్వులు నవ్వటమే కదా? పెళ్ళిళ్ళవిషయంలోనూ, కట్నాల విషయంలోనూ మనస్థితి ఎంత అధోగతిలో వుందో వేరే నోటితో అనుకోవాలా? మనల్ని ఎంతహీనంగా, నీచంగా చూస్తున్నారో నీకింకా సరిగ్గా అర్థంకాలేదు తారా! మనకు పూర్తిస్వాతంత్ర్యం ఇంకా రానేలేదు! తరతరాల బానిసతనపు మత్తులోనుంచి ఇప్పుడిప్పుడే తెలివితెచ్చుకున్నాం. మళ్లా మైకంలో పడిపోకుండా పూర్తి తెలివి తెచ్చుకోవాల్సినవిధి మనమీద వుందితారా!

★ సమానత్వసాధన ★

మనకు రావల్సిన స్వాతంత్ర్యంలో శతాంశ మైనా వచ్చిందో, లేదో ఎంతసంతోషిస్తూ కూర్చున్నావ్ తారా?"

తారమౌనంగా ఎటో చూస్తూనిట్టూర్చింది.

సంధ్య ఆశయసాధన ఇప్పుడిప్పుడే క్రియా రూపం దాల్చింది. ఇంతవరకూ సంధ్య స్త్రీస్వాతంత్ర్యం గురించి పెద్దవాళ్ళు చెప్పే ఉపన్యాసాలను ఎంతో ఆసక్తిగా వింటూ అర్థంచేసుకోవటానికి మాత్రమే ప్రయత్నిస్తూ వచ్చింది

ఇప్పుడు సంధ్య తను స్వయంగా కార్య రంగంలోకి వురికింది. పెద్దపెద్ద బహిరంగ సభల్లో తనుకూడా వుపన్యాసాలివ్వటం, పేరు, ప్రఖ్యాతులుకల పెద్దలచేత వుప న్యాసా లిప్పించటం. అక్కడికి వెళ్ళటం, ఇక్కడికి వెళ్ళటం – మొత్తానికి సంధ్య బలే హుషారుగా, బిజీగా తిరుగుతోన్నది తన ఏకైక లక్ష్యసాధనకోసం

"ఇంతకూ నువ్వు మీటింగుకు రావా ఏం?" అనడిగింది సంధ్య

"సారీ సంధ్యా!" సంధ్య విస్మయంతో వెళ్ళిపోయింది

ఆ రోజు మీటింగులో సంధ్య కూడా ఒక వుపన్యాసకురాలే పట్టుమని పదిమంది ఆడవాళ్లు కూడా లేని ఆ సభలో మాట్లాడ టానికే సిగ్గేసింది సంధ్యకు

ఛీ! ఛీ! ఏం ఆడవాళ్లు! తమ విషయం కూడా తమకు పట్టనట్టే కూర్చుంటారు! ఎవరి విషయం వాళ్ళకే పట్టకపోతే ఇంకెలా బాగుపడటం? వట్టి మూర్ఖులు. స్వేచ్ఛ అక్కర లేదు, స్వాతంత్ర్యం అక్కర్లేదు-ఎక్కడ పడివుండమంటే అక్కడే వుంటారు సంతో షంగా. ఇలాంటివాళ్ళ సహకారంతో తను గురుతరబాధ్యత నిర్వహించ దలచుకున్నది! మేమూ మనుష్యులమేనని నలుగురితోపాటు నిలబడగలగటం ఎప్పుడో అనుకుని విసు క్కుంది సంధ్య

"కంగ్రాట్యులేషన్స్ సంధ్యా?" అంటూ మోహన్ వచ్చి సంధ్య నభినందించాడు సంధ్యతోటివిద్యార్థులు, గోపాల్, కిశోర్ మొదలైన వాళ్ళంతా కూడా సంధ్యను పొగ డ్తలతో నింపేశారు స్త్రీల విషయంలో పాటుపడటానికి ఎంతో ఆసక్తిచూపిస్తూ నడుం కట్టుకోవటానికి ముందుకొచ్చిన యువకులను చూసి సంధ్య మనస్సు పరవళ్లు త్రొక్కింది ఉత్సాహవంతులైన ఇటు వంటి యువకుల సహకారంతో తను ఎన్నటికైనా తనలక్ష్యాన్ని సాధించి తీరు తుంది! తోటి ఆడవాళ్ళు సహకరించక పోతే తనకు వచ్చిన నష్టం ఏమీ లేదు

ఇంటికి వెళ్తున్నదారిలో సంధ్య "ఎలా వుంది మధూ నా వుపన్యాసం?" అంది మందహాస వదనంతో, మౌనంగా నడచి వస్తున్న మధుతో

మధు వుదాసీనంగా కాస్సేపు వూరుకుని "సంధ్యా! నే నొక్కమాట చెపుతాను, కోపగించుకోక వింటావుకదూ?" అన్నాడు మెల్లగా

సంధ్య ప్రశ్నార్థకంగా మధుకేసి చూసింది

మధు పరధ్యానంగా ఎటో చూస్తూ "స్వేచ్ఛ,స్వాతంత్ర్యం, సమానత్వం-ఇవన్నీ ఏమిటో సంధ్యా? మనకు వాటిగురించి ఏవేవో 'కన్ఫ్యూజ్ డ్ ఐడియాస్' తప్ప సమగ్రమైన భావనలేదు. ఈ మీటింగులు, ఈ వుపన్యాసాలు వీటిజోలికి పోకుండా హాయిగా మనిద్దరం పెళ్ళి చేసుకుని సుఖంగా బ్రతుకుదాం సంధ్యా?" అన్నాడు యాచనాపూర్వకమైన కంఠస్వరంతో.

సంధ్య ముఖ్యం క్రోధంతో ఎర్రబడి పోయింది మధును కొట్టేద్దామన్నంత ఆవే శం కలిగింది సంధ్యకు. అయినా ఎందుకో కొట్టటానికి చేతులురాలేదు.

"మధూ!' అని గట్టిగా కోపంతో అరి చింది

"ఈమాట ఈసారి అంటే అన్నావు కాని ఇంకోసారి అన్నావంటే మర్యాద దక్కదు మధూ నా జీవితాన్ని నా ఆశయసిద్ధికోసం, ఏకైక లక్ష్యంకోసం ఎన్నడో అంకితంచేసు కున్నాను 'పెళ్ళి' అంటే ఏమిటో తెలుసా- బానిసతనం – మొగవాడి చేతిక్రింద జీతం, బత్తెంలేని పనిమనిషిగా పడివుండటమన్న మాట – సమానత్వం సాధించటానికి కంకణం కట్టుకున్న నేను బానిసతనానికెలా కట్టు బడగలను మధూ? ఛీ! ఛీ!" అని చీదరించు కుంది సంధ్య

మధు ఒకసారి సంధ్యకేసి విరక్తిగా చూసి "కాదు సంధ్యా, నీవు పొరపడు తున్నావు-పెళ్ళంటే బానిసతనమా సంధ్యా? సమానత్వంతో సంచరించే సమవయస్కు లైన ఇద్దరి అనురాగమయ హృదయాలు ఏక మయ్యేది కూడా పెళ్లిలోనే కదూ! ఎప్పటి కైనా నీ మనస్సు తప్పక మారుతుంది సంధ్యా? ఆ నాడు నాకు తప్పక తెలియ జేస్తావు కదూ?" అని అడిగాడు మెల్లగా

"మారదు, మారదు జన్మలో మారదు ముందు నువ్విక్కడి నుంచి కదులు" అంటూ సంధ్య పట్టరాని ఆగ్రహంతో అరిచింది.

5

సంధ్య తన ఆశయంపట్ల ఆసక్తి చూపి స్తున్న యువకులను ఎంతో అభిమానంతో చూస్తూ వాళ్లలో ఎంతో కలిసి, మెలిసి చనువుగా ప్రవర్తిస్తున్నది సంధ్యను ఆడ వాళ్ళంతా ఏహ్యభావంతో చూస్తున్నారు. విచ్చలవిడిగా తిరుగుతున్న సంధ్యమీద రక రకాల పుకార్లు లేస్తున్నాయి అయినా సంధ్య ఏమీ లక్ష్యపెట్టటం లేదు తను చేస్తున్న పనిలో అవగింజంతైనా తప్పులేదని సంధ్యకు గాఢ విశ్వాసం

"తారా! సంధ్యప్రవర్తన నాకేమంత బాగోటంలేదు. నువ్వు కొస్త మందలించి సంధ్యను మంచిమార్గంలోకి తిప్పు తారా! వెర్రి వెర్రి ఆవేశంలో పడిపోయి మతిపో గొట్టుకుంటున్నది సంధ్య. పాపం! సంధ్య

శక్తి అసూయాపరురాలు తారా!" అన్నాడు తారతో ఒకరోజు మధు.

తార సన్నగా నిట్టూర్చింది. "నే నేం చెయ్యను మధూ! సంధ్యకు, కళ్ళు కమ్మిన మైకంలో, మనం చెప్పేమాటలు రుచిస్తాయా! అయినా, చూడాలి" అంది తార కొద్ది ఆశతో

సంధ్యను కలుసుకున్నప్పుడు తార మెల్లగా సంధ్యను మందలించింది

"ఎంత పోవలైనా మొగవాళ్ళతో కలిసి మెలసి అంతలా తిరగటం మంచిదికాదు సంధ్యా-అది మన ఆచార వ్యవహారాలకు పూర్తిగా విరుద్ధమైన పని!" అని

సంధ్య పకపకా, నిర్లక్ష్యంగా నవ్వింది "ఏమిటి తారా! మరీ అంత సంకుచిత బుద్ధితో మాట్లాడతావ్? సోదర సోదరీ భావంతో కలిసిమెలిసి వుంటే తప్పేముంది! మన అన్నయ్యతో మనం తిరగమూ, అలాగే ఇదీనూ—"

"అయినా నలుగురూ ఏమనుకుంటారు? సంఘం ఏమంటుంది?"

"తారా! ఇంత పిరికివాళ్ళం కాబట్టే మొగవాళ్లు మనకు స్వేచ్ఛలేకుండాచేసి తరతరాల దాస్యం చేయించుకున్నారు మన చేత. సంఘం అంటుంది తారా! అంటుంది! ఎందుకనదూ? ఇన్నాళ్ళు కట్టిపడేసివున్న కాళ్లను కాస్త వదులుచేసుకుని స్వేచ్ఛగా వూపిరి పీల్చుకుంటే సంఘానికి కళ్లు బాగానే కుట్టాయి. నేను ఏం తప్పుపని చేస్తున్నానని సంఘానికి, లోకానికి వెరవాలి? ఆ విశ్వాసం నా కున్నన్నాళ్లు నాకు ఎవరేమనుకున్నా లక్ష్యంలేదు తారా!" అంది సంధ్య నిర్లక్ష్యంగా తలెగరేస్తూ.

తారముఖం చూస్తూండగానే రంగులు మారింది.

"అంతేగాని సంధ్యా, చెప్పినమాట వినిపించుకోవన్నమాట నిన్ను మంచిమార్గంలోకి త్రిప్పాలనుకోవటం నావెర్రి నువ్వింత రౌడీలా ప్రవరిస్తావని నేను ఎన్నడూ అనుకోలేదు నిన్ను ఆడవాళ్ళవరైనా గౌరవిస్తున్నారా? నలుగురిలో వున్న గౌరవాన్ని పోగొట్టుకుని ఏదో లేనిగౌరవాన్ని ఎక్కడినుంచో తీసుకువస్తావుకదు సంధ్యా? ఛీ! ఛీ! సిగ్గులేదు నీకు. చిన్నప్పటినుంచీ పెంచుకొస్తున్న స్నేహాన్ని చటుక్కున త్రెంచి వెయ్యలేక ఇన్నాళ్లు మెదలకుండా వూరుకున్నానుగాని సంధ్యా ఇకమీదట నీతో స్నేహం నాకు వాంఛనీయంకాదు. గుడ్ బై సంధ్యా!" తార గేటుతలుపులు దూకుడుగా మూసేసింది

సంధ్య సహించరాని బాధతో, చివుక్కుమన్న మనస్సుతో ఇంటికి వెళ్ళిపోయింది ఆడవాళ్ళందరిలో తను గౌరవ మర్యాదలు ఏనాడో పోగొట్టుకుంది. అఖరుకు బాల్య స్నేహితురాలు తారకూడా తనని అవమానించి తుంచేసింది. తనేం తప్పుచెయ్యటం లేదుకదా అని సంధ్య విస్మయంతో, దిగ్భ్రమతో ఒక్కసారి తన ప్రవర్తనను సునిశితంగా పరీక్షించుకున్నది. ఏం కనపడిందే? హుఁ! తార తనకు దూరమైనంత మాత్రాన తను దిగులుపడిపోయి ఆశయసాధననుండి విరమించుకుంటుందా? "నాకెవరి లక్ష్యమూ లేదు" అని నిబ్బరంగా అనుకుంది సంధ్య. అయినా సంధ్య మనస్సులో ఏదో కలవరంగానే వున్నది.

"నేను తప్పుదారిలో పడిపోలేదుకదా?" అని సంధ్య విహ్వల హృదయంతో కళ్లు మూసుకుంది

సంధ్య కారాత్రి కునుకుపడితే ఒట్టు. ఆందోళనపడిన మనస్సుతో రాత్రంతా వులికి పడుతూ కూర్చుంది సంధ్య మధుతో మాట్లాడి ఎన్నిరోజులయ్యిందీ? ఒక్కసారి మధుతో మాట్లాడితే తన హృదయంలోని బాధ కొంతవరకయినా వుపశమిస్తుందేమోనని సంధ్య పదే పదే అనుకుంది.

6

సంధ్య ఈమధ్య మరీ బిజీగా వుంటున్నది. మహిళాసభల హడావుడి ముమ్మరంగావుంది రోజుకో ప్రఖ్యాతవ్యక్తి మహిళలు సాధించవలసిన అనేక కార్యక్రమాలనుగురించి గంటలకొద్దీ వుపన్యసిస్తున్నారు, అమోఘమైన సందేశాలిస్తున్నారు సంధ్యకు చేతినిండా పని వుంటున్నది. నడిరేయికూడా నిర్భయంగా వీధుల్లోకివెళ్లి తన కార్యాలు చక్కబెట్టుకుని వస్తున్నది సంధ్య

అర్ధరాత్రివేళ సంధ్య స్టేషనునుంచి సైకిల్ మీద తిరిగివస్తున్నది మరుచటిరోజు మహిళా సభకు అధ్యక్షత వహించాల్సిన సావిత్రీదేవి గారు రాలేదు

దూరంలోని ఒకరౌడీగుంపు సంధ్యను చూసి కేకలేసుకుంటూ వచ్చి చుట్టుముట్టేశారు. హుషారుగా నవ్వుతూ, కేరింతాలు కొడుతూ నానా అల్లరీ చేస్తున్నారు. సంధ్యకు క్రోధంతో, అవమానంతో కళ్ళ నీళ్లు తిరుగుతున్నాయి.

"మీకు అక్కచెల్లెళ్లు లేరా?" అంది సంధ్య కోపంతో, దుఃఖంతో వణుకుతున్న గొంతుకతో.

"వున్నారు లేకేం అయితే వాళ్లు నీలా నడిరేయి బజార్లలో సైకిళ్ళెక్కి తిరగరు." అన్నాడు ఆ గుంపులోంచి ఒకడు. అంతా పక పకా నవ్వారు.

వాళ్ళను వదిలించుకోవాలని సంధ్య నానా ప్రయత్నాలూ చేస్తున్నది.

"ఎవరు? నువ్వా సంధ్యా?"

"సమయానికి దేవుడిలా వచ్చి రక్షించారు గోపాల్ గారు" అంటూ సంధ్య చెల్లాచెదరై పారిపోతున్న రౌడీగుంపులోని ఒక

★ సమానత్వసాధన ★

సారి చూసి గోపాల్ కేసి కృతజ్ఞతాపూర్వకంగా చూసింది.

"పద సంధ్యా! నిన్ను మీ ఇంటివరకూ వచ్చి దిగబెట్తాను." అంటూ గోపాల్ సంధ్య వెనక నడిచాడు

"ఏమిటిది గోపాల్!" అంది సంధ్య నివ్వెరపోతూ తనతో మరీ దగ్గరగా వస్తున్న గోపాల్ ను విదిలించికొడుతూ

"పెద్ద నీతిగలదానిలా మాట్లాడకు సంధ్యా! తెల్లారితే స్తే పదిమంది మొగాళ్ళను వెంటేసుకుని తిరుగుతూవుంటావు నే నేపాపం చేశానని ఇలా ఈసడించటం" అంటూ గోపాల్ సంధ్యను హెచ్చరించేడు.

సంధ్య దిగ్భ్రాంతురాలయింది. స్త్రీ స్వాతంత్ర్యంపట్ల ఆసక్తి చూపిస్తూ తన కన్నింటిలోనూ చేదోడు, వాదోడుగా వుంటూవచ్చిన గోపాల్ మీద సంధ్యకెంతో సోదరతుల్యమైన గౌరవభావం వుంది. గోపాల్ కి తనమీద ఇంత నీచమైన అభిప్రాయంవుందా? అనుకుంది సంధ్య చివుక్కుమన్న మనస్సుతో.

ఛీ! ఎంతనీచుడు! అని పళ్ళు పటపటా కొరికి సంధ్య గోపాల్ చెంప చెడేల్ మనిపించి గబగబా సైకిల్ మీద ఇంటికి పరుగు తీసింది

ఆ రాత్రంతా సంధ్య ఏడుస్తూనే కూర్చున్నది ఎంతనీచంగా మారిపోయింది తన బ్రతుకు మొగవాళ్ళందరికీ ఎంత అలుసై పోయింది తను! అందరు మొగవాళ్ళు ఇంత నీచులేనా?

మధుతో తను ఎంత కలిసిమెలిసి తిరిగేది! అయినా అతను ఎన్నడైనా తన వంటిమీద చెయివేసి అగౌరవపరచేడా? అనుకోకుండా మధు జ్ఞాపకంవచ్చేసరికి సంధ్యమనస్సు మరింత కలుక్కుమంది ఆనాడు తను మధును కసిరికొట్టిన దగ్గరనుంచీ ఇంతవరకూ తను మధుతో మళ్ళా మట్లాడనేలేదు మధు మాత్రం సంధ్యను మామూలుగా పలకరించాలని ప్రయత్నిస్తూనే వున్నాడు.

అవును! మధుతో మాట్లాడుతూవుంటే మనస్సుకెంత హాయిగావుంటుంది?

'ఏమిటిది? చిత్రంగా మారిపోతున్నాయి' తన భావాలు అనుకుంది దిగ్భ్రమతో సంధ్య జీవితంలో తోడులేకుండానే, బ్రతకగలననుకున్నది.

సంధ్య రాత్రంతా కళ్ళనీళ్ళతో, తలగడ తడుపుతూ విరామంలేని ఆలోచనలతో గడిపింది.

7

"నేను మనస్సు మార్చుకున్నాను మధూ!"

"ఏవిషయంలో సంధ్యా?" అని అడిగాడు మధు నిర్లిప్తంగా

సంధ్య త్రుళ్ళిపడ్డది "అదే—మన పెళ్లి విషయం!" అంది మెల్లగా, నీరసంగా.

"ఓ! అదా-నేనూ సరిగ్గా అదే చేశాను సంధ్యా?"

సంధ్య ముఖంలో నెత్తురుచుక్క లేదు "అంటే?" అంది హీనస్వరంతో, వెలవెలాపోతూ.

"నేను తారను పెళ్లిచేసుకోబోతున్నాను సంధ్యా నేను పిరికివాడిని సంఘం అంటే నాకు లక్ష్యం వుంది. మర్యాదను నేను మన్నిస్తాను వడిరేయి విచ్చలవిడిగా షికార్లు తిరిగే నీతో నాకు పొత్తుకుదరదు సంధ్యా నువ్వు ఏ తప్పుపనీ చేసివుండవని నాకు గట్టిగా తెలుసు అయినా నిన్ను భార్యగా కట్టుకుని నేను లోకులదృష్టిలో ఘోరమైన హీనస్థితికి దిగజారలేను సంధ్యా. నీ ఆశయాలు నాకు అర్థంకానివి. వాటి కనుగుణంగా నేను వర్తించలేను" అన్నాడు మధు దూరంలోకి చూస్తూ.

సంధ్యముఖం లజ్జావమానాలతో కంది పోయింది బుర్రంతా గిర్రుగిర్రున తిరుగుతున్నది పట్టలేని శోకంతో గబగబా ఇంటికొచ్చి పడ్డది.

తార ఇంటితలుపులు బంద్! మధు హృదయకవాటాలు బంద్! ఎక్కడా తనకు చోటులేదు. ఆడవాళ్లు, మొగవాళ్లు ఎవ్వరూ తనను ప్రేమించటంలేదు అంతా తనను గాఢంగా ద్వేషిస్తున్నారు. తను ఏకాకి! ఎవ్వరూ తనముఖం చూసేవాళ్లే లేరు.

స్వాతంత్ర్యం, సమానత్వం అంటే ఏమిటో తనకు సరిగ్గా తెలుసునా? ఆనాడు తారను కసిరికొట్టింది ఏవో గజిబిజీగా అల్లుకుని అస్పష్టంగా కన్పిస్తున్న వూహలుతప్ప తనకు ఏం తెలుసు? స్వేచ్ఛపేరిట తనేం చేసింది? నలుగురి మొగాళ్లతో స్వైరవిహారం చేయటం తప్ప. సమానత్వం సాధించబోయి తనేం తెచ్చుకుంది వర్తి అవమానం తప్ప. తనను అడ్డేవాళ్లు లేకపోయారు. తన యిష్టం వచ్చినట్లల్లా చేసింది, యిష్టంవచ్చినట్టు తిరిగింది స్వాతంత్ర్యం సాధిస్తున్నానని గర్వపడింది తండ్రి ఆశయాల కనుగుణంగా మహిళాలోకానికి తలమానికంగా తయారవుతున్నానని మురిసిపోయింది.


అర్థంకాని ఆవేశాలకు లోబడి తన జీవితాన్ని శాశ్వతంగా పాడుచేసుకున్నది తను మధు చెప్పినప్పుడే అతనిమాట వింటే ఎంత బాగుండేది అనుకుని కన్నీళ్ళు కారుస్తూ నిట్టూర్చింది సంధ్య.

* * *

"అరె ఏమిటిది సంధ్యా? సైకిల్ నెందుకలా విరగ్గొట్టేస్తున్నావు?" అంటూ విస్మయంతో ప్రశ్నించాడు మోహన్ ఏదో పడగొడ్తున్న శబ్దంవిని లోపలినుంచి బైటికి వస్తూ

సంధ్య ఒక క్షణం మాట్లాడకుండా సైకిల్ మీద గట్టిగా సుత్తితో దెబ్బలు వేసింది.

"నాకింక దీనితో అవసరంలేదు ఆమాటకొస్తే జీవితంలో నాకింక దేనితోనూ అవసరం లేదు అన్నయ్యా" అంది సంధ్య నిశ్శబ్దంగా ఏడుస్తూ నిట్టూరుస్తూ. ★



గొల్లవాని గొప్పతనం

అడవి నడుమ కొండలోన
సెలయే రొకటేగుచుండు.
ఏటిమీద బాటపైన
రైలు రోజు వెళ్లుచుండు!

గొల్లవాడు గోవులతో
అచటి కేగి ఆటలాడు
వచ్చి వెళ్లు రైలు చూచి
ప్రొద్దుపుచ్చు నెల్లప్పుడు

ఇట్టులుండ నొక్కనాడు
వర్షమొచ్చి వరద పార,-
రైలు కమ్మి తెగిపోయి
చాల పెద్ద గండి పడెను!

గొల్లవాడు దీన్ని చూచి
గొల్లుమనెను నీరీతిగ!
"అయ్యొ రామ! ఏది దారి?
రక్షింపగ రైలువారి!"

ఇంతలోన రైలు ఒకటి
వేగముగా వచ్చుచుండ,-
యోచించెను సాహసించి;
చేసె వాడు తుదకిట్టుల!

నెత్తిపైన వేసుకొన్న
యెర్రనైన తలపాగా
కట్టుకొనక బిగియకట్టి!
అడ్డునిలిచె దాన్ని పట్టి!

గొల్లవాని చేతిలోని
ఎర్రపాగ చూచి రైలు
తకీమనుచు ఆగిపోయె!
లోనివారు విస్తుపోగ!

రైలులోని అధికారులు
వాని చేరి యిట్టులనిరి :
"ఏమోయీ గొల్లవాడ!
రైలాపితి వెందుకొరకు?"

"వర్షమొచ్చి వరదపార
రైలు బాటగండి పడగ
రైలువారి రక్షింపగ
చేసితిటుల!" ననియె వాడు!

అనినవారు సంతసించి,
గొల్లవాని నెరతో మెచ్చి,
ఉచితరీతి నాదరించి,
సత్కరించి పంపినారు!

ఎర్రగుంట్ల వెంకటరాజారావు

ఉట్టిమీద వెండిగిన్నె

విశాఖపట్నంజిల్లాలో నర్సీపట్నం అనే ఊరు ఉంది. ఆ ఊరి ప్రాంతాల్లో దట్టమైన కొండలు, అడవి ఉన్నాయి. ఆ అడివిలో పూర్వం పేరుపడ్డ వెలందొరలు ఇద్దరుండేవారు. వారిపేర్లు రొడ్డందొర, అల్లుదొర. వీరిరువురు బావ మరదులుకూడా. పేరుపడ్డ దోపిడిగాండ్రు. అంటే తిండికిలేక గాదు. ధనవంతులను దోచి, బీదలకు పెట్టేవారు. వీరివద్దకు ఎవరైనా వెళ్లి ధనం కావాలని యాచిస్తే, లేదనకుండా ఇచ్చేవారట! అటువంటి ఉదారస్వభావులు. వీరిగురించి ఒక చిన్నకథ ఉంది.

ఒకనాడు రొడ్డందొర బావగారైన అల్లును చూదామని వెళ్లాడు. అన్నగారు వచ్చారని, అల్లుదొర భార్య నవరుచులతో వంటకాలను చేసి ఒక పెద్ద వెండిగిన్నెలో ఉంచింది. ఈ గిన్నెను చూచినతోడనే రొడ్డందొర, దీని నెలాగైనా అపహరించాలని అనుకున్నాడు. ఆరాత్రిఅక్కడేవున్నాడు. చెల్లెలు మంచంపక్క సిద్ధంచేసింది. పడుకున్నాడు కాని నిద్రపట్టలేదు, దృష్టి అంతా ఆగిన్నెమీదే వుంది.

సాధారణంగా ఈ బావ మరదులు ఒకరింటికి ఒకరువస్తే, యిరువురూ కొంచెం జాగ్రత్తగా ఉండేవారట. అంటే ఒకరిని మించినవారొకరు. దెబ్బకు దెబ్బ తీయడం వారిపని. బావసంగతి తెలిసిన అల్లుదొర, వెండిగిన్నెనిండా నీరు పోసి ఆ గిన్నెను, తన మంచంమీద ఒక ఉట్టిలో ఉంచి పడుకున్నాడు. ఎందుకంటే, ఒకవేళ గిన్నె తీస్తే, అందులో నీరు తొణికి ఆనీరు తనమీద పడితే తనకు తెలివి వస్తుందనీ, అప్పుడు దొంగను పట్టుకోవచ్చునని అతని ఊహ. కాని అతను అనుకున్నట్టు జరగ లేదు.

శ్రీరంగం సుందరమ్మ

నిద్రలేని రొడ్డందొర ఇదంతా పసికట్టి, దీనికి తగినపని చేయాలనుకున్నాడు. నడిరాత్రిలోలేచి కచికలు తెచ్చి మెల్లగా ఆ గిన్నెలోవేశాడు. నీరంతా ఇంకిపోయింది. వెంటనే గిన్నె తీసుకుపోయి ఊరి బయట చెరువులో ఉంచి దానిపై బండరాయిని పెట్టి తిరిగివచ్చి యేమీ తెలియనట్లు పండుకున్నాడు.

తెల్లవారుజామున రెండుమూడు గంటలకు తెలివివచ్చింది అల్లుదొరగారికి. గిన్నెచూస్తేకనబడలేదు.బలేపనిచేశాడనుకున్నాడు. గిన్నెనెక్కడ దాచాడో తెలుసుకొని దానిని తిరిగి తేవాలనుకున్నాడు అల్లుదొర. ఈయనకూడా గట్టివాడే కదూ! ఆలోచించేడు. ఒక ఉపాయం తట్టింది. బావగారివద్దకు వెళ్ళాడు. పాపం అలిసిఉండుటచేత మంచి నిద్రపట్టింది రొడ్డందొరకి.

ఇదేసమయమని బావగారి గుండెపై చెయ్యివేసిచూచాడు అల్లుదొర. గుండె దడదడ కొట్టుకుంటున్నది. అదికాక గుండెవరకు దేహం చల్లగా తగిలింది. పైభాగం వేడిగావుంది. దీనిమీద సంగతి తెలిసిపోయింది అల్లుదొరకి. బావగారు నీటిలో దిగినట్లు తేలింది. వెంటనే బయలుదేరి వెళ్లి ఆ ఊరి చెరువులో, గుండెలోతుకు దిగి వెతికేడు. బండరాయి కాలికి తగిలింది. మెల్లగా తడిమిచూస్తే దాని కింద గిన్నె దొరికింది. వెంటనే ఇంటికి వచ్చి, భార్యను లేపి, గిన్నె చేతికిచ్చి సంగతంతా చెవిలో చెప్పాడు. ఏమీ ఎరగనట్లు మామూలుగా ఉన్నాడు. తెల్లవారింది.

అన్నగారు వెళతారు కదా అని చెల్లెలు పాయసంచేసి వెండిగిన్నె నిండా అన్నగారికి వడ్డించింది. గిన్నె చూడగానే రొడ్డందొరకి అనుమానం వేసింది. ఆ గిన్నె తానపహరించిన గిన్నెనా లేక ఇంకొకటా అని. ఉండలేక చెల్లీ మీ యింట ఎన్ని గిన్నెలున్నాయి అని అడిగాడు. లేదన్నయ్యా! నిన్నరాత్రి నీవు చూచినగిన్నే మరిలేవు! అని జవాబిచ్చింది చెల్లెలు. ఆశ్చర్యపోయి తనలోతానే నవ్వుకున్నాడు. బావమరదులిద్దరు ఒకరినొకరుచూసి పకపకా నవ్వుకున్నారు. చూశారా! ఒకరిని మించిన దొంగ మరొకరు!

★

నొసటి వ్రాత

పూర్వం ఒకవూళ్ళో ఒక బ్రాహ్మడు వుండేవాడు. ఆయనకు లేకలేక ఒక కొడుకు పుట్టాడు. ఆయన ఆనందానికి మేర లేదు. ఇంతలో ఆ వూరికి ఒక పెద్ద జ్యోతిష్కుడు వచ్చాడని తెలిసింది. బ్రాహ్మడు వెంటనే తన కొడుకు జాతకం చూడమని కోరాడు. ఆయన పరిశీలించి యేవేవో లెక్కలువేసి చిరునవ్వు నవ్వాడు.

"ఏమిటి స్వామీ? ఎట్లావుంది?" బ్రాహ్మడు ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"అబ్బాయి జాతకం అమోఘంగావుంది నాయనా! మహా విద్వాంసుడూ, ఐశ్వర్యవంతుడూ, ఆయుష్మంతుడూ అవుతాడు. కాని వివాహంమాత్రం ఒక బెస్తపిల్లతో అవుతుంది" అన్నాడు జ్యోతిష్కుడు.

"బెస్త పిల్లతోనా!" బ్రాహ్మడు విచారంగా అన్నాడు. "ఐతే స్వామీ! ఇది ఎట్లాగైనా తప్పదా?" అని బ్రాహ్మడు ఆశగా అడిగాడు-జ్యోతిష్కుడు చిరునవ్వు నవ్వాడు. "పిచ్చివాడా! నొసట వ్రాసినవ్రాత ఎట్లా తప్పుతుందయ్యా! తప్పదు. అనుభవించి తీరవలసిందే!" అన్నాడు నవ్వుతో.

"ఐతే, స్వామీ! ఆ పిల్ల ఏ వూళ్ళో పుట్టుతుందో చెప్పగలరా?" అని బ్రాహ్మడు ఏదో ఆలోచిస్తూ అడిగాడు.

"ఇదే వూళ్ళోనే సరిగ్గా రెండేళ్ళకు యిదేరోజునే పుట్టుతుంది" అన్నాడాయన.

బ్రాహ్మడు విచారంగా యిల్లు చేరాడు. "ఒక్కగానొక్క కొడుకు బెస్తపిల్లను పెళ్ళాడుతాడా? దీన్ని ఎలాగైనా తప్పించితీరాలి." అని బ్రాహ్మడు నిశ్చయించాడు.

ఒక సంవత్సరం గడిచింది. రెండోఏడు కొంత గడిచింది. ఆ వూళ్ళోని బెస్తవాళ్లలో ఎవరైనా గర్భంతో వున్నారా అని బ్రాహ్మడు యిల్లిల్లూ తిరిగి తెలుసుకున్నాడు. చివరకు ఒక బెస్తవాడు తనభార్య గర్భంతో వున్నట్టు చెప్పాడు. బ్రాహ్మడు సంతోషించాడు. ఆ బెస్తవాడితో యిలా అన్నాడు:

జంధ్యాల సరోజ

"చూడు నాయనా! నీ భార్య ప్రసవించినవెంటనే - ఆడపిల్లగనక పుట్టినట్టయితే - నాకు వచ్చి చెప్పు! పని వుంది!"

బెస్తవాడు సరేనన్నాడు.

రెండుసంవత్సరాలు గడిచాయి. సరిగ్గా జ్యోతిష్కుడు చెప్పినరోజుకు బెస్తవాడికి ఆడపిల్ల పుట్టింది. వెంటనే బెస్తవాడు యీ సంగతి బ్రాహ్మడికి చెప్పాడు. బ్రాహ్మడు వెంటనే వాడితో వాడియింటికి బయలుదేరాడు. పున్నమ చంద్రునిలా వెలిగిపోతున్న బెస్తవాడి కూతురిని చూచాడు. ఆయన హృదయంలో స్వార్థం, ద్వేషం నిండిపోయి వున్నాయి. "ఇదే నా మావాడికి కాబోయే భార్య!" అనుకున్నాడు. బైటకు వచ్చి కూర్చుని ఏమేమిటో లెక్కించాడు. చివరకు విచారంగా నిట్టూర్చాడు.

"ఎట్లావుంది స్వామీ?" బెస్తవాడు అడిగాడు.

"జాతకానికేమి నాయనా! బాగానేవుంది. కాని- ఆ పిల్ల చెంపన వున్న పుట్టుమచ్చ చూడు! - చెంపపైన ఆచోట పుట్టుమచ్చ వున్నవాళ్లు జన్మిస్తే అరిష్టం తప్పదు. వాళ్ళ వంశం సర్వనాశనం కాక తప్పదు!" అనివిచారంగా అన్నాడు.

బెస్తవాడు కళవళపడ్డాడు. "ఏం చేస్తే ఆ దోషం పోతుందిస్వామీ!" అని తొందరగా అడిగాడు.

"శాంతిచేస్తే పోయేదోషంకాదు నాయనా! ఆ పిల్ల పుట్టిన సంవత్సరానికి సరిగ్గా-ఆ ఇంట్లోవాళ్లు ఒక్కరైనా మిగులుతారేమో చూడు! నామాటపైన నమ్మకం లేకుంటే కొన్నాళ్లు చూడు తెలుస్తుంది." అన్నాడు.

"ఐతే, ఏం చెయ్యమంటారు. స్వామీ! లేక లేక పుట్టినబిడ్డ!" బెస్తవాడు భయపడుతూ అడిగాడు.

"ఏంచేస్తావు? నీ బిడ్డను నీ చేతులతో చంపడానికి చేయాడక పోతే- ఒకపని చెయ్యి-ఒక మేదరబుట్టలో ఆ పిల్లనుపెట్టి గంగానదిలో వదులు. ఆ పిల్లను చంపినపాపం నీ కంటదు. నీ పీడ తొలగిపోతుంది." అన్నాడు.

బ్రాహ్మడు వెళ్ళిపోయాడు. బెస్తవాడు ఎంతో బాధపడ్డాడు. కాని విధిలేక బ్రాహ్మడుచెప్పినట్లే చేశాడు.

కాని బ్రాహ్మడు అనుకున్నట్టు

★ నొసటివ్రాత ★

బుట్టమునిగి పిల్ల చచ్చిపోలేదు. ఆ బుట్ట అలా తేలుతూ వెళ్లి వెళ్లి కాశీనగరం చేరుకుంది. తెలతెల వారుతుండగా స్నానంచేస్తున్న ఒక బ్రాహ్మడు ఆ బుట్ట చూచాడు. వెంటనే అందుకుని తెరిచిచూచాడు. అందచందాలతో వెలిగిపోతూన్న పసిపాపను చూచి ఆశ్చర్యపోయాడు. తాను ఇన్నాళ్ళూ పిల్లల కోసం విశ్వనాధుడిని ప్రార్థించినందుకు, పిల్లను విశ్వనాధుడే అనుగ్రహించాడని అనుకున్నాడు. తీసుకుపోయి తనభార్య కిచ్చాడు. ఆమె ఎంతో సంతోషించింది. ఆ పిల్లకు విశాలాక్షి అని పేరుపెట్టి అభ్బా రు ముద్దుగా పెంచుకున్నారు ఆ దంపతులు. అందంగా చందమామలా పెరిగి పెద్దదయింది విశాలాక్షి.

ఇక్కడ ఇలావుండగా అక్కడ బ్రాహ్మడు తన కొడుకుకు విశ్వనాధుడని పేరుపెట్టుకుని పెంచుతున్నాడు. బ్రాహ్మణబాలుడు పెద్దవాడైనాడు. పెద్ద చదువులకోసం కాశీకి ప్రయాణమయ్యాడు. తండ్రికీ, తల్లికీ కొడుకును విడిచివుండడం కష్టమైనా, విధిలేక చదువుకు కాశీకి పంపారు. కాశీలో పండితులదగ్గర చదువుకుంటూవున్నాడు.

ఇలావుండగా, విశాలాక్షిని సాకిన బ్రాహ్మడు-'తన కూతురికి తగిన వరుడెవరా?' అని విచారించడం మొదలుపెట్టాడు. ఆయనకు విశ్వనాధుడు కనబడ్డాడు. ఆయన అన్ని సంగతులూ విచారించాడు. తన కూతురికి తగినవాడని నిశ్చయించాడు. విశ్వనాధుడికి విశాలాక్షిని చూపించాడు. విశాలాక్షి విశ్వనాధుడికి అప్సరసలా కనిపించింది. అతనికి నచ్చింది. బ్రాహ్మడు విశ్వనాధుడి తల్లిదండ్రులకు వుత్తరం వ్రాశాడు. ఆయన వెంటనే బయలుదేరి వచ్చాడు.

ఆ బ్రాహ్మడు అమ్మాయిని చూచాడు. చక్కనిచుక్క! చదువుకుంది. పిల్లనచ్చింది. కొన్ని రోజులకు-ఒక మంచిముహూర్తాన-విశ్వనాధుడికీ విశాలాక్షికీ వైభవంగా వివాహమైంది. అమ్మాయిని అత్తగారింటికి పిలుచుకుపోయారు. కొన్నాళ్లు గడిచిపొయ్యాయి. ఒక రోజున—విశ్వనాధుడు పుట్టినప్పుడు వచ్చిన జ్యోతిష్కుడే మళ్లీ వచ్చాడు.

ఆయనతో బ్రాహ్మడు యిట్లా అన్నాడు, "స్వామీ! నొసట వ్రాసిన వ్రాత తప్పదన్నారే! ఇప్పుడేమిటి జరిగింది?" అని.

"పొరబాటు నాయనా! శాస్త్రమెప్పటికీ అబద్ధంకాదు." అన్నాడాయన నెమ్మదిగానే.

ఈమాటలకు బ్రాహ్మడికి కోపం ముంచుకొచ్చింది. "ఏమిటి పొరబడ్డాను! తమరేమిటి చెప్పారు: "నా కొడుక్కి ఒక బెస్తపిల్లతో వివాహం రాసివుందని." ఔనా? మరి బ్రాహ్మలపిల్లతో ఐందేం?" అని ప్రశ్నించాడు.

జ్యోతిష్కుడు చిరునవ్వు నవ్వాడు: "పొరబాటు కాకేమి నాయనా! నీ కోడలు బ్రాహ్మల పిల్లేనని నీకేంనమ్మకం! ఆనాటి బెస్త పిల్లను యిప్పుడు చూస్తే గుర్తుపట్ట గలవా?" అని అడిగాడు.

బ్రాహ్మడు ఆలోచించాడు. ఆయనకు వెంటనే ఒకటి జ్ఞాపకమొచ్చింది. ఆనాటి బెస్తపిల్లకు చెంపపైన పుట్టుమచ్చ వుండేది. వెంటనే బ్రాహ్మడు యిలా అన్నాడు: "గుర్తుపట్టగలను స్వామీ! ఆ పిల్ల చెంపమీద పుట్టుమచ్చ వుండేది!"

"మరి? నీ కోడలా బెస్తపిల్ల ఔనో కాదో చూడు."

బ్రాహ్మడు వెంటనే కోడలిని చూచాడు. ఆనాటి బెస్తపిల్లకు ఏ చెంపమీద ఎక్కడ వుండేదో-అక్కడే అదేచోటనే అదేపుట్టుమచ్చ తనకోడలికీవుంది! బ్రాహ్మడు నిర్ఘాంతపోయాడు. అక్కడికీ నమ్మకంలేక తన వియ్యంకుడికి వుత్తరం వ్రాశాడు. "ఆపిల్ల మీ స్వంతకూతురేనా?" అని. వెంటనే జవాబు వచ్చింది. "గంగానదిలో స్నానంచేస్తూండగా ఒక మేదర బుట్టలో ఆ పిల్ల కొట్టుకునివస్తే సాక్కున్నానుగాని కన్నకూతురుగాదని." బ్రాహ్మడికింకే అనుమానమూ లేదు! ఆపిల్ల ఆనాటి బెస్తపిల్లే

ఇదంతా జరిగేంతవరకూ అక్కడే వుండిన జ్యోతిష్కుడు చిరునవ్వుతో యిలా అన్నాడు: "నొసటివ్రాత తప్పదని తెలిసిందా! నాయనా! తప్పించుకుందామని మానవులు ప్రయత్నిస్తారు! తప్పించుకున్నాంగదా అని నీలాగా సంతోషపడతారు! కాని అది అనుభవించక తప్పదని తెలిసికో లేరు. ఇప్పటికైనా వ్యర్థప్రయత్నం మాని దేవుడు వ్రాసినది తప్పదని తెలుసుకో!"

సెట్టి శకునం

గోపాలపురంలో గోపిసెట్టి మీద పోలీసుకేసుపెట్టి రెండునెం॥లైనది. ఆరోజు గురువారం. కోర్టుకురమ్మని సమను వచ్చింది. గోపాలపురంలో కోర్టులేదు. కోర్టుకు పోవాలంటే ఆరుమైళ్లు వెళ్ళాలి. అందుచేత గోపిసెట్టి ప్రొద్దున్నేలేచి ముస్తాబై వీధిలోకివచ్చి మెట్లు దిగబోతుండగా ప్రత్యక్షమైంది తెలుకుల అప్పయ్య, ఇంత తెలకపిండి, నూనెచెంబుతో సహా "అయ్యో! భగవంతుడా! అని సెట్టి లోనికిపోయి జోళ్లు విడిచి ఒక గ్లాసుడు మంచినీళ్లు తాగి ఐదు నిమిషాలు కూచుని తిరిగి వీధిగుమ్మంలోకి వచ్చాడు. ఒక్కమెట్టు దిగాడు. రెండో మెట్టు మీద ఒక కాలు వెయ్యనే వేశాడు. మరి ఎక్కడ కాచుకు కూచున్నాడో కాని పిడుగులా సిద్ధమయ్యేడు, జోగయ్యగారు ముష్టి చెంబుతో 'అయ్యబాబో' యీ పంతులు ఎక్కడ దాపురించాడురా! నా ప్రాణానికి అనుకొని ముందుకు అడుగు వెయ్యలేక తిరిగి యింట్లోకి పోయి మళ్ళా ఇంకో గ్లాసుడు మంచితీర్థం పుచ్చుకుని యీసారి పది నిమిషాలు కూచుని తిరిగి అతిధైర్యంగా బయలుదేరాడు గోపిసెట్టి. ఇంక అట్టే ఆలస్యం చేయకూడదు.

చల్లా లక్ష్మి

టైము అయిపోతుందని జోళ్లు తొడుక్కొని, గభగభా బయలుదేరి వీధిలోకొచ్చి మూడుమెట్లు దిగాడు. రోడ్డుమీద కాలు పెట్టుతూనే వున్నాడు పాపం, వీధి చివరనున్న సోమిదేవమ్మగారు అప్పుడే స్నానం చేసుకొని, వంటవేళ అవుతోంది గదా అనుకొని యింత నిప్పుపిడక మీద పెట్టుకొని, అడవి గోవింద నామాలు వల్లించుకొంటూవస్తూండేసరికి గోపిసెట్టి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి. ముందు అడుగు వేయుటకు అడుగుపడలేదు. ఒళ్లు చల్లబడిపోయింది. కోర్టు మాట జ్ఞాపకం వచ్చేసరికి వళ్లు ఝల్లుమంది. సరే యీ శకునాల మీద కోర్టుకు హాజరైతే ముప్పుతప్పదు. "మేస్ట్రీటు వారికి వేళకి రాలేకపోయినందుకు క్షమాపణ వేడుకోవచ్చును. యీ పూట బయలుదేరితే యిలాగే వచ్చేలావున్నాయి శకునాలు. యీ శకునాలుమీద బయలుదేరడానికి ధైర్యం చాలదు" అనుకొని అర్ధరాత్రి పండ్రెండు గంటలకు బయలుదేరనిశ్చయించుకొనినిశ్చింతగాలోపలకుపోయి, భోజనవగైరాలు ముగించుకొన్నాడు.

రాత్రిరానేవచ్చింది. గోడగడియారం చూచేసరికి తను అనుకున్న పన్నెండు కూడా అవుతూంది. వీధివైపు చూశాడు చీకటి అంధకారం. "మహాబాగుంది యీ అర్ధరాత్రి ఎవరు వచ్చినా తెలియదు"అనుకొని, బయలుదేరేడు గోపిసెట్టి, హాయిగా కులాసాగా మెట్లుదిగి రోడ్డెక్కి రెండే రెండడుగులు వేశాడు "ఎక్కడకు సెట్టి యింతచీకట్లో ప్రయాణం" అని అడిగాడు గోపాలాచార్యులుగారు. ఆయన అరవీశ నాం సున్నం నామాలతోసహా ఎదురై అడిగేటప్పటికి గోపిసెట్టికి మహాకోపం వచ్చింది.

ఏమనడానికివీల్లేదు, ఆచార్యులుగారు! ఇంక చేసేదిలేక "ఎక్కడనుంచి గోపాలాచార్యులుగారూ! యింతరాత్రి వగుర్చుకుంటూ వస్తున్నారు!" అని అడిగాడు గోపిసెట్టి." ఏమిటో సెట్టీ! ఇంట్లో ఎలుకలబాధ చాలా ఎక్కువగావుంది. ఈ సంగతి వీధి చివరి అయ్యారుతో ప్రొద్దున్న చెప్పేటప్పటికి "రాత్రికి రండి రెండు పిల్లుల్ని సంపాదించి ఇస్తాను. మీకు ఎలుకలబాధ వుండ"దన్నాడు. సరే అని పోయి తెచ్చుకుంటున్నాను.అని

(49-వ పేజీ చూడండి)

అని ఆయన వెళ్లిపోయాడు ఇంతసేపూ బ్రాహ్మడు కదలిక లేకుండా ఆయనమాటలు వింటున్నాడు. ఆయన వెళ్లినతర్వాత తెలివివచ్చింది. అప్పటినుంచీ ఆయన "తనకోడలు బెస్తపిల్లే" అన్న విచారం లేకుండా వున్నాడు. భగవంతుడు వ్రాసినది తప్పించుకోలేమనీ, సంతోషంతో అనుభవించాలనీ తెలిసికొన్నాడు. తనకిది చెప్పడానికే భగవంతుడిదంతా జరిగించాడని-భక్తిగా ఆకాశంవైపు ఒక్కనమస్కారం పెట్టాడు. ★

కవి చమత్కారం

పూర్వము అనవేమారెడ్డి, రెడ్డి రాజ్యమును పాలించుచుండెను. అతడు మహాపండితుడు. అతని పాలనలో కవులకు, పండితులకు ఆదరము లభించేది. వారికి అగ్రహారాదిభాగ్యములు ప్రాప్తించేవి. అనవేమారెడ్డి గొప్పదాత. నిరుపేదలైన కవి, పండిత, గాయకులకు విశేషంగా దానం ఇచ్చేవాడు. ఆ మహారాజు ఎంతో ఉదారహృదయుడు. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించేవాడు.

అనవేమారెడ్డి రాజ్యంలో ఒక మహాకవి ఉండేవాడు. అతడు సకల శాస్త్రపురాణములూ చదివినవాడు. గొప్ప పండితుడుకూడా. వేదవేదాంగాది విద్యలను అభ్యసించినవాడు. కవిత్వము చెప్పటలో సాటిలేనివాడు. కాని అతడు పరమదరిద్రుడు. ఎవరినీ యాచించకుండా ఎలాగో కాలక్షేపం చేసేవాడు. అతనిభార్య ప్రతిరోజూ అనవేమారెడ్డిరాజును దర్శించి అతనివలన దారిద్ర్యబాధను వదలించుకోమని చెప్పేది. కాని ఆకవి రాజును దర్శించి కవిత్వం చెప్పినంతమాత్రాన లాభం ఉండదేమో అనే అనుమానంచేత ఊరుకొన్నాడు.

కొంతకాలానికి, కవికి దారిద్ర్యం మరణంకంటె బాధగా తోచింది. భార్య చెప్పినప్రకారం రాజుగారి వద్దకు బయలుదేరి వెళ్ళాడు. అనవేమారెడ్డి కొలువులో రీవిగా కూర్చొనిఉన్నాడు. మంత్రులూ, సామంతులూ, హితులూ, పురోహితులూ అందరూ కొలువులో ఉన్నారు. రాజుగారికి సమీపంలో ఉన్న ఆసనాలమీద పండితులూ, కవులూ కూర్చొనిఉన్నారు. అటువంటి కొలువులోకి కవి ప్రవేశించాడు. కవి హృదయం బాధతో తల్లడిల్లింది. తను చినిగిన బట్టలతో రాజుఎదుట నిలబడలేకపోతున్నాడు. రాజుమాత్రం ఆదరంగా అతనివైపు చూశాడు. కవికి పోయినప్రాణం లేచివచ్చినట్లయింది. రాజుగారికి

వసంతరావు రామకృష్ణరావు

సవినయంగా నమస్కరించి ఈక్రింది శ్లోకాన్ని రాగయుక్తంగా చదివాడు:

శ్లో: అనవేమ మహీపాల!
స్వస్త్యస్తు తవ బాహవే
ఆహవే రిపుదోర్దండ
చంద్రమండల రాహవే!

అనవేమారెడ్డి ఆ కవిని సన్మానింపతలచి మూడు వేల బంగారు నాణాలు ఇచ్చాడు. కవి ఎంతో వినయంగా "ప్రభూ! తమకు పేదవాడినిఅయిన నేను నాలుగు'వే'లు ఇచ్చితిని. అవి శ్లోకములోనే ఇమిడ్చివేశాను. మహాదాతలు మీరు నాకు మూడువేల నాణెములు ఇచ్చుట న్యాయమా!" అని అన్నాడు.

రాజు కవిచమత్కారానికి మెచ్చుకొని నాలుగువేల నాణెములు ఇచ్చెను. కవి వానిని స్వీకరింపక "ప్రభూ! మా ధనము మాకు ఇచ్చుట మడిమాన్యము లిచ్చుట కాదు! అది తమబోటి దాతలకు తగదు" అని మనవిచేసెను. రాజు నవ్వి, అయిదువేల నాణెములు తెప్పించి ఇచ్చెను. ఆకవి వాటిని గ్రహింపక, "మహారాజా! నేను ఆఱువేల నియోగి బ్రాహ్మణుడను. పుట్టినపుడే ఆరువేలు సంపాదించుకొంటిని. అట్టి నాకు అయిదువేల నాణెములు ఇచ్చుట దేవరకు భావ్యముకాదు!" అని విన్నవించెను.

రాజు కవి ప్రదర్శించిన చమత్కారమునకు ఆశ్చర్యపడుచుండెను. అయినను అతనిని పరీక్షించుటకు నిశ్చయించుకొని, ఆరువేల నాణెములు ఇప్పించెను. కవి, వినయముగా రాజుకునమస్కరించి, "దేవా! నా ఆరువేలు నాకు ప్రసాదించితిరి. అంతే. ఇందు మీరుచూపిన వాత్సల్యము ఏమున్నది?" అని పలికెను.

రాజు కవియుక్తికి లోలోన మెచ్చుకొని, అతనికి ఏడువేల నాణెములను సమర్పించెను. అతడు మెల్లగా నవ్వుచు, చేతులుజోడించి, "ప్రభూ! మీరు దయతో ప్రసాదించినది రోదనసంఖ్య అయినది. అట్టి బహుమానమును దాతలని కీర్తిపొందిన మీబోటి ప్రభువులు

ఇచ్చుట తగదు. అంతేకాదు. పరమ దరిద్రుడనైన నాకు అంగీకరించుటకు సమ్మతముగాకున్నది. దాని వలన నా దారిద్ర్యము మరింత ఎక్కువ అగునని భయముకలుగుచున్నది" అని వినయపూర్వకముగా పలికెను.

అనవేమారెడ్డి మారుమాటాడక ఆ కవిచంద్రునికి పదివేల బంగారు నాణెములు, విలువైన చీనిచీనాంబరములు, అనేక మణిమయాభరణములు ఇచ్చి మిక్కిలి సత్కారము చేసెను. కొలువులోనివారు కవి చమత్కారమును మిక్కిలి కొనియాడిరి. నాటినుండి కవి దారిద్ర్య బాధ తొలగిపోయెను, అనవేమారెడ్డి. దానపరత్వము చరిత్రలో నిలచిపోయెను. ★

(శ్రీనాథుని గూర్చిన చాటువులు ఆధారం)

సెట్టి శకునం

(47-వ పేజీ తరువాయి)

చంకలలోని రెండు పిల్లిపిల్లల్ని చూపించేసరికి రెండూ ఒక్కసారి గోపాలాచార్యులు చంకల్లోనించి 'మ్యావ్' మన్నాయి. ఇంక సెట్టి వుండలేకపోయి, "ఆచార్యులు! యీ సెట్టిప్రాణానికి నీవొక్కడవు చాలవు? నీతోడు ఆ రెండు పిల్లులు కూడా ఎందుకూ! నాదేం అంతగట్టి ప్రాణమా?" అని అనేసి యింట్లోకి పోయి, తలుపేసుకు పడుకున్నాడు. రాత్రి నిద్దర్లేదేమో కొంచెం పొద్దెక్కేవరకు లేవలేకపోయాడు. నిద్ర మొహంనుంచే మంచానికి ఇరుప్రక్కల ఇద్దరు పోలీసులు సిద్ధం! గురువారం, గోపిసెట్టి కోర్టుకు హాజరు కాకపోవుటచేత, కోర్టుధిక్కరణ నేరంతో, పోలీసులు కోర్టుకు హాజరు పెట్టడానికి సిద్ధమయ్యారు. పోతేపోయింది, ఈ పోలీసువాళ్లతో పోతేనే నయం! లేకపోతే ప్రాణానికే ముప్పులావుందని కోర్టుకు హాజరైనాడు. కేసుకు రెండునెలలు, కోర్టుకు రానందుకు ఒక్కనెల శిక్షపడింది సెట్టికి. శకున ఫలితం పూరికే పోతుందా? అందుకే మనవాళ్లు మంచిశకునం చూసుకొని బయలుదేర మన్నారు. ★

ప్రేమలేఖ పర్యవసానం

(10-వ పేజీ తరువాయి)

గలమా . ?

ఎందుకు ప్రయత్నించడం.. ?

నీ కళ్లలో, పెదవుల్లో, ముక్కు కొనలో, అంతటా శిల్పాన్ని చూచి, ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ, ఈ ప్రపంచంతో, ప్రకృతితో కట్లు తెంపుకొని, విడని కౌగలితో తేలిపోదామనుకున్న క్షణం కదూ . !! వెదుకుతున్నాగాద్దెనుకు.., ఆ క్షణం తల్చుకుంటే నా హృదయమాగథం లేదు. నేనిక వ్రాయలేను. వెళుతున్నా, మావిడాకులనీడలుపడే, ఆ తెల్లయిసుకమీద నీ గుర్తులేమైనా వుంటాయేమో..,

ఆ సరస్సులో నీ ప్రతిబింబం కనబడుతుందేమో .!,

ఆశగా వెదుతున్నాను.

నీ,

....

"బాగుందా జానకీ ! దాన్ని పత్రికలో లేఖల పోటీకి పంపిద్దామను కొంటున్నాను." కుర్చీలా కూర్చొని లేఖ చదువుతున్న జానకితో అప్పుడే ఆఫీసునుండి వచ్చి, టై ఊడదీస్తున్న కృష్ణమూర్తి అన్నాడు.

అనుమానంతో మలిన మైన అర్ధాంగి జానకి హృదయం, అనురాగంతో నిండి, ఒక నిట్టూర్పు విడిచింది. ★

స్తోత్ర్రర్ష కాదు...

(8-వ పేజీ తరువాయి)

ఆడంగితనమూ మాయమై, మహాపురుషులకు మాత్రమే ఉచితమైన తేజస్స్ఫూర్తి-రాజ శీవి నెలకొన్నవి.

బృహన్నల - ఉహు - అర్జునుడు రథం అధిరోహించి, గాండీవం యొక్క పెట్టి ఒక్కసారి శింజినీ టంకారం చేసినాడు. ఆ ధ్వనికి దిక్కులు దద్దరిల్లటమే కాకుండా స్వయంగా నేనే మూర్ఛపోయినాను!

మూర్ఛనుండి తేరుకొని మెల్లగా లేచి అర్జునునికి భక్తి గౌరవాలతో వంగి నమస్కరించినాను.

ఆయన నాగుబాముపలె శత్రుసేనలోనికి చొచ్చుకొనిపోయినాడు.

స్తోత్కర్ష కాదుగాని, నేనెంతటి అదృష్టవంతుడను కాకపోతే - అంతటి మహావీరునికి సాక్షాత్తు ఇంద్రసుతుడైన అర్జునునికి సారథినికాగలిగిన ధన్యత నాకు కలుగుతుంది! నేనే పాటి వీరుడను! స్వయంగా విల్లుపట్టి యుద్ధం చేయకపోయినా, ఆ మహాసేనామధ్యంలో పగ్గాలు చేతబట్టి-ఆ ప్రచండయోధుని భావము కనిపెట్టి - చిత్రవిచిత్రగతులలో అశ్వములను నడిపించుటలో కూడ ఎంతటి మనస్థైర్యము - నేర్పరితనము కావలె మరి ! ★

బుడుగు టపా

(5-వ పేజీ తరువాయి)

తప్పకుండా వస్తావుకదూ ?

దంతుర్తి సుజాత (హైదరాబాద్)

నేనైతే ఒక్కడూ రావచ్చుకాని, బాబాయిని రానీదుగదా బామ్మ. అది వస్తానూ అంటుంది వాడితో. బామ్మ వస్తే నాన్నని సాయం రమ్మంటుంది. అప్పుడేమో అమ్మ నేనూ వస్తానూ అంటుంది. అప్పుడేమో రైల్లో అందరికీ ప్రెవేటు చెప్పడానికి (లాపోతే చోటు యియ్యరుగా) లావుపాటి పక్కింటి పిన్నిగారుని పట్రావాలిగదా. అప్పుడదేమో వుకేయి లావుపాటి పిన్నిగారు ముగుడూ నువ్వొక్కడూ ఇక్కడెందుకూ, మరేమోనూ నాతో వచ్చెయి సుజాతావాళు పిల్చారూ దామ్మదా, అని వాణ్ణి రైల్లో పెశేస్తుంది. అప్పుడు మేం అంందరం వచేస్తే మీ బామ మా బామ్మ కలిసి నాకు ప్రెవేటు చెప్పేస్తారుగదా. కాని ఓటి బేదరాబంఉంది. మేం అంందరం వసే మళ్ళీ కుకో తియ్యక్కర్లేదు మీ ఊళ్లో. ఇందాకళ కుకోలాగే మీ యింట్లో మేం కూచుంటాంగా. అప్పుడు లావు పాటి పక్కింటి పిన్నిగారు బోల్డు చోటు లాక్కుంటుందనుకో, అప్పుడు బాబాయి తలకాయి ఎగ్గిరి పోతుంది. అప్పుడు బాబాయికి కోపంవచ్చి నన్ను ఎందుకురా పిలిచావు అంటాడు. ఎలా. ఎలా అంటే ఏం చెప్పానో నాకే తెలీటంలేదు అదీ సంగతి. ఈ రాసిపెట్టుతున్నవాడు మళ్లీచదవమన్నా చదవడు.

★

సినిమా

★ పదిరోజులకు ఒకచిత్రం ★

1957 పూర్వార్ధం పూర్తి అయే సరికి విడుదలఅయిన తెలుగు చిత్రాలు 18. (వీటిలో డబ్ చేసినవి నాలుగు. ఇవి ఈ ఏడాది ప్రథమపాదంలోనే విడుదల అయాయి.)

అంటే స్థూలంగా, సగటున పదిరోజులకొక తెలుగు చిత్రం అన్నమాట. చైతన్యవంతమైన పరిశ్రమకు ఇది మంచి లక్షణం. ఈ లెక్కన గతసంవత్సరం (29) కన్న ఈ ఏడాది ఎక్కువ చిత్రాలే తయారవుతాయని ఆశించవచ్చు.

పరిశ్రమదృష్టి అంతా పౌరాణికాల మీదనే ఉన్నట్లు కనబడుతున్నా, ఈ అర్థ సంవత్సరం విడుదలఅయిన చిత్రాలలో సగానికిసగం సాంఘికాలే. మిగతావాటిలో ఐదు జానపదాలు, మూడుపౌరాణికాలూను.

ఆర్థికంగా చెప్పుకోతగ్గ విజయం సాధించినవి వీటిలో (ఇటీవలి వి మినహాయించి) ఐదారు ఉన్నాయి. మిగతావాటిలో ఒకవిధంగా 'దెబ్బతిన్న' చిత్రాలు హీనపక్షం ఐదన్నా ఉంటాయనవచ్చు.

'ఐదు తెలుగు చిత్రాలు' అన్న మాటకు అచ్చతెలుగులో అర్థం. పదిహేను ఇరవై లక్షల రూపాయల ఖర్చు; రెండు మూడు వందలమంది రాత్రింబవళ్ళు పడిన శ్రమ. ప్రతిభగల కళాకారులూ, టెక్నీషియన్లూ కలసి చేసిన కృషి.

ఇదంతా ఎందునా పొందకుండా పోవడం అనేది ఎవరికీ ఆనందకరమైన విషయం కాదు.

వీటిని జనం ఎందుకు విరగబడి చూడలేదు? ఎందుకు డబ్బు కురిపించలేదు?

ఇలా దెబ్బతిన్న చిత్రాలలో కూడా బాక్సాఫీస్ సూత్రాలు అమలుజరుగుతూనే ఉన్నాయి. వాటిని తీసేవారుకూడా మంచీ చెడ్డా ముందూ వెనకా ఆలోచించుకుని, తర్జనభర్జనలు జరిపి, చేయతగు, చేయగల హంగులూ అలంకరణలూ కాయశక్తులా తీర్చి దిద్దుతూనే ఉన్నారు. అయినా కొన్నిటిని జనం ఆదరించి కొన్నిటిని కన్నెత్తి చూడకపోవడానికి కారణం ఏమిటి?

బాక్సాఫీసు సూత్రాలు అన్నీ కలసి అభాసు చేస్తున్నాయా? వీటికి కొందరిమీద కోపమా? ఈ మాటను అపార్థం చేసుకోనవసరం లేదు. ఇదేం అశ్లీల పదం కాదు. ఈ సూత్రాల కూర్పులో కూడా తగిననేర్పు లేకపోతే, ఇన్నీ ఉన్నా వృథాఅవుతుందనిపిస్తుంది. అదీ ఒక గొప్ప కళే. వేలాది జనాన్ని ఆకర్షించి, ఆనందింపచేసి కులాసాగా ఇంటికి పంపించడం వేళాకోళం కాదు. అదేముఖ్యం.

మరి సినీమా సృష్ట్యాదినుండీ చెలామణీలో ఉన్న ఈ సూత్రావళి ఎప్పటికప్పుడు టోకరాఇవ్వడం ఎందుకు జరుగుతున్నట్టు?

తయారైన చిత్రాలనూ, వాటిలోని సూత్రాలనూ, వాటి జయాపజయాలనూ పరిశీలించి, రెండూ రెండూ గుణించి చూసుకుంటే, అన్ని హంగులూ ఉన్నా, కథలో బలం లేకపోతే, ప్రేక్షకులను ఆకర్షించే అంశం లేకపోతే సత్ఫలితాలు లభ్యం

(56-వ పేజీ చూడండి)



సాధనా వారి "సంకల్పం" లో కుసుమకుమారి

సినిమా వార్తలు

ఈ ఏడాది అర్థభాగం పూర్తి అయేసరికి 18 చిత్రాలు విడుదలఅయ్యాయి. ఇపుడు నిర్మాణంలోఉన్నవి 22 ఇవికాక మరో ఐదారు చిత్రాలు త్వరలోనే సెట్స్‌పైకు వెళ్ళబోతున్నాయి.

అక్కచెల్లెళ్ళు

శర్వాణీవారి సాంఘికచిత్రం 'అక్కచెల్లెళ్లు' చాలవరకు పూర్తి అయింది. జూలై నెలాఖరులోగా విడుదల కావచ్చు ననుకుంటున్నారు ఇందులో అమర్ నాథ్, కృష్ణకుమారి, శ్రీరంజని, సూర్యాకాంతం, లక్ష్మీకాంత, వంగర, రమణారెడ్డి నటిస్తున్నారు. కథ అనంత్, మాటలూ పాటలూ శ్రీశ్రీ, ఆరుద్ర; సంగీతం పెండ్యాల. దర్శకులు పార్వభౌమ, అమానుల్లా.

అప్పుచేసి పప్పుకూడు

విజయవారి కొత్తచిత్రం "అప్పుచేసిపప్పుకూడు"కు నెలకు 20 రోజులు ఏకటాకీన షూటింగ్ సాగుతోంది. సావిత్రి, ఎన్. టి. రామారావు, రంగారావు, సి. ఎస్. ఆర్, రేలంగి, శివరావు నటిస్తున్నారు. కథ సదాశివ బ్రహ్మం.

సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వర రావు దర్శకుడు ప్రసాద్.

"ఆడపెత్తనం"

ప్రభా ప్రొడక్షన్స్‌వారి సాంఘిక చిత్రం. నాగేశ్వరరావు, అంజలి, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి, అమ్మాజీ, సూర్యకాంతం ప్రభృతులు నటిస్తున్నారు. రచన పినిశెట్టి. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు.

ఇంటిగుట్టు

సంగీతాప్రొడక్షన్స్‌వారి తొలికానుక 'ఇంటిగుట్టు' ఆరురీళ్లవరకూ తయారైంది. రామారావు, గుమ్మడి, సావిత్రి, సూర్యకాంతం మొదలగువారు పాల్గొంటున్నారు. నిర్మాత ఎం. ఎస్. ప్రకాష్ సంగీతం సమకూర్చుతున్నారు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

కార్తవరాయుడి కథ

ఆర్. ఆర్. పిక్చర్సు వారి 'కార్తవరాయుడికథ' నిర్మాణం చాలవరకు పూర్తి అయింది. నటవర్గం: రామారావు, ముక్కామల, బాలకృష్ణ పద్మనాభం, బి. ఎస్. సరోజ, గిరిజ. రచనముద్దిపట్లనూరి దర్శకుడు రామన్న. అసోసియేట్ ఐ. ఎస్. మూర్తి.



ఎఫ్. సి. మెహ్రా నిర్మిస్తున్న చిత్రం "ముజ్రిం" లో రాగిణి.

సినిమా వార్తలు

ఈచిత్రం తమిళంలోకూడా తయారవుతోంది.

కృష్ణమాయ

శ్రీ రాజరాజేశ్వరీవారి "కృష్ణమాయ." నాగేశ్వరరావు, జమున నటిస్తున్నారు రచన రావూరి సత్యనారాయణ. దర్శకుడు కడారు నాగభూషణం.

కృష్ణగారడి

నందీపిక్చర్సువారి చిత్రం. నటవర్గం: జగ్గయ్య, రేవతి, ప్రియదర్శిని, ఎ. వి. సుబ్బారావు. దర్శకుడు వై. వి. రావు. నిర్మాణం పూర్తికావచ్చింది.

'కృష్ణలీల'

రాజ్యంపిక్చర్స ("హరిశ్చంద్ర") వారి కొత్తచిత్రం 'కృష్ణలీల' నిర్మాణం ఇటీవలే ప్రారంభమైంది దర్శకుడు సి. పుల్లయ్య.

గంగాగౌరీసంవాదం

విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి తొలి కానుక. "గంగాగౌరీసంవాదం" షూటింగ్ మొన్ననే ప్రారంభం అయింది. నాగయ్య, నారాయణరావు, రమణారెడ్డి, కాంతారావు, కృష్ణకుమారి, ఋష్యేంద్రమణి, నటిస్తున్నారు. రచన పరశురాం, సంగీతం పెండ్యాల, దర్శకుడు వి. ఎస్. రెడ్డి.

'జయభేరి'

శారదా ప్రొడక్షన్స్‌వారి "జయభేరి" నిర్మాణం పి. పుల్లయ్య దర్శకత్వాన చురుకుగా సాగుతోంది. అంజలి, నాగేశ్వరరావు, నాగయ్య ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు. రచన.ఆత్రేయ, మల్లాది రామకృష్ణశాస్త్రి.

పాండురంగ మాహాత్మ్యం

నేషనల్ ఆర్ట్ థియేటర్స్‌వారి పౌరాణికం "పాండురంగ మాహాత్మ్యం" కమలాకర కామేశ్వరరావు దర్శకత్వాన తయారవుతోంది. రామారావు, బి. సరోజ, శివరావు నటిస్తున్నారు. రచన. సముద్రాల జూనియర్. సంగీతం: టి. వి. రాజు.

'భలే అమ్మాయిలు'

నరసూవారి కొత్తసాంఘికం "భలే అమ్మాయిలు" ఆగస్టు రెండోవారంలో విడుదల అవుతుంది. సావిత్రి, గిరిజ, రామారావు, జగ్గయ్య, రేలంగి పాల్గొంటున్నారు. రచన: సదాశివబ్రహ్మం. సంగీతం. రాజేశ్వరరావు, దర్శకుడు. వేదాంతం రాఘవయ్య

భూకైలాస్

ఎ. వి. ఎం.వారి 'భూకైలాస్' చిత్రంలో జమున, బి.సరోజ, రావణుడుగా రామారావు, నారదుడుగా నాగేశ్వరరావు, నటిస్తున్నారు దర్శకుడు శంకర్.

రత్నకిరీటం

సిల్వకోటీ పిక్చర్స వారి కొత్తచిత్రం. సావిత్రి, కన్నాంబ, నాగయ్య, ఆర్. నాగేశ్వరరావు పాల్గొంటున్నారు. దర్శకుడు యోగానంద్.

సంగీత దర్శకుడు రమేష్ నాయుడు.

రాజనందిని

జలరుహావారి 'రాజనందిని' లో రామారావు, ఆర్. నాగేశ్వరరావు జి. వరలక్ష్మి, గిరిజ, నటిస్తున్నారు. రచన మల్లాది రామకృష్ణశాస్త్రి. సంగీతం టి. వి. రాజు. దర్శకత్వం వేదాంతం రాఘవయ్య.

రామదాసు

వి. ఎస్. ఫిలింస్ వారి చిత్రం. సగమువరకూ పూర్తి అయింది.

నటవర్గం: నాగయ్య, లింగమూర్తి ఎ. వి. సుబ్బారావు, సూర్యకుమారి, కన్నాంబ, ఋష్యేంద్రమణి, సూర్యచంద్రరావు. రచన యడవల్లి, పర్యవేక్షణసముద్రాల. దర్శకుడు నాగయ్య ఇందులో కబీర్ భజనపాటలను మహమద్ రఫీ పాడారు. వాటికి అశ్వత్థామ సంగీతం కూర్చారు.

రైతురాజు

విక్రం ప్రొడక్షన్స్‌వారి కొత్తచిత్రం



ప్రతిభావారి "దొంగలున్నారు జాగ్రత్తలో నర్తకి లలితారావు, చదలవాడ, రాజనాల, బాలకృష్ణ, సి. ఎస్. ఆర్.

'రైతురాజు' షూటింగ్ జూన్ మూడున ఆరంభించారు. ఇప్పటికి మూడు సెట్స్‌పై పని పూర్తి అయింది. ఇందులో సావిత్రి, రామారావు, బాలకృష్ణ, పద్మనాభం నటిస్తున్నారు. రచన అనిసెట్టి సుబ్బారావు. సంగీతం: విశ్వనాథం, రామమూర్తి. దర్శకుడు బి. ఎస్. రంగా.

'శోభ'

పొన్నలూరుబ్రదర్స్‌వారి ద్వితీయ చిత్రం. అంజలి, రామారావు, రాజసులోచన, ముక్కామల, రేలంగి నటిస్తున్నారు. రచన డి. వి. నరసరాజు. సంగీతం ఎ. ఎం. రాజా. దర్శకుడు కమలాకర కామేశ్వరరావు.

సతీ అనసూయ

రాజశ్రీవారి పౌరాణికచిత్రం "సతీ అనసూయ" కడారు నాగభూషణంగారి దర్శకత్వాన తయారవుతోంది. అంజలి, జమున, సూర్యకళ అమర్‌నాథ్, ముక్కామల, కాంతారావు, నారదుడుగా పద్మనాభం నటిస్తున్నారు.

సారంగధర

మినర్వా పిక్చర్స్‌వారి "సారంగధర" చిత్ర నిర్మాణం పూర్తి కావచ్చింది. ఆగస్టు రెండో వారంలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. భానుమతి, రాజసులోచన, రామారావు, రంగారావు, రేలంగి, గుమ్మడి, ముక్కామల, చలం, మిక్కిలినేని, నటిస్తున్నారు. రచన సముద్రాల రాఘవాచార్య. దర్శకుడు రాఘవన్.

వద్దంటే పెళ్లి

విఠల్ ప్రొడక్షన్స్‌వారి సాంఘిక చిత్రం. కృష్ణకుమారి, శ్రీరంజని, చలం, సి. ఎస్. ఆర్. రమణారెడ్డి నటిస్తున్నారు. రచన రామచంద్, జి. కె. మూర్తి. దర్శకుడు విఠలాచార్య. ఇది జులై మూడో వారంలో విడుదలకావచ్చునంటున్నారు.

దొంగలున్నారు జాగ్రత్త

ప్రతిభావారి కొత్త చిత్రం. జగ్గయ్య, గిరిజ, సి. ఎస్. ఆర్, నటిస్తున్నారు. రచన ఆత్రేయ. దర్శకుడు బి. ఎస్. ఆర్.

వినాయకచవితి

అశ్వరాజ్ వారి పౌరాణిక చిత్రం. జమున, రామారావు, గుమ్మడి, ఆర్. నాగేశ్వరరావు, రాజనాల నటిస్తున్నారు. రచన, దర్శకత్వం సముద్రాల రాఘవాచార్య.



శర్వాణీవారి "అక్కాచెల్లెళ్లు" చిత్రంలో వంగర, సూర్యాకాంతం.

ప్రముఖ సంగీత దర్శకుడు ఓగిరాలమృతి

ప్రముఖ చలనచిత్ర సంగీతదర్శకుడు ఓగిరాల రామచంద్రరావుగారు జూన్ 17 సాయంత్రం, శీతజ్వరంవల్ల హఠాత్తుగా మరణించారని తెలుపుటకు చింతిస్తున్నాము. ఆయన కొంతకాలంగా ఉబ్బసం వ్యాధితో తీసుకుంటూవచ్చారు. హఠాత్తుగా శీతజ్వరం సోకి, ఉధృతమై మరణించారు.

20 ఏళ్లుగా రామచంద్రరావుగారు సంగీతప్రియుల గౌరవాభిమానాలు చూరగొంటూ అనేకచిత్రాలకు పనిచేశారు. సంగీత దర్శకుడుగానే కాక వ్యక్తిగా మిత్రుడుగా ఆయన సర్వత్రా మన్నన లందుకున్నారు.

మరణవార్త వినగానే రామచంద్రరావుగారి మిత్రులు ఆత్మీయులు అయిన వి. నాగయ్య, ఘంటసాల వెంకటేశ్వరరావు, టి. వి. రాజు, పెండ్యాల నాగేశ్వరరావు, చలపతిరావు, డి. ఎల్. నారాయణ, పి. శేషాచలంశెట్టి, ప్రతిభాశాస్త్రి, ఇంటూరి వెంకటేశ్వరరావు ప్రభృతులంతా వారి ఇంటికి వెళ్ళి భార్యా బిడ్డలకు సానుభూతి తెలియచేశారు.

పదిహేను, ఇరవై ఏళ్ళనాడు రామచంద్రరావుగారు హెచ్. ఎం. వి., ఓడియన్, హచిన్స్ గ్రామఫోన్ కంపెనీలలో సంగీత దర్శకుడుగా పనిచేశారు. అంతకుముందు కొంతకాలం మైలవరం నాటకసమాజంలో హార్మోనిస్టుగా పనిచేశారు.

చలనచిత్ర రంగంలో ప్రవేశించిన తరువాత నేటివరకు దాదాపు పాతిక చిత్రాలకు సంగీతం కూర్చారు.

తెలుగు చిత్రాలలో పదహారణాల తెలుగు సంగీతం వినిపించాలనే పట్టుదల ఉన్నవారిలో ఆయన ఒకరు. మరణకాలం నాటికి ఆయన సంగీతం సమకూర్చుతున్న చిత్రాలు ఐదు ఉన్నాయి.

"రామదాసు సంగీత దర్శకత్వంలో నాకుడిభుజంగా ఉంటూ వచ్చిన ఓగిరాలను కోల్పోవడం నా దురదృష్టం" అన్నారు నాగయ్య, తమ మిత్రుని మృతికి పరితపిస్తూ. ★

ఇవికాక త్వరలోనే భారతీ ప్రొడక్షన్స్‌వారి 'బభ్రువాహన' (దర్శకుడు సముద్రాల) విశ్వరూపా పిక్చర్స్‌వారి తొలిచిత్రం (దర్శకుడు శోభనాద్రిరావు), సెట్స్‌కు వెళ్లిపోతున్నాయి. ★

★ ముడిఫిలింకోటా పద్ధతి ★

శ్రీ కె. వి. రెడ్డి విమర్శ

ఫిలింపరిశ్రమ భవిష్యత్తుఅంతా ముడిఫిలిం సరఫరాతో ముడిపెట్టుకుని ఉంటుం దన్నసంగతి మరువకూడదు. అందులోనూ ఆ ఫిలింసరఫరా వ్యవహారాలు చూచేవారు అసలు మరువరాదు. ఎందుకంటే పరిశ్రమకు ముడిఫిలిం ప్రాతిపదిక. అది లేకపోతే కథే లేదు.

అయినా భారతప్రభుత్వం, విదేశీద్రవ్య నిల్వల పొదుపుపేరిట దిగుమతులను తగ్గించ సంకల్పించినపుడు ఫిలింవాడకానికి విశేష ప్రాధాన్యంఇచ్చి కోటాలై సెన్సు పద్ధతి ప్రవేశపెట్ట నిశ్చయించింది.

ఉన్నపరిస్థితులలో ఈ ఊహ మంచి దయితే కావచ్చు కాని, దాని పర్యవసానాలు ఎలాటివో సమగ్రంగా ఆలోచించకుండా పరిశ్రమప్రతినిధులతో సంప్రదించకుండా నిర్ణయం ప్రకటించడం జరిగింది.

"ఇది చాలా శోచనీయమైనవిషయం" అన్నారు ప్రముఖ దక్షిణభారత చలనచిత్ర దర్శకుడు శ్రీ కె. వి. రెడ్డి, ఈ విషయమై మాట్లాడుతూ దీనివల్ల, నిర్మాణంలోఉన్న అనేకచిత్రాలకు ఫిలింసరఫరా ఇబ్బందిఅవుతుంది. బ్లాక్ మార్కెట్ పుంజుకుంటుంది. దాని పర్యవసానాలు ఎలాఉంటాయో చెప్పలేము అని ఆయన అన్నారు.

ఫిలింనిర్మాతలు ముడిఫిలింను మరీ దుబారాగా వాడేస్తున్నారని కేంద్రమంత్రి శ్రీ మురార్జీదేశాయ్ చేసినవిమర్శ సబబు కాదని శ్రీ రెడ్డి అన్నారు.

"సహేతుకంగా ఆలోచిస్తే చాలు. దీనికి కారణాలు వెతకక్కరలేదు. నిర్మాత వాడే ప్రతిఅడుగు ఫిలిముకూ విచ్చురూపాయలు అచ్చుకోవాలి. అటువంటపుడు, అత్యవసరం అయితేకాని ఏనిర్మాతా—ఎంతడబ్బున్నవాడయినా—అలా ఫిలిమును వృధాచేస్తాడనుకోవడం పొరపాటు. ఇది కళేకాదు. వ్యాపారంకూడా. అందువల్ల ఈపరిశ్రమ పరిశ్రమలో ఉన్న ప్రతివ్యక్తీ పదిసార్లు ఆలోచించనిదే పదికొన్ను కర్చుపెట్టడు" అని రెడ్డిగారు విశదపరచారు.

"బాధ్యతగల పెద్దలు ఇటువంటి విమర్శ చేసినపుడు, ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ వారు వాడే ప్రతిఅడుగు ఫిలిమూ సద్వినియోగం అవుతున్నదా అన్నప్రశ్న ఎదురవుతుంది. ఫిలింను వృధాచేయడానికి ఈరెండు రంగాలలోను ఎక్కడ ఎక్కువ అవకాశాలు ఉన్నాయీ అన్నప్రశ్నకి జవాబు ఆలోచించవలసివస్తుంది. హేతువాదంమాట అలాఉండగా గత రెండుమూడేళ్లలోనూ ఫిలింపరిశ్రమ ఎంత ఫిలిమును వాడిందీ, ఫిలింస్ డివిజన్ ఎంతవాడిందీ అని లెక్కలు తీసి బేరీజు వేసి ఆలోచిస్తే బరువు అటే తూగినట్టు తెలుతోంది" అని ఆయన వివరించారు.

ప్రభుత్వానికి ఇందులో పొదుపుచెయ్యాలని సంకల్పంఉంటే ఆ సంగతి ఫిలిం పరిశ్రమ ప్రతినిధులతో సంప్రతించి, మంచిచెడ్డలూ, సాధకబాధకాలూ సమగ్రంగా పరిశీలించి, క్రమపద్ధతిలో అందుకు ప్రయత్నాలు చేయవలసింది. హఠాత్తుగా చిత్రం పోకుగు పది పన్నెండువేలకు మించడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడితే, లక్షల పెట్టుబడి తిరిగే ఈ పరిశ్రమ ఎలా తట్టుకుంటుంది? మన ప్రజలు, వారి తీరుతెన్నులు, అభిరుచులూ, పరిశ్రమ స్థితిగతులూ వీటన్నిటినీ, ఒక్క నిర్ణయంతో త్రోసిరాజనడం భావ్యంకాదు. పరిశ్రమకది శ్రేయస్కరం కాదు. అని ఆయన అన్నారు.

మద్రాసులో పలువురు నిర్మాతలూ, దర్శకులూ, పరిశ్రమ స్వరూప స్వభావాలూ, దానిపైగల ప్రభావాలూ ఆకళించుకున్నవారూ ఇదే అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు.

బొంబాయిలో ఫిలింప్రముఖులంతా కూడా ఈ విషయమై చర్చలు జరిపారు.

ప్రభుత్వం బహుశా వీరితో సంప్రతింపులు జరుపవచ్చునని తెలుస్తోంది. ★



విశాఖ నాటకకళామండలివారి టీవల ప్రదర్శించిన "తిరస్కృతి" (లేక 'వచ్చేకాలం') అనే నాటకంలో దుగ్గిరాల సోమేశ్వరరావు (శేఖరం) కుచ్చర్లపాటి గోపాలరాజు (మోహన్). నాటకం రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి.



చంద్రాఫిలింస్‌వారి "సాల్వాఁ సాల్" చిత్రంలో దేవానంద్.

బొంబాయి సినిమా లేఖ

50 లక్షల రూపాయలు ఆదా చెయ్యడం కోసం, ముడిఫిలిం దిగుమతికి కోటా లైసెన్సింగ్ పద్ధతి ప్రవేశపెట్టాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం పరిశ్రమలో పెద్ద సంచలనం, ఆందోళన కలిగించింది.

పరిశ్రమ మనుగడకే ముఖ్యమైన ముడి సరుకుకు ఇలాంటి అవస్థ పట్టింది ఈ ఫిలిం పరిశ్రమ ఒక్కదానికేనని ఫిలిం వ్యాపార వర్గాలవారు అన్నారు.

ముప్పావలా కోడిపిల్లకు జబ్బు చేసిందని మూడున్నర పందిపిల్లను తెచ్చి దిష్టితీసినట్టుగా, విదేశీద్రవ్యంలో అరకోటి రూపాయలు పొదుపుచెయ్యడానికి ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యంవల్ల పరిశ్రమకు ఐదుకోట్లవరకూ నష్టం వాటిల్లుతుందని ఫిలిం ఫెడరేషన్ ప్రతినిధులు అన్నారు. ఫిలిం సరఫరా సాఫీగా లేకపోతే, నిర్మించే చిత్రాల సంఖ్య తగ్గిపోతుందనీ తత్ఫలితంగా ఎందరో ఉద్యోగాలు కోల్పోయి అవస్థపడవలసి ఉంటుందని వారు అన్నారు. పెరుగుతున్న ఈ పరిశ్రమకోసం అని ఛాయా, శబ్దగ్రహణ యంత్ర పరికరాల ఉత్పత్తికి తలపెట్టిన ప్రాజెక్టులు కూడా మూలపడతాయి. విదేశాలలో మన చిత్రాల ప్రదర్శనద్వారా గడించే డబ్బుకూడా తగ్గుతుంది.

తడబడి, మెల్లిగా ముందుకు నడుస్తున్న ఫిలిం పరిశ్రమ కథ తారుమారు అయే ప్రమాదం ఉందనీ, కోటాలపద్ధతివల్ల, యుద్ధకాలంలో చెలరేగిన దురాచారాలు మళ్ళీ చెలరేగడం, ఇప్పటికే అనేకులకు 'బ్లాక్' మనీ ఇచ్చుకోలేక అవస్థపడుతున్న నిర్మాతలు ఇటుపై ఫిలింకుకూడా ముడుపు చెల్లించుకోలేక మరింత అవస్థపడడం సంభవిస్తాయనీ, కాగా, నాలుగైదువిధాల ప్రయత్నించి కొత్త కొత్త మార్గాలు అవలంభించడానికి ఇటుపై స్వేచ్ఛ ఉండక, సృజనాత్మకశక్తికి వ్యక్తి చెప్పడం, చివరకు చిత్రాల స్థాయి దిగజారడం కూడా సంభవమనీ బాధ్యతగలవారంతా ఆందోళనచెందుతున్నారు.

* * *

36 చిత్రాల నిర్మాణ పథకం

ఫిలింస్థాన్‌వారు వచ్చే 12 నెలల్లో 36 చిత్రాలు నిర్మించడానికి కట్టుదిట్టమైన పథకం వేసుకున్నారు. ఆ సంస్థ మానేజింగ్ డైరక్టరు శ్రీ తులారాం జలాన్ ఈ విషయం ప్రకటిస్తూ వాటిలో హిందీ [illegible] చిత్రాలు [illegible]ండేసి, పంజాబీవి ఎనిమిది, గుజరాతీ [illegible]లు నాలుగూ ఉంటాయన్నారు. వీటిలో కొత్తనటీనటులకు దర్శకులకు, రచయితలకు, సంగీతదర్శకులకు, ఇతర టెక్నిషియన్లకూ అవకాశంఇవ్వ సంకల్పించినట్లు ఆయన తెలియచేశారు. కొత్తవారు వస్తే, వారికి శక్తిసామర్థ్యాలను తెలుసుకుని అవకాశమివ్వడానికి తాను సర్వదా సిద్ధమని ఆయనచెప్పారు.

ఫిలింస్థాన్ సంస్థకు "ఆస్థాన దర్శకులు" ఎవరు అని అడిగితే మహేష్‌కౌల్, సుబోధ్ ముఖర్జీ, నసీర్ ఖాన్, దత్తా ధర్మాధికారి, చతుర్భుజ్ దోషి, రామన్ దేశాయి అని ఆయన చెప్పారు.

నిర్మాణంలో ఉన్న చిత్రాలు

షోకిల్లీటోకరారాయుడు పాత్రలుధరించి అభిమాన పాత్రుడుఅయిన దేవానంద్, ఇపుడుమండీబర్మన్ కొత్తచిత్రం "మంజిల్" లో కొత్తరకం వేషం వేస్తున్నాడు. ఇందులో అతడుకాస్త గంభీరంగాఉంటే సంగీతదర్శకుడు. స్వతహాగా, దేవ్‌కు శాస్త్రీయసంగీతం అంటే చాలాఅభిమానం. రెండుమూడు వాయిద్యాలుకూడా నేర్చుకున్నాడు. ఆరంగంలోఉన్న ప్రతిభనుకూడా ప్రదర్శించడానికి ఈసారి అవకాశం కలిగింది. "మంజిల్" చిత్రంలో అతడినాయిక నూతన్.

సంగీతదర్శకుడు శచిన్‌దేవ బర్మన్.

హౌరాబ్రిడ్జ్

దర్శక నిర్మాత శక్తి సమంత్, తన కొత్త చిత్రం "హౌరాబ్రిడ్జ్" కథాస్థలం కలకత్తాలో ఇటీవల కొన్ని ఔట్ డోర్ దృశ్యాలు చిత్రించారు. దొంగల ముఠా చాకచక్యాన్ని చూపే ఆ సన్నివేశాలు చిత్రిస్తూఉంటే, అక్కడి "ఉత్సాహవంతులు" కొందర్ని, దర్శకుడి కెమేరాను కాజేసి చక్కాపోయారు. ఈ కథలో అశోక్‌కుమార్ నాయకుడు. అతను, తన తండ్రిని వధించినవాడిపై పగతీర్చుకోడానికి రంగూన్‌నుండి కలకత్తా వస్తాడు. అక్కడ మధుబాలవంటిపిల్ల కనబడి, అతగాడి సిగరెట్లు చెక్కేసి ఊదేస్తూఉంటుంది. ఆశ్చర్యపడి అతను ఆమెవెంటపడతాడు. చివరికిద్దరూ కలిసి హంతకుడి పరిచయభాగ్యం లభ్యంచేసుకుని, ఆనక అతడికి పోలీసులతో పరిచయం చేస్తారు.

దుష్మన్

క్వాత్రా ఫిలింస్‌వారి 'దుష్మన్' నిర్మాణం ఈ నెలాఖరువాటికి పూర్తి అవుతుంది. ఇందులో దేవానంద్, ఉషాకిరణ్ నటిస్తున్నారు. రచన పండిట్ ముఖ్‌రాం శర్మ. దర్శకుడు రాజ్ ఋషి.



బి. ఆర్. చోప్రా చిత్రం "నయా దౌర్"లో వైజయంతిమాల.

మాలిక్

సున్నీ, నౌషాద్‌లు కలసి సున్నీఆర్ట్ ప్రొడక్షన్స్ ("ఉరన్‌ఖటోలా") పేరిట "మాలిక్" అనేచిత్రం నిర్మిస్తున్నారు. నాయకీనాయకులు సురయా, తలత్ మహమూద్, జీవన్, రాధాకిషన్, లలితాపావర్ ప్రభృతులు కూడా ఉన్నారు. సంగీత దర్శకుడు ఘులాంమహమద్. ఈచిత్రం త్వరలోనే విడుదల కాబోతుంది.

బాలయోగి

ఉపమన్యుడనే శివభక్తుడికథను తీసుకొని ప్రకాష్ పిక్చర్స్‌వారు "బాలయోగి" చిత్రం నిర్మిస్తున్నారు. సులోచన, వర్తకి చంద్రకాంత, వినోద్, జీవన్, మదన్‌పూరి, లలితాపావర్ నటిస్తున్నారు. సంగీత దర్శకుడు చిత్రగుప్త.

"ఝనక్ ఝనక్ పాయల్ బాజే" లో నృత్యంచేసిన "చంద్రకాంత నృత్యాలు ఇందులో విశేషాకర్షణ. వీరి తరువాతి చిత్రం "గూంజ్ ఉఠీ షెహనాయ్"లోకూడా ఈమె మంచిభూమిక నిర్వహిస్తుంది. ఆ చిత్రానికి విజయ్ ("బైజుబావ్రా") భట్ దర్శకత్వం నిర్వహిస్తారు.

* * *

దర్శక నిర్మాత ఎం. వి. రామన్, "ఝనక్ ఝనక్" చిత్రం నాయిక సంధ్యను వరుసగా రెండు మూడు చిత్రాలకు బుక్ చేశారు. వాటిలో ఒకటి వర్ణచిత్రం అని తెలుస్తోంది.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



"ఆగ్రారోడ్"చిత్రంలో విజయ్ఆనంద్, కృష్ణకాంత్, షకీలా.

పదిరోజులకు ఒక చిత్రం

(50-వ పేజీ తరువాయి)

కావడం అనుమానాస్పదమని తేలుతోంది.

కథకు ఒక సమగ్రస్వరూపం ఉండాలి. పటుత్వం ఉండాలి. గమనంలో వేగం, ధాటీ ఉండాలి. ఒలికియిపోన నీరులా, కథ పదివిధాల పరుగులెత్త కూడదు. దానికి ఒక ప్రయోజనం ఉండాలి. ఆధునిక జీవితానికి దగ్గరగా ఉండాలి.

అయితే, మన చలనచిత్రకారులకు ఈ పాటి ధర్మసూత్రాలు తెలియవని కాదు. ప్రతి నిర్మాతా, దర్శకుడు, కథను ఎన్నుకోవడంలో వెయ్యిందాల ఆలోచిస్తాడు తోటివారితో చర్చిస్తాడు. పాటివారితో సంప్రతిస్తాడు. పైన చెప్పిన గుణగణాలన్నీ స్థూలంగా ఉండే ఏర్పాట్లే చేసుకుంటాడు.

అయినా, చివరికి ఏమవుతోంది? ఎంత బలంగల కథఅయినా చలనచిత్రంగా తయారయేసరికి జావగారిపోతోంది, 'పేలవం'అనిపించుకుంటోంది. వందల్ల సంవత్సరాలు తిరిగినా పసివాడని కథలు కూడా, భీభత్సంగా తయారయిపోతున్నాయి. దీనికి కారణం ముందు అనుకున్న కథలను ఫిలిం తీసినపుడు విపరీతంగా సాగతీయడం. పదిహేడు పద్దెనిమిది వేల అడుగుల పొడుగైనా లేందే, చిత్రం నెగ్గుకురావడం కష్టమని సర్వత్రా ఒక అభిప్రాయం ఉంది అందువల్ల ఎంత మంచికథఅయినా,అంతపొడుగూ సాగవలసిందే. ఆ మంచికథ కాస్త చిన్నది అయితే, దానిఅవస్థ చెప్పనక్కర లేదు. ఇప్పుడు చాలా చిత్రాలలో చిక్కి 'ఇదే నాలుగైదు మంచిపాటలూ, రెండు మూడు నృత్యాలూ చూపించినప్పటికీ అది ఏ 14 వేల అడుగుల దగ్గరో ఆగిపోతుంది. ఇంకా మూడు వేలు కావాలి. వాటికోసంఅని, ఏవో సంఘటనలు కల్పించి, వాటిని సమర్థించడానికి మరికొన్ని కల్పించి, వీటన్నిటికీ చోటు చెయ్యడంకోసం కథలో కొన్ని మార్పులు చేసి కోతలు పెట్టి అతుకులు వేసి సర్దుకు రావడం జరుగుతున్నట్టు కనబడుతుంది.

ఈ వైద్యం (సినిమా పరిభాషలో ట్రీట్‌మెంట్) యావత్తు పూర్తి అయ్యేసరికి, ముందర అనుకున్న మంచికథకు ఇప్పుడు రూపు తేలిన 'చిత్రగాథకూ' ఏదో దూరపు చుట్టరికం—వేలువిడచిన మేనమామ తోడల్లుడి బావమరిదిలాంటిది—మాత్రమే మిగులుతుంది.

చివరకు ఈ కథ స్వరూపాన్ని బట్టే మిగతా విభాగాల మంచిచెడ్డలూ తేలుతున్నాయి. కథనుబట్టే అందులో పాత్రల రూపకల్పనకూడా స్ఫుటంగానో,రూపరేఖా రహితంగానో తేలుతుంది దాన్నిబట్టే నటీనటుల కృషి ఫలప్రదాయకమో నిష్ఫలదాయకమో అవుతుంది. సమర్థులైన నటీనటులు ఒకసారి బాగా నటించి ఇంకోసారి బాగా నటించలేకపోవడం అనేది అర్థరహితం. సమర్థుడు ఎప్పుడూ సమర్థుడే. ఎటొచ్చీ ఆ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాలు ఉండాలి. ప్రతిభ చూపడానికి తగినఅవకాశాలు ఉండాలి. దర్శకత్వానికి కూడా ఇదేమాట చెప్పుకోవాలి.

పదేసిరోజుల కొకటిచొప్పున విడుదల అయే ఇన్ని చిత్రాలలో, బహు కొద్దిమంది నటీనటుల సహాయంతో కొత్తదనం చూపిస్తూ కొత్త రుచులుచూపిస్తూ కథలుచెప్పాలంటే ఆ చెప్పే కథలలో వైవిధ్యం ఉండడం చాలా అవసరం. అయితే ఈ నాడు అదే లోపిస్తోంది. ఏజాతి చిత్రాల కథ అయినా, ఐతే పాతదీ, లేదా పాతదానికి అనుకరణ.

తోటలో పాటతో మొదలుపెట్టి, పాత గాడీలోనే పదిహేడు వేల అడుగులూ సాగి అందరికీ తెలిసిన అడగిచేరడం పరిపాటి అవుతోంది.

ఈ కాస్తలోనే ఏ కాస్త కొత్తదనం చూపించినవే విజయవంతం అవుతున్నాయన్న నిజాన్ని విజయవంతమైన చిత్రాల చరిత్ర చెబుతోంది. కొత్తదనం' అంటే కెమేరాని చిత్రవిచిత్ర గతుల పరుగెత్తించి రకరకాల కోణాల్లో బొమ్మలు తియ్యాలని కాదు; కోయడాన్సుల బదులు కొండముచ్చుల గారడీలు పెట్టాలనీ కాదు.

జీవితాన్ని చూడడంలో; చూపడంలో రావాలి. దానికి తీసుకున్న కథను 'బాక్సాఫీసు సూత్రాల' పేరిట నిష్కారణంగా సాగదీసి దానికి ఉన్న జవసత్వాలు హరించివేయకుండా రక్తికట్టేలా చెప్పడంలో అందులో పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసి, చూడవచ్చినవారికి వాటిని సన్నిహితం చేయడంలో కట్టుదిట్టమైన పద్ధతులు కావాలి.

ఇవి సాధించాలంటే ఫిలిం 18 వేల అడుగుల పొడుగు ఉండాలన్న ధర్మసూత్రాన్ని కాస్త సడలించాలి. అది జరిగిననాడు, దర్శకుడికి, కథను ఎలా సాగతియ్యాలన్న సమస్య ఉండదు. అది లేనినాడు కథలో అసందర్భాలు అసంగతాలు ఉండవు. అవి లేకపోతే, నటీనటులకృషి ఫలిస్తుంది. ఆధారాధేయసూత్రంమీద నడిచే శాఖోపశాఖల చిక్కులన్నీ సర్దుకుని ఫలితాలు మరింత బాగుంటాయనిపిస్తుంది.

సర్వదుఃఖాలకూ మూలకారణం పుట్టుకేనన్నాడు ఒక మహాప్రవక్త.

అలాగే చలన చిత్రంలో లోపాలకూ చిక్కులకూ మూలకారణం వెతగా కథ అని విదితం అవుతుంది. కథ అంటే కాగితం మీద రాసినది కాదు. తెరమీద చెప్పేవది. ఇంతకుముందు పేర్కొన్నట్టు మొదట కథ తీసుకున్నపుడు ఊహ మంచిదే అయివుండవచ్చు. దరిమిలా దానికి చలనచిత్ర కథగా రూపం ఇవ్వడంలోనే ఉంది కష్టం అంతా. అసలుకథను గుర్తించుకుని, దాన్ని బట్టి, కథన విధానాన్ని దాంతో సొగసునూ సౌలభ్యాన్నీ చూచుకుని, ఆ సినిమా కథకు రూపం నిర్ధారణ చెయ్యడం జరగాలి. తీసుకున్నకథ 17 వేల అడుగులు రాకపోతే, సాగతియ్యడం బదులు ఇంకో కథ, ఆ నిడివికి తగినదే తీసుకోవడం మెరుగు.

ఇపుడు తయారవుతున్న చిత్రాల తీరుతెన్నులు చాలవరకూ ఈ కట్టుదిట్టాలతో ఒప్పుతున్నట్లు కనబడవు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



"రతిసుఖసారే గతమభిసారే..."

18 వ శతాబ్దపు కాంగ్రా చిత్రం.

Regd. No. M. 4479.

పాండ్స్ కోల్డ్ క్రీమ్‌ను వాడే ఆమెను అతను మెచ్చుకొనును!



మీరు ముఖము కడుగుకున్న తరువాత ఎల్లప్పుడూ అద్భుతమైన పాండ్స్ కోల్డ్ క్రీమ్‌ను వాడండి. ఇది కడుగుకుపోతున్న, చర్మమునకు రక్షణ యిచ్చే నూనెలను తిరిగియిచ్చి మీ చర్మమును లేతగా మరియు నిష్కళంకముగా ఉంచును. పాండ్స్ కోల్డ్ క్రీమ్ సులభముగా చర్మములోకి చొచ్చుకొనిపో... ముఖమును శుభ్రముగా ఉం...

ఉచిత పుస్తకము

Lovelier with Pond's అనే సౌందర్యమును గురించిన మా ఇంగ్లీషు పుస్తకము కావాలని యీ ఎడ్రసుకు వ్రాయండి: పి.ఓ. బాక్సు నెం. 1612, బొంబాయి 1.

P 4440(A)